ఫన్‌డే
గత వారంరోజుల్లో విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

శ్రీకాకుళం

బడా టెర్రరిస్టు బాగుఖాన్ హతం

ట్రంప్ అనారోగ్యంపై సోషల్ మీడియాలో వైరల్

5

: fb.com/vaartha Digital

Published from Srikakulam ,Visakhapatnam,Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

31-8-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 210 పేజీలు: 12 వెల: 8.00

# చైనాలో ప్రధాని మోడీ

## ఏడేళ్ల తర్వాత బీజింగ్‌కు మొదటిసారి



టియాంజిన్ ఎయిర్‌పోర్టులో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న అధికారులు

**బీజింగ్, ఆగస్టు 30:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ చైనా చేరుకున్నారు. దాదాపు ఏడేళ్ల తర్వాత బీజింగ్‌లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా టియాంజిన్ ఎయిర్‌పోర్టులో ప్రధానికి రెడ్‌కార్పొట్ వేసి అక్కడి అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ నెల 31 నుంచి సెప్టెంబరు 1 వరకూ.. రెండు రోజులపాటూ చైనాలో ప్రధాని పర్యటించనున్నారు. అక్కడి టియాంజిన్‌లో జరగనున్న షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. ఈ పర్యటన సందర్భంగా తొలిరోజు 31న చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మోడీ ద్వైపాక్షిక చైనా పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, ప్రధాని మోడీ చైనాలో పర్యటించడం ఏడేళ్లలో ఇదే తొలిసారి. చివరి సారిగా 2018లో పర్యటించారు. తర్వాత చైనా అధ్యక్షుడు 2019లో భారత్‌లో పర్యటించారు. ఆ తర్వాత 2020లో లద్ధాఖ్ సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆ తర్వాత గత >>2

# రాయలసీమను అగ్రగామి చేస్తా

## 2027 కల్లా పోలవరం పూర్తి

### ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం

### వృథా జలాల సద్వినియోగంపై తెలంగాణ నేతలు యోచించాలి

### యేడాదిలోనే 10 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయులు

### కుప్పంలో కృష్ణాజలాలకు సిఎం చంద్రబాబు జలహారతి




శనివారం కుప్పంలోని పరమసముద్రం వద్ద కృష్ణాజలాలకు జలహారతి ఇస్తున్న సిఎం చద్రబాబు

**కుప్పం, ఆగస్టు 30 ప్రభాతవార్త:** ఒకప్పటి రత్నాలసీమ అయిన రాయలసీమను అన్ని రంగాల్లో అగ్రగామిగా చేస్తానని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. శనివారం కుప్పం మున్సిపల్ పరిధి పరమసముద్రం వద్ద కృష్ణాజలాలకు ముఖ్యమంత్రి జల హారతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరం గసభలో సిఎం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రాయలసీమ అభివృద్ధి బ్లూప్రింట్ రూపొందించామన్నారు. గాలేరు -నగరి ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటు ఇక్కడ ఉద్యానవన పంటల సాగుకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. డిఫెన్స్, ఏరోస్పేస్, గ్రీన్ హై డ్రో ప్రాజెక్టులను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. రాయలసీమ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించడంతో పాటు రోడ్లు, ఎయిర్ పోర్టులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో రాయల సీమలో ఫ్యాక్షనిజం ఉండేదని దాన్ని లేకుండా చేసి చూపిం చామన్నారు. రాయలసీమను రక్తపాతం చేయాలనేది వైఎస్సార్సీ ఆలోచన అని అది ఓ విషవృక్షం అని విమర్శించారు. రాజకీయా ల ంటే రౌడీయిజం కాదని ప్రజలకు జవాబుదారీ అన్నారు. అభి వృద్ధి, సంక్షేమంలో పోటీపడాలన్నారు. వైఎస్సార్సీ నేతలు మంచి పనుల్ని అడ్డుకుంటున్నారని ఎవరు అడ్డుపడినా తన సంకల్పాన్ని దెబ్బ తీయలేరని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో రాయలసీమలో వైఎస్సార్సీకి 7సీట్లే వచ్చినా వారు మారలేదన్నారు. కుప్పంలో రప్పా.. రప్పా రాజకీయాలు చేశారని >>2

# 100 గ్రామాల్లో 'మ్యాజిక్ డ్రైన్లు'

## రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబరు 1న ఒకేసారి శంకుస్థాపనలు



**విజయవాడ, ఆగస్టు30, ప్రభాతవార్తప్రతినిధి:** జిల్లాకు 4 తక్కువ కాకుండా రాష్ట్రవ్యాప్తంగా వంద గ్రామాల్లో ప్రయోగాత్మకంగా మ్యాజిక్ డ్రైన్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పారిశుధ్య సమస్య పరిష్కారానికి భూగర్భ జలాల పెంపుదలకు దోహదం చేసే డ్రైన్లకు సెప్టెంబరు 1న రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి శంఖుస్థాపనలు చేయనున్నారు. 100 గ్రామా ల్లోనూ 77 కిలోమీటర్ల పొడవునా రూ.5.50 కోట్లతో మ్యాజిక్‌డ్రైన్ల పనులు చేపట్టనున్నారు. రాష్ట్రంలో ప్రయోగత్మాకంగా ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం సోమవరం గ్రామంలో చేపట్టిన మ్యాజిక్ డ్రైన్‌తో సత్ఫలితాలు రావ డంతో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతానికి వంద గ్రామాల్లో చేపట్టి దశల వారీగా మిగిలిన చోట్ల డ్రైన్లు నిర్మించనున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ నిధులను ఇందుకోసం ఖర్చు చేయనున్నారు. సిమెంటు కాలువల నిర్మాణానికి కిలో మీటరుకు రూ.50 లక్షల వరకు ఖరవుతుంది. మ్యాజిక్ డ్రైన్ కిలోమీ టరు పనులు రూ.7 లక్షలతో పూర్తి చేస్తారు.





న్యూఢిల్లీలో శనివారం అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్-25 బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

# భవిష్యత్ పెట్టుబడి కేంద్రంగా అమరావతి

## కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు

**విజయవాడ, ఆగస్టు 30, ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి భారత అభివృద్ధి చరిత్రలో కీలక పాత్ర పోషించబోతోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ప్రతిష్టాత్మకంగా న్యూఢిల్లీలో ప్రారంభమైన 17వ నారెడ్కో జాతీయ సదస్సులో శనివారం అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్ 2025 బ్రోచర్ ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు ఆవిష్కరించారు. అమరావతిని భవిష్యత్‌లో రియల్‌ఎస్టేట్, మౌలిక సదుపాయాల ముఖ్య కేంద్రంగా ప్రదర్శిం చడానికి ఈ ఫెస్టివల్ ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ, ఈ ఫెస్టివల్ ఆంధ్రప్రదేశ్ పెట్టుబడిదారులను ప్రపంచస్థాయి భాగస్వాములతో కలిపే వేదికగా మారుతుందని పేర్కొన్నారు. ఆధునిక పట్టణ రూపకల్పన, స్మార్ట్ మౌలిక వసతులు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలతో అమరావతి ఆదర్శ రాజధానిగా రూపుదిద్దుకుంటుందని ఆయనస్పష్టం చేశారు. రియల్ ఎస్టేట్ నిపుణులు ఈ సందర్భంగా మాట్లాడుతూ, అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్ 2025లో నివాస, వాణిజ్య ప్రాజెక్టులతో పాటు ప్రభుత్వ దూరదృష్టి, పెట్టుబడి సౌహార్ధ విధానాలు, సమగ్ర టౌన్‌షిప్ ప్రణాళికలు >>2

# సగటు మనిషి ఆవేశమే జనసేన



విశాఖలో శనివారం జరిగిన సేనతో సేనాని సభలో డి.సిఎం పవన్

## 11 యేళ్ల ప్రయాణంలో కుటుంబం, సినిమాల కంటే పార్టీ పైనే దృష్టి పెట్టా

### వీర మహిళలకు 33 శాతం రిజర్వేషన్

### విశాఖ సభలో పార్టీ అధినేత, డి.సిఎం పవన్ కల్యాణ్

**విశాఖపట్నం, ఆగస్టు 30, ప్రభాతవార్త:** వాస్తగటు మనిషి ఆవేశం నుండి పుట్టిందే జనసేన పార్టీ అని డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యా ణ్ అన్నారు. శనివారం మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే సేనతో సేనాని బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. మూడు రోజులపాటు విశాఖలో నిర్వహించిన రాజకీయ సమావేశాలు శనివారంతో ముగిసాయి. చివరి రోజు బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ జనసేనపార్టీలో క్రియాశీలక కార్యకర్తలు రాజకీయంగా ఎదగడం కోసం త్రిసూల్ అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని చెప్పారు. త్రిశూలంఅంటే శక్తి, ధర్మం, రహస్యం. అలాగే క్రియాశీలక కార్యకర్తలకు గుర్తింపు, నాయకత్వం, భద్రత కల్పించనున్నామని, దసరా నుంచి ఈనూతన కార్యక్రమం ప్రారంభించ నున్నామని తెలియజేశారు. తాను రాజకీయంగా అడుగులు వేసిన తొలి రోజుల్లోనే అనేకమంది యువతీ, యువకులు తన వెంట నడిచారని, తనకోసం ఎన్నో పోరాటాలు చేశారని అన్నారు. నోవాటెల్ హోటల్లో పోలీసులు తనను నిలువరిస్తే మూడేళ్ల బిడ్డను చంకనెత్తుకొని ఒక వీర మహిళ రాత్రంతా బీచ్ ఒడ్డున తనకోసం కూర్చోవడం తనను ఎంతగానో కదిలించిందని పవన్ కళ్యాణ్ చెప్పారు. తనకు రాజకీయాలపై అవగాహన లేదని కొంతమంది పెద్దలు అంటుంటారు. అవగాహన లేకుండానే రాజకీయ పార్టీ పెట్టామా? రగిలే అగ్నిగుండం నుంచి పుట్టిన పార్టీ జనసేన అని పవన్ ఉద్ఘాటించారు. పార్టీ ఆవిర్భావం తర్వాత తను ఇతర విషయాలపై దృష్టి సారించలేకపోయానని, కార్యకర్తలతో కలిపి ఉద్యమాలు చేశానని రాజకీయంగా ఎన్నో >>2



# ఇజ్రాయెల్ దాడుల్లో హూతీల ప్రధాని అహ్మద్ రహావీ హతం



**సనా, ఆగస్టు 30:** యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారుల స్థావరాలపై ఇజ్రాయెల్ భీకర దాడులుచేస్తోంది. హూతీల నియంత్రిత ప్రాదేశిక ప్రాంతానికి ప్రధానిగా కొనసాగుతున్న అహ్మద్ అల్ రహావీని దళాలు హతమార్చాయి. హూతీలు ఈ మృతిని తాజాగా ధృవీకరించారు. ఈ వారం ఆరంభంలో రాజధాని సనా వ్యాప్తంగా ఇజ్రాయెల్ నిర్వహించిన దాడుల్లో సుమారు 10 మంది మృతిచెందగా 100 మందికిపైగా గాయపడ్డారని హూతీనేతలు ప్రకటించారు. రాజధాని సనాలో హైతీ పాలకుల సైనిక స్థావరమే లక్షనయంగా వైమానిక దాడులునిర్వహించినట్లు ఇజ్రాయెల్‌ప్రకటించింది. ఈ దాడుల్లో ప్రముఖులందరినీ మట్టుబెట్టామని తెలి పింది. ఈ దాడుల్లో ప్రధాని అహ్మద్ ఆల్ రహావీతోపాటు పలువురు మంత్రులు మృతిచెందారని హూతీలు శనివారం వెల్ల డించారు. ప్రభుత్వ కార్యకలాపాలు పనితీరును విశ్లేషించేందుకు మంత్రులతోప్రధాని సమావేశమైన సందర్భంగా ఈ దాడులుచేసారని, 2024ఆగస్టునుంచి రహావి హూతీల నియంత్రితప్రాంతానికి ప్రధానిగా ఉన్నట్లు హూతీనేతలు >>2

# పి-4కు విస్తృత ప్రచారం

## పేదరిక నిర్మూలనే లక్ష్యంగా అమలు చేస్తున్న పథకం

### మార్గదర్శకాలపై ఎలాంటి ఒత్తిడి లేదు

### ఈ పథకంతో ఎంతో తృప్తికలుగుతోంది: సిఎం చంద్రబాబు





**విజయవాడ, ఆగస్టు 30, ప్రభాతవార్తప్రతినిధి:** పేదరిక నిర్మూలనే లక్ష్యంగా అమలు చేస్తున్న జీరో పావర్టీ పీ4 పథకానికి మరింత విస్తృత ప్రచారం చేపట్టాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పేర్కోన్నారు. ఆ మేరకు ఆయన క్షేత్రస్థాయి నుంచి స్థానిక సంస్థల ప్రజాప్రతి నిధులకు, ఎంఎల్ఏలను, మంత్రులను ఆదేశించారు. పీ4 పథకంపై ఆయన లేఖా సందేశాలు వారందరికి అందాయి, సంపాదనతో కలగని సంతృప్తి సాయం చేస్తే కలుగుతుందని ముఖ్యమంత్రి అన్నారు. పీ4పథకం పరిధిలో రావాలని మార్గదర్శకులను ఎవ్వరిని ఒత్తిడి చేయడం లేదు. వారు స్వచ్ఛందంగానే రావాల్సి ఉంటుంది. పారిశ్రామికవేత్తలను పెట్టుబడులు పెట్టాల్సిందిగా గతంలో కోరేవాడినని.. ఇప్పుడు పెట్టుబడులు పెట్టడంతో పాటు.. పేదలకు సాయం చేయాలని కూడా అడుగుతున్నానని చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శులుగా ఉండాలని చంద్రబాబు పారిశ్రామిక వేత్తలను కోరారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.."పీ4 కార్యక్రమం గురించి తలుచుకున్న ప్రతిసారి కొత్త ఉత్సాహం వస్తుంది. ప్రజల భాగస్వామ్యంతోనే ఏ కార్యక్రమాన్నైనా విజయవంతం చేయగలం. నాది సుదీర్ఘ రాజకీయ జీవితం. జాతీయ స్థాయి రాజకీయాలపై ప్రభావం చూపించాం. ఉమ్మడి రాష్ట్రంలో, విభజన ఆంధ్రప్రదేశ్‌లో, జాతీయస్థాయి రాజకీయాల్లో చాలా క్రియాశీలంగా పని చేశాం. ఎన్నో సంస్కరణలు తెచ్చాను. కానీ ఎప్పుడూ కలగని తృప్తి.. పీ4 కార్యక్రమం ద్వారా కలుగుతోంది. సంస్కరణల వల్ల సమాజంలో చాలా మార్పు వచ్చింది. ఒకప్పుడు వందల కోట్ల రూపాయలతో పెట్టుబడులు పెడితే చాలు అవి అతి పెద్ద ప్రాజెక్టులుగా ఉండేవి.. కానీ ఇప్పుడు రూ.లక్షల కోట్ల ప్రాజెక్టులు >>2



# కొడాలి నానికి బెయిల్ షరతుల నుంచి విముక్తి

**విజయవాడ, ఆగస్టు 30, ప్రభాతవార్త ప్రతినిధి:** వైసీపీ నేత, మాజీ మంత్రి కొడాలి నానికి నేటితో బెయిల్ షరతుల నుంచి విముక్తి లభించింది. ఆయన బెయిల్ షరతుల గడువు నేటితో పూర్తి అయింది. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావు వస్త్ర దుకాణంపై దాడి కేసులో బెయిల్ పొందిన కొడాలి నానికు.. గుడివాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ప్రతి మంగళ, శనివారాల్లో సంతకాలు చేయాలని షరతులు విధించి కోర్టు బెయిల్‌మంజూరు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై కొడాలి నానిపై కోర్టుకు వెళ్లడంతో శనివారం ఒక్కరోజు సంతకాలు చేస్తే సరిపోతుందంటూ హైకోర్టు షరతుల్ని సడలించింది. అయితే, 2నెలలు సంతకాలు చేయాలన్న హైకోర్టు ఆదేశాలు కూడా నేటితో పూర్తి అవడంతో కొడాలి నాని ఇక స్టేషన్‌కు వెళ్లి సంతకాలు చేయాల్సిన పరిస్థితి లేకుండాపోయింది.

# తిరుమల బస్సుల్లో లేని 'స్త్రీ శక్తి'





## రోజుకు సగటున 25 వేల మంది మహిళల ప్రయాణం

### పథకం అమలు చేసే విషయం పరిశీలిస్తామన్న సిఎం చంద్రబాబు

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అమలుచేసిన ఆర్టీసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం (జీరోఫేర్‌టిక్కెట్)తిరుమలకు నడిచే ఆర్టీసి బస్సుల్లో అమలుకు నోచుకోలేదు. ఈ హామీపై అటు వైసిపి నేతల్లో ఇటుమహిళ సంఘాల్లో తీవ్రవిమర్శలు వ్యక్తమయ్యాయి. ఘాట్‌రోడ్లలో స్త్రీశక్తిపథకం అమలుపై అధ్యయనం చేసి అమలుచేసే దిశగా పరిశీలిస్తామనే విషయంపై ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆర్టీసి ఎండి ద్వారాకాతిరుమలరావు సూచాయప్రాయంగా వెల్లడించారు. ఈ పథకం అమలై రెండు వారాలు గడుస్తున్నా తిరుమలకు మాత్రం స్త్రీశక్తి పథకం అమలుకావడం లేదు. ప్రతిరోజూ లక్షమందివరకు భక్తులు పలు రకాలుగా తిరుమలకు చేరుకుంటున్నా ఇందులో 25 వేల మంది వరకు మహిళ భక్తులు తిరుమల ఘాట్‌లో సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌బస్సుల్లో ప్రయాణంచేస్తున్నారనేది సమాచారం. ప్రస్తుతం తిరుపతి-తిరుమల, తిరుమల -తిరుపతి మధ్య ఘాట్‌లో తిరిగే ఆర్టీసి సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌బస్సులు, విద్యుత్ ఏసి బస్సుల్లో వర్తించడం లేదు. రాష్ట్రం నలుమూలల నుండి తిరుమలకు వస్తున్న మహిళ ప్రయాణీకులు ఎప్పటిలాగే టిక్కెట్ కొనుగోలుచేసి ఆర్టీసి బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. తిరుమలఘాట్‌లో నడిచే ఆర్టీసి బస్సుల్లో బస్సుఛార్జీ ఒక్కో ప్రయాణీకునికి 90రూపాయలు (ఒకవైపుప్రయాణం)వసూలుచేస్తున్నారు. తిరుగుప్రయాణంలోనూ (తిరుపతికి) 90 రూపాయలు టిక్కెట్ ధరగా అమల్లో ఉంది. ఎవరైనా భక్తులు రానుపోను (అప్,డౌన్)టిక్కెట్లు కొనుగోలుచేస్తే వీరికి 20 రూపాయలు ఆదా అయ్యి 160 రూపాయలతోనే టిక్కెట్ పొందిన భక్తులు తిరుమలకు చేరుకుంటే ఆ భక్తులు 72గంటల్లో (మూడురోజులపాటు )తిరుమల నుండి తిరుపతికి ఏ ఆర్టీసి బస్సుల్లోనైనా ప్రయాణించే సదుపాయం ఉంది. 12సంవత్సరాలు దాటిన పిల్లలకు 50రూపాయలు బస్సుటిక్కెట్ అమలులో ఉంది. రెండువైపులా టిక్కెట్ 100 రూపాయలు. రానుపోను టిక్కెట్ ఒకేసారి తీసుకుంటే వీరికి 10 రూపాయలు ఆదా అవుతుంది. ఇక విద్యుత్‌తో నడుస్తున్న ఆర్టీసి ఏసి బస్సుల్లో ఒక్కో ప్రయాణీకునికి >>2

# నన్ను చంపాలని రౌడీ షీటర్ల కుట్ర

## ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తన వ్యక్తిగత ప్రమాదం గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు రూరల్ టిడిపి కార్యాలయంలో శనివారం విలేకరులతో సమావేశమైన ఆయ న, రౌడీ షీటర్లు తనను హత్య చేయాలని కుట్ర చేశారని తెలియజేశారు. ఇటీవల విడు దలైన ఒక వీడియోను చూసి షాక్‌కి గుర య్యానని అన్నారు. నెల్లూరులో రాజకీయా లు ఎంతో హుందాగా రాష్ట్రంలోనే నెల్లూరు జిల్లాకు రాజకీయాలకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని అలాంటిది ప్రశాంతంగా ఉన్న నెల్లూ రులో రౌడీలు బహిరంగంగా మాట్లాడటం ఆందోళన కలిగించిందన్నారు. ఈ కుట్ర గురించి మూడు రోజుల కిందటే పోలీసు అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ, తనకు తెలపలేదు అని ఆయన అన్నారు. ఈ కుట్ర పోలీసులకు తెలిసిన దానిపై ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. రౌడీషీటర్లు నన్ను చంపితే >>2



బీహార్‌లో శనివారం 'ఓటరు అధికార్ యాత్ర'లో పాల్గొన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్, ఎస్పీ అధినేత అఖిలేష్,ఆర్జేడీ నేత తేజస్వియాదవ్

## తిరుమల బస్సుల్లో లేని 'స్త్రీ శక్తి'

>> 110రూపాయలు ఛార్జీ వసూలుచేస్తున్నారు. తిరుపతి నుండి తిరుమలకు 40వేలమంది నుండి 50వేలమంది వరకు భక్తులు ఆర్టీసి బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారనేది ఆర్టీసి అధికారుల సమాచారం. 2019లో రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత అమాంతం బస్సు ఛార్జీలు విపరీతంగా పెంచారు. ఈ పెరిగిన ఛార్జీలు తిరుమల ఘాట్‌లో ప్రయాణీకులకు వర్తించింది. 18కిలోమీటర్ల ఘాట్‌లో ప్రయాణానికి 90రూపాయలు తిరుమలకు బస్సు టిక్కెట్ వసూలుచేస్తున్నారు. తిరుమలకు 450వరకు వివిధ డిపోలకు చెందిన ఆర్టీసి సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సులు ప్రతిరోజూ నడుస్తున్నాయి.

**తిరుమల ఘాట్‌లో "స్త్రీశక్తి"తో ఇబ్బందులే!**

ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడ నుండి ఎక్కడికైనా మహిళలు ఆధార్‌కార్డు, ఓటరుకార్డు,డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంతో చూపి ఉచితంగా ఆర్టీసి నడుపుతున్న పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించేలా చూస్తారు. తిరుమల-తిరుపతి మధ్య ఘాట్‌లో నడిచే ఆర్టీసి సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితప్రయాణం అమలుచేస్తే టిటిడిలో 6,700మంది ఉద్యోగులుండగా వారిలో 2,500నుండి 3వేలమంది వరకు మహిళ ఉద్యోగులు ఉన్నారు. ఐదారువందల మంది వరకు మహిళ ఉద్యోగులు తిరుమలలో విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా తిరుపతిలో కాపురముంటూ తిరుమలలోనే పారిశుధ్యం, గదుల శుభ్రత,ఆరోగ్యవిభాగంలో పనిచేస్తున్న మహిళలు ఉన్నారు. ఇప్పుడు వీరందరికీ ఆయా ఏజెన్సీలు మూడునెలలకోసారి ఆర్టీసి బస్సుపాస్‌లు జారీచేస్తున్నారు .దీనికి సంబంధించిన నగదుమొత్తాన్ని వారి జీతం నుండి మినహాయింపు చేసుకుని పాస్‌లు మంజూరు చేయిస్తున్నారు. ఈ బస్సుపాస్‌లు కలిగిన ఉద్యోగులు, సిబ్బంది మొత్తం పలు సమయాల్లో తిరుమల-తిరుపతి, తిరుపతి- తిరుమల మధ్య ప్రయాణిస్తున్నారు. ఘాట్‌లో ఉచిత ప్రయాణం అంటే టిటిడిలో పనిచేస్తున్న మహిళ ఉద్యోగినులతో ఆర్టీసికి నష్టం వస్తుందని ఆర్టీసి యూనియన్ వర్గాలు అభిప్రాయం. మరీ తిరుమల సప్తగిరి బస్సుల్లో "జీరోఫేర్" టిక్కెట్ మాట సందిగ్ధంగా మారింది. ఆర్టీసి అధికారులు మాత్రం ఈ విషయంపై అధికారికంగా జిఒ రాలేదని చెబుతున్నారు.

## కుప్పంకు జగన్ నీళ్లిస్తే చంద్రబాబు తన ఖాతాలో వేసుకున్నారు

### మాజీ మంత్రి అంబటి రాంబాబు

**విజయవాడ,ఆగస్టు30,ప్రభాతవార్తప్రతినిధి:** కుప్పంకు జగన్‌మోహన్ రెడ్డి నీళ్లిస్తే చంద్రబాబునాయుడు తన ఖాతాలో వేసుకుంటున్నాడని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శనివారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో ఎవరు మంచి పనిచేసినా అది తనదేనని క్రెడిట్ వేసుకోవడంలో చంద్రబాబు దిట్టని తెలిపారు. శ్రీశైలం నుండి కుప్పం 720 కిలోమీటర్లు ఉంటుందని, 15 నెలలకాలంలో 560 కిలోమీటర్ల కాల్వ తవ్వి నీళ్లు తీసుకెళ్లినట్లు చెబుతున్నారని అన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉండగా చంద్రబాబు కప్పానికి ఎందుకు నీళ్లు తీసుకురాలేకపోయారని ప్రశ్నించారు. 14 ఏళ్లలో ఆ పని చేయలేదని, జగన్ చేస్తే తాను చేసినట్లు చెప్పుకుంటున్నాడని అన్నారు.

## పార్లమెంటు ఆవరణలో జగన్నాథ రథ చక్రాలు!

**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** పార్లమెంటు ఆవరణలో ప్రపంచ ప్రఖ్యాత పూరీ జగన్నాధ రథచక్రాలు పార్లమెంటు ఆవరణలో ఏర్పాటుకానున్నాయి. ఇందుకు సంబంధించి పార్లమెంటుస్పీకర్ ఓం బిర్లా ఆమోదించినట్లు జగన్నాథ రథ మందిర చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అరబింద పధీ తెలిపారు. ఇందుకు సంబంధించి లోక్‌సభ స్పీకర్ జగన్నాథ మందిర సందర్శన సందర్భంగా ప్రతిపాదనను అందచేసామని ఇందుకు స్పీకర్ సంతోషంగా స్వాగతించారని ఆయన అన్నారు. ఇదే ప్రతిపాదనను అంతకుముందే ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ మాఝీ, న్యాయశాఖమంత్రి పృథ్వీరాజ్ హరిచందన్‌లతో కూడా చర్చించినట్లు ఆయన తెలిపారు. బలభద్ర రథం కూల్చివేసిన తర్వాత ఆ రథ చక్రాలు, అలాగే దేవిసుభద్ర రథం దర్పదలాన రథాన్ని పూర్తిగా వేరుచేసామని జగన్నాథుని రథం భాగాలను వేరుచేసే ప్రక్రియ ప్రారంభించామని చీఫ్ అడ్మినిస్ట్రేటర్ తెలిపారు. ఈ రథచక్రాలను వేరుచేసే కార్యక్రమం పూర్తిచేసిన తర్వాత ఢిల్లీ కొత్తపార్లమెంటు ఆవరణకు వీటిని అత్యంత భద్రత మధ్య తరలిస్తామని, పార్లమెంటు ఆవరణలో నిర్దేశిత ప్రాంతంలో ఈ జగన్నాథ రథచక్రాలను ఏర్పాటుచేసే విధంగా స్పీకర్ తమకు అంగీకారం తెలిపినందున విశ్వవిఖ్యాత జగన్నాథ రథచక్రాలు ఇకపై పార్లమెంటు ఆవరణలో కూడా దర్శనమిస్తాయని ఆయన అన్నారు.

## నిరంతరాయంగా 9 రోజులు భరతనాట్య ప్రదర్శన

### 216 గంటల ప్రదర్శనతో ప్రపంచ రికార్డు సాధించిన విదుషి దీక్ష

**ఉడిపి(కర్ణాటక), ఆగస్టు 30:** ప్రముఖ భరత నాట్యకళాకారిణి విదుషి దీక్ష నిరంతరాయంగా 216 గంటలపాటు నృత్యప్రదర్శన ఇచ్చి కొత్త ప్రపంచ రికార్డును నమోదుచేసింది. గతంలో 170 గంటల రికార్డును కూడా ఆమె అధిగమించారు. ఈనెల 21వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభించిన ఈ రికార్డు ఆగస్టు 30న ముగిసింది. తొమ్మిదిరోజులపాటు నిరంతరాయంగా నృత్యంచేసిన మారథాన్ తర్వాతనే ఈ ప్రదర్శన జరిగింది. బ్రహ్మావర్ తాలూకాలోని ముండింజిడ్డుకు చెందిన దీక్ష భరత నాట్యంలో గొప్ప శిఖరాలను చేరుకోవాలనిచాలాకాలంగా ఆకాక్షంతో ఉంది. ఈ దీక్షతోనే ఆమె కఠినమైన తొమ్మిదిరోజుల లక్ష్యాన్ని పూరినతచేసేలా పురికొలిపింది. ఈనెల 28వ తేదీకల్లా ఆమె 170 గంటలప్రదర్శన పూర్తిచేసింది. మంగళూరుకు చెందిన రెమోనా ఎవెట్ పెరీరా నెలకొల్పిన గత రికార్డును బ్రేక్‌చేసింది. పెరీరా 170 గంటలపాటు నృత్యప్రదర్శనచేసి గోల్డెన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదయింది. ఇపుడు దీక్ష రికార్డుప్రయత్నానికి ఉడిపి మాజీ ఎమ్మెల్యే కె.రఘుపతిభట్ మార్గదర్శకత్వంలో మణిపాల్‌లోని రత్న సంజీవకలామండల మద్దతు పుష్కలంగా లభించింది. శనివారం దీక్షను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డికెశివకుమార్ ఘనంగా సత్కరించారు. ఈరోజు ఉడిపిలో ఉండటం నాకు చాలా సంతోషంగా ఉందని, ఇక్కడి ఆలయాన్ని సందర్శించడకూడా నా చిరకాల స్వప్నం అని అన్నారు.

## పెట్టుబడి కేంద్రంగా అమరావతి

>> ప్రదర్శించబడతాయని తెలిపారు. దేశం నలుమూలల నుంచే కాక విదేశాల నుంచి కూడా పెట్టుబడిదారులు, అభివృద్ధిదారులు, ఎన్‌ఆర్‌ఐలు, విధాన నిర్ణేతలు హాజరవుతారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గోతు సిరీష, ఏపీ సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి. సూర్య ప్రవీణ్, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫ రాజ్ అహ్మద్, నారెడ్కో జాతీయ అధ్యక్షుడు జి. హరిబాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు జి. చక్రధర్, సెంట్రల్ జోన్ అధ్యక్షుడు సందీప్ మండవ,రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కిరణ్ పారుచూరి తదితరులు హాజరయ్యారు.

## శివశంకర్ ఐఎఎస్‌ను ఎపికి కేటాయిస్తూ కేంద్రం ఆదేశాలు!

**విజయవాడ, ఆగస్టు30,ప్రభాతవార్తప్రతినిధి:** లోనీ తేటి శివశంకర్‌ను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించాలంటూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను అమలు కేంద్ర పరిపాలన శాఖ చేసింది. తక్షణమే శివశంకర్‌ను రిలీవ్ చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి ఆదేశాలు. జారీ చేసింది.దీంతో ఆంధ్రాకు రావాలనే ఆకాంక్షతో న్యాయపోరాటం చేస్తున్న తేటి శివశంకర్ ఆకాంక్ష నెరవేరబోతుంది.

## రౌడీ షీటర్ల కుట్ర

>>డబ్బు ఇస్తామనడం వల్ల, ఎవరు వారికి డబ్బు ఇస్తా రో బయటపడాలనన్నారు. ఈ విషయంపై పూర్తి విచారణ జరిపి నిజాన్ని వెలికితీయాలని పోలీసు శాఖను కోరారు. నాపై ఈ హత్య కుట్ర వెనుక ఎవరు న్నారు తెలియకపోయినా వైసిపి నాయకులు దొంగ ఎవరంటే భుజాలు చందంగా వ్యవహరిస్తున్నారని వైఎస్ఆర్సిపి సోషల్ మీడియాలో సాక్షి ఛానల్‌లో పత్రికలో అడ్డగోలు రాతలకు రాస్తున్నారని విమర్శించారు. ప్రజలకు జవాబిదారి తరంగా ఉండాల్సిన వైసీపీ నేతలు అసెంబ్లీకి రాకుండా తప్పించుకుంటున్నారని, తిరుగుతూ ఇలాంటి వాటిని ప్రోత్సహిస్తున్నారని అన్నారు. రాజకీయాల్లో పార్టీ కోసం కుటుంబ సభ్యులను కూడా ఎదురుదాడి చేయడం వైఎస్ఆర్సిపి నాయకుల డిఎన్ఏలో ఉందని తీవ్రంగా విమర్శించారు. బెదిరింపులకు భయపడనని, విద్యార్థి నాయకుడిగా ఉండగా రౌడీలను ఎదుర్కొన్న అనుభవం తనదని చెప్పారు. వైసిపి పార్టీ నుంచి బయటకు వచ్చిన సమయంలో కూడా తాను, తన కుటుంబ సభ్యులు బెదిరింపులకు గుంయ్యారని వివరించారు.బండికి కట్టి తీసుకుపోయి హత్య చేస్తా అని బెదిరింపులు వచ్చినప్పటికీ లెక్క చేయలేదు అన్నారు, కార్యకర్తల కోసం ఎంతటి ప్రమాదమైనా ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. తనపై ఎన్ని వీడియోలు అయినా వైసీపీ సోషల్ మీడియాలో ఉంచినా,కార్యకర్తలు, ప్రజలు తనపై విశ్వాసంతో ఉన్నారని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న చంద్రబాబును చూసి వైసీపీ నేతలు అసహనానికి గురవుతున్నారని వ్యాఖ్యానించారు. తనను చంపితే డబ్బు ఇస్తామన్న వారి ఎవరో పోలీసు శాఖ గుర్తించాలి అని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి డిమాండ్ చేసారు.

## వారం - వర్జ్యం

**31-08-2025, ఆదివారం**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,**
**భాద్రపద మాసం, దక్షిణాయణం**
**వర్ష ఋతువు, శుక్లపక్షం**
అష్టమి రా.12.58
అనూరాధ సా.5.27
వర్జ్యం : రా.11.35-1.21
దు.సా.4.39-5.29
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** దూరప్రాంతాలలో ఉన్న మీవారికి సహాయసహకారాలు అందిస్తారు.

**వృషభం:** నూతన కార్యక్రమాలు సకాలంలో పూర్తిచేస్తారు. మిత్రులనుండి శుభవార్తలు అందుకుంటారు.

**మిథునం:** ఇంటర్వ్యూలలో, పోటీ పరీక్షలలో విజయంసాధిస్తారు. ఊహించని అవకాశాలు అప్రయత్నంగా లాభిస్తాయి.

**కర్కాటకం :** సంఘంలో గౌరవ ప్రతిష్టలు పొందుతారు. ఇంటా బయటా అనుకూల వాతావరణం లాభిస్తాయి.

**సింహం:** నూతన ఒప్పందాలు కుదురుతాయి. ఉద్యోగులు పదోన్నతులు పొందుతారు.

**కన్య :** అనుకోని ఆహ్వానాలు అందుకుంటారు. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది.

**తుల :** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి.

**వృశ్చికం:** ఆర్థికపరమైన లావాదేవీలు ఆశాజనకంగా ఉంటాయి. ఉద్యోగయత్నాలు ఫలిస్తాయి.

**ధనుస్సు:** భూములు, ఇళ్ల కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

**మకరం:** కుటుంబసభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. ఋణాలు తీరుస్తారు.

**కుంభం:** ముఖ్యమైన వ్యవహారాలు సకాలంలో పూర్తిచేస్తారు. బంధువులనుండి శుభవార్తలు అందుకుంటారు.

**మీనం :** సకుటుంబంగా వివాహాది శుభకార్యాలకు హాజరవుతారు. చర్చాగోష్ఠులలో పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రాయలసీమను అగ్రగామి చేస్తా

>> పులివెందుల, ఒంటిమిట్టలో ప్రజలు రప్పారప్పా చేశారని పేర్కొన్నారు. తాను ఏ పని కావాలన్నా తమ ఇంటిదైవం శ్రీవెంకటేశ్వరస్వామికి చెప్పుకుని బుల్లెట్‌లా దూసుకుపోతానని వెనుతిరిగే ప్రసక్తే ఉండదన్నారు. దివంగత ఎన్టీఆర్ సిఎంగా ఉన్నపుడు సీమకు సముద్ర జలాలు తేవాలని సంకల్పించారన్నారు. పాతికేళ్ల క్రిత ం రాయలసీమ ప్రాంతంలో పదేళ్లు పంట చేస్తే రెండేళ్లు మాత్రమే చేతికందేదని ఎడారి ప్రాంతంగా ఉండేదన్నారు. 1999లో తాను హంద్రీ-నీవా ప్రాజెక్టును ప్రారంభించానని పేర్కొన్నారు. 2014-19లో రాయలసీమ ప్రాజెక్టులకు 12500కోట్లు వ్యయం చేశామన్నారు. రైతులకు నీళ్లు ఇస్తే కొంతమంది జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. ప్రతి ఎకరాకు నీరు ఇచ్చే బాధ్యత తమదేనన్నారు. అసా ధ్యాన్ని సుసాధ్యం చేసేది ఎన్డీయే ప్రభుత్వం అన్నారు. కృష్ణాజలాలతో 6లక్షల ఎకరాల పంటసాగుకు 32లక్షల మందికి తాగునీరు అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లను ముందుచూపుతో నీటిని నింపుతామన్నారు.

**వృథా జలాలపై తెలంగాణా నేతలు ఆలోచించాలి**

ఏటా 1630టిఎంసిల మేర గోదావరి, 600టిఎంసిల మేర కృష్ణాజలాలు సముద్రం పాలవుతున్నట్లు సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ జలాలను వాడుకుంటే ఎపి, తెలంగాణాల్లో రాష్ట్రాల్లో కరువు ఉండదన్నారు. ఈ అ ంశంగా తెల ంగాణా నేతలు ఆలోచించాలని పేర్కొన్నారు. బనకచర్ల - పోలవరం ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం జరగదని పేర్కొన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజె క్టును 2027నాటికల్లా పూర్తి చేస్తామని సిఎం చంద్రబాబు ప్రకటించారు. 2020నాటికే పోలవరం పూర్తి కావాల్సి ఉండేదన్నారు. ప్రాజెక్టు డయాఫ్రంవాల్ వైఎస్సార్సీ పాల నలో కొట్టుకుపోగా మరలా 1000కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. వంశధార, పెన్నా పనుల అనుసంధానం చేయడ ం తమ జీవిత ఆశయమని పేర్కొన్నారు.

**సూపర్ సిక్స్ సూపర్‌హిట్ చేశాం**

రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలను సూపర్‌హిట్ చేశామని సిఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. పెన్షన్లు, తల్లికివందనం, అన్నదాత సుఖీభవ, మెగా డిఎస్సీ, మహిళలకు దీపం పథకంలో ఉచిత సిలిండర్లు, స్త్రీ శక్తి పథకంలో ఉచిత బస్సు ప్రయాణాలు అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏడాది పాలనలోనే 10లక్షల కోట్ల ఎంఒయులు వివిధ పరిశ్రమలతో కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా కుప్పం ప్రాంతంలో దాదాపు 4వేలకోట్లతో ఏర్పాటయే పరిశ్రమలకు సంబంధించి పారిశ్రామికవేత్తలతో ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి సమక్షంలో ఎంఒయులు జరిగాయి. కార్యక్రమాల్లో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు, రాష్ట్ర విద్య,మౌలిక వసతుల కార్పోరేషన్ ఛైర్మన్ రాజశేఖర్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కడ సభ్యుడు రాజ్‌కుమార్, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్ పాల్గొన్నారు.

# పి-4కు విస్తృత ప్రచారం

>> వస్తున్నాయి. ఆర్థిక సంస్కరణల వల్లే ఇది సాధ్యమైంది. 1995లో టెక్నాలజీలో వచ్చిన సంస్కరణల ద్వారా ఫలాలను అందిపుచ్చుకున్నాం. ఆర్థిక సంస్కరణలను కొందరు అందిపుచ్చుకున్నారు. కొందరు వెనుకబడ్డారు. సంస్కరణలను అందిపుచ్చుకున్న వారు ఉన్నత స్థానానికి చేరారు. అంబేద్కర్, ఎన్టీఆర్, అబ్దుల్ కలాం, మోదీ వంటి వారు సామాన్య కుటుంబాల్లోనే పుట్టారు. నాతో సహా అనేక మంది సాధారణ మధ్యతరగతి కుటుంబాల నుంచే వచ్చారు. నాడు సమాజం నుంచి ఎంతో సహకారాన్ని అందుకున్నాం.. ఉన్నతస్థితికి చేరాం. ఇప్పుడు అసమానతలు లేని సమాజం కోసం భాగస్వాములు కావాల్సిన అవసరం ఉంది. ఉన్నత స్థానంలో ఉన్నవారు చేసేది చిన్న సాయమే కావచ్చు.. పేదరికంలో ఉన్నవారికి ఆ సాయమే అతి పెద్ద ఆలంబనగా ఉంటుంది." అని చంద్రబాబు చెప్పారు.మాటలు చెప్పడం కాదు.. చేతల్లో చేసి చూపించాలనే ఉద్దేశంతో నేను కూడా 250 కుటుంబాలను దత్తత తీసుకున్నాను. మార్గదర్శిగా నిలిచాను. బంగారు కుటుంబాలను అభివృద్ధి చేసేందుకు నా సహచర మార్గదర్శకులతో పోటీ పడతా. ఇప్పటి వరకు 10,81,281 మంది కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. అనేక సంస్కరణలు వచ్చినా.. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినా.. ఇంకా పేదరికం ఉంటూనే ఉంది. పేదరిక నిర్మూలన చేపట్టాలనే ఆలోచన నుంచే పీ4 పుట్టింది. ఎంత సంపాదించినా ఇక్కడే వదిలి పెట్టి వెళ్లాలి.. అందుకే గివ్ బ్యాక్ పాలసీని అమలు చేయగలిగితే...సమాజానికి మరింత మంచి చేసిన వాళ్లు అవుతారు. పేదరికంలో ఉన్నవాళ్లకి చేయూతనివ్వాలి.. వాళ్లకు కెరీర్ గైడెన్స్ ఇవ్వాలి. సరైన సమయంలో గైడ్ చేయగలిగితే.. పేదరికంలో ఉన్న వాళ్లు కూడా మంచి స్థాయికి వెళ్లడానికి అవకాశం కల్పించినవారవుతారు. ప్రాధాన్యత క్రమంలో బంగారు కుటుంబాలకున్న అవసరాలపై సర్వే చేయించాం. ప్రభుత్వం వైపు నుంచి చాలా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. పింఛన్ ఇస్తున్నాం, తల్లికి వందనం ఇచ్చాం, దీపం పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఆర్థిక సాయం చేస్తున్నాం. అలాగే ఆగస్టు 15వ తేదీ నుంచి స్త్రీ శక్తి పేరుతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందివ్వనున్నాం. ప్రభుత్వ పరంగా మేం చేయాల్సిందంతా చేస్తున్నామన్నారు.ఉన్నత స్థితిలో ఉన్నవారు కూడా బాధ్యత తీసుకుంటే దత్తత కుటుంబాల్లో స్కిల్స్ పెంపొందించడం ద్వారా వారి ఆదాయాన్ని రెట్టింపు చేయవచ్చు. బంగారు కుటుంబాలను కూడా మీ కుటుంబాలుగా భావించి సాయం చేయండి." అని చంద్రబాబు కోరారు.

సమాజంలో మనతో ఉన్నవాళ్లు.. పేదరికంతో ఇబ్బందులు పడుతూ ఉండడం మంచిది కాదు. అవనిగడ్డలో ఓ పారిశుధ్య కార్మికురాలు కూడా మార్గదర్శిగా ఉండేందుకు ముందుకు వచ్చి.. ఓ పేద వృద్ధురాలిని ఆదుకునేందుకు సిద్దమైంది. నేను ఎవర్నీ బలవంతం పెట్టడం లేదు. బాధ్యతగా చూడాలనే చెబుతున్నాను. సాయం చేయడంలో రకరకాలు ఉంటాయి.. ఇటీవల కాలంలో కొందరు టీచర్లు ముందుకు వచ్చారు. చదువు చెప్పడం ద్వారా పేదల ఎదుగుదలకు తోడ్పడతామని చెబుతున్నారు. ఇలాంటి వారిని దృష్టిలో పెట్టుకుని కోస్పాన్సర్స్ విధానాన్ని తెస్తున్నాం. ఆర్థిక సాయంచేసే వారు చేస్తారు.విజ్ఞానాన్ని అందించేవారు కూడా ఆ దిశగా కృషి చేస్తారు. ఉమ్మడి ఎపికి విజన్ 2020 రూపకల్పన చేశాను. నన్ను విమర్శించారు. కానీ ఇప్పుడు ఆ విజన్ నిజమైంది. లక్ష్యంతో పని చేస్తే ఏదైనా సాధ్యం. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడైనా తెలుగువారిని ప్రపంచంలో అగ్రభాగాన నిలబెట్టే ఆలోచనలు చేస్తున్నాం. దేశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ముందుకు తీసుకెళ్తున్నారు. త్వరలోనే భారత్ ప్రపచంలో మూడో పెద్ద ఎకానమీగా ఎదగబోతోంది. భవిష్యత్తులో భారత దేశం ఎకానమీలో నెంబర్1 స్థానంలో ఉంటుంది. అభివృద్ధి ఫలాలు అందరికి అందాలనే ఉద్దేశంతో సంస్కరణలు అమలు చేస్తున్నాం." అని చంద్రబాబు వివరించారు.



చైనాలోని టియాంజిన్‌లో శనివారం ప్రధానమంత్రి మోడీకి స్వాగతం పలుకుతున్న కళాకారులు

# చైనాలో ప్రధాని మోడీ

>> సంవత్సరం అక్టోబరులో జరిగిన బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోడీ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశమయ్యాక ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధ్యాల పునరుద్ధరణ జరిగింది. నేరుగా విమాన సర్వీసులు, కైలాస్ మానససరోవర్ యాత్రను పునరుద్ధరించేందుకు ఈ సంవత్సరం జూన్‌లో ఇరు దేశాలు అంగీకరించాయి. ఈ ఎస్‌ఇఒ సదస్సుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సహా మధ్య, పశ్చిమ, దక్షిణ, ఆగ్నేయాసియా దేశాలకు చెందిన దాదాపు 20 మందికిపైగా ప్రపంచ నాయకులకు ఆహ్వానం అందింది.

# మనిషి ఆవేశమే జనసేన

>> ఒడిదుడుకులు ఎదుర్కొని ఇంత ఎత్తుకు ఎదిగానని ఆయన చెప్పారు. 12 సంవత్సరాల తర్వాత తన పార్టీ, క్యాడర్ తలెత్తుకునేలా చేశానని ఆయన చెబుతూ పార్టీ ఆవిర్భావంలో కేవలం 150 మంది కార్యకర్తలు మాత్రమే ఉండే వారిని ఇప్పుడు 12 లక్షల మంది క్రియాశీలక సభ్యులతో పార్టీని నడిపిస్తున్నామని పవన్ కళ్యాణ్ చెప్పారు. ప్రత్యర్థి పార్టీ తనపై ఎన్ని కుట్రలు పండినప్పటికీ వాటిని తట్టుకొని బలం పెంచుకున్నానని పవన్ కళ్యాణ్ వివరించారు. కాలం, సహనం తన రాజకీయ ఎదుగుదలకు కారణమని అన్నారు. పార్టీని స్థాపించినప్పుడు తన పార్టీ గురించి దేశమంతా మాట్లాడుకుంటుందని అనుకోలేదని,కార్యకర్తలు, వీర మహిళలు,మేధావులు ఇచ్చిన ప్రోద్బలమే ఇందుకు కారణం అని పవన్ తెలియజేశారు. తుపాకీ పట్టుకుంటేనే సమాజం బాగుపడుతుంది అనుకోవటం సరికాదు. దానికి శాంతియుత మార్గాలు కూడా ఉన్నాయని పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు. గత పాలకుల చంపుతామని అనేకసార్లు తనను బెదిరించారు.

ఇప్పుడు వారిని ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా ఉన్నానని పవన్ కళ్యాణ్ నొక్కి వక్కాణించారు.ప్రజల పట్ల అంకితభావం కలిగిన వారు మాత్రమే రాజకీయాలకు రావాలని అప్పుడే నాయకుల అవుతారని పవన్ చెబుతూ అలాంటి భావజాలం ఉన్నవారు ముందుకు వస్తే వారిని రాజకీయంగా ఎదిగేలా చేస్తానని చెప్పారు. నాయకులు కావాలనుకునేవారు ఇందుకు సిద్ధపడాలని పవన్ పిలుపునిచ్చారు. కాగా ఇకపై తాను సెంటర్ ఆఫీసులో కూర్చుని మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నాయకులను మానిటర్ చేస్తానని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గత పాలకులు రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేశారని వారిని ఎదుర్కొనేందుకే జనసేన పార్టీని స్థాపించామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందిస్తున్నామని, ఈ పథకాలను ప్రజలకు కార్యకర్తలు వివరించాలని మనోహర్ సూచించారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 450 కోట్ల రూపాయలతో ఋషి కొండపై ప్యాలస్ ను నిర్మించారని, ప్రజాధనం, పర్యావరణాన్ని నాశనం చేసి ఇంత భవంతిని నిర్మించటం అవసరమా అని మనోహర్ ప్రశ్నించారు.

## ఇజ్రాయెల్ దాడుల్లో హూతీల ప్రధాని అహ్మద్ రహావీ హతం

>> వెల్లడించారు. ఇరాన్‌మద్దతు ఉన్న హూతీ తిరుగుబాటుదారులు గాజా యుద్ధంనేపథ్యంలో పాలస్తీనియన్లకు మద్దతుగా ఇజ్రాయెల్‌పై దాడులుచేస్తోంది.

ఎర్రసముద్రంలో వాణిజ్యనౌకలు లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే అమెరికా నేతృత్వంలోని సంకీర్ణ సేనలు పలు సందర్భాల్లో యెమెన్‌లోని హూతీలస్థావరాలపై భీకరదాడులుచేసాయి.

## అమరావతిలో సిఆర్డీఎ, నిక్‌మార్ ఆధ్వర్యంలో హెచ్ఎస్ఇఎం వర్క్‌షాప్ విజయవంతం

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, ఆగస్టు 30:** ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఎపి సిఆర్డీఏ) ఆధ్వర్యంలో ఆగస్టు 29, 30 తేదీల్లో 'నిర్మాణ ప్రాజెక్టులలో ఆరోగ్య భద్రత, పర్యావరణ అంశాల నిర్వహణ(హెచ్ఎస్ఇఎం) పై అమరావతిలోని ఎస్ఆర్ఎంయూనివర్సిటీలో జరిగిన ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని నిక్‌మార్ యూనివర్సిటీ (ఎన్ఐసిఎంఎఆర్)తో సిఆర్‌డిఎ అధికారులు సంయుక్తంగా నిర్వహించారు. అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా నిర్మించే కృషిలో భాగంగా ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, కన్సల్టెంట్లు తదితర భాగస్వాములకు నైపుణ్య వృద్ధిని అందించే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఆగస్టు 30న జరిగిన కార్యక్రమంలో సిఆర్‌డిఎ కమిషనర్ కె. కన్నబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

మొత్తంగా 165 మందికి పైగా అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వారిలో సిఆర్‌డిఎ అధికారులు, సిబ్బంది, పిజిఎంసి ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ, పిఎంసి ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీల సిబ్బంది, రాజధాని పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు ఉన్నారు. కార్యక్రమంలో భాగంగా హాజరయ్యారు. అనంతరం భద్రతా ప్రతిజ్ఞ చేశారు. వర్క్‌షాప్‌లో కమిషనర్ మాట్లాడుతూ.. రాజధాని నిర్మాణంలో వరల్డ్ బ్యాంక్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ వంటి అంతర్జాతీయ ఫండింగ్ సంస్థల నిబంధనలు, ప్రమాణాలను తప్పనిసరిగా పాటించడం ఎంతో కీలకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ అధికారులు, నిపుణుల నైపుణ్యాన్ని పెంపొందించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి తోడ్పడిన హైదరాబాద్ నిక్‌మార్ యూనివర్సిటీ వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమగ్రమైన శిక్షణ షెడ్యూల్ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన నిక్‌మార్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ డీన్ డా. సర్బేష్ మిశ్రా గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వర్క్‌షాప్ నిర్వహణకు సహకరించిన యూనివర్సిటీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. రెండు రోజుల కార్యక్రమంలో చట్టపరమైన, నియంత్రణాత్మక ఫ్రేమ్‌వర్క్, మేనేజ్‌మెంట్ సిస్టమ్ అభివృద్ధి, భద్రతా ప్రమాణాలు, అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా నిర్వహించే విధానం తదితర అంశాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డా. సర్బేష్ మిశ్రా, ఎం. కామరాజన్, ప్రొఫెసర్ విష్ణు నంబూదిరి, ఇండస్ట్రీ రిలేషన్స్ ఆఫీసర్ శ్రీకర్ ఈ అంశాలపై సెషన్లను నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా అమరావతి అభివృద్ధి ప్రాజెక్టులలో పాల్గొనే ప్రతీ ఒక్కరి ఆరోగ్య భద్రత, పని ప్రాంతాలలో సమగ్రమైన భద్రత, పర్యావరణ సహితంగా ప్రాజెక్టు నిర్వహణప్రధాన లక్ష్యాలుగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.



## జపాన్ ప్రధాని దంపతులకు మోడీ స్పెషల్ గిఫ్ట్!

**టోక్యో, ఆగస్టు 30:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల జపాన్ పర్యటన శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన జపాన్ ప్రధాని షిగెరు ఇషిబాకు భారతీయ కళానైపుణ్యానికి, జపాన్ సంస్కృతికి అద్దం పట్టేలా ఒక అపురూపమైన బహుమతిని అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విలువైన మూన్‌స్టోన్ (చంద్రకాంత శిల)తో తయారు చేసిన రామెన్ గిన్నెల సెట్‌ను, వెండి చాప్‌స్టిక్‌లను ఆయన బహూకరించారు. ఈ బహుమతిలో జపాన్ సంప్రదాయ ఆహార పద్ధతులైన దొన్‌బురి, సోబాలను స్ఫూర్తిగా తీసుకున్నారు. ఈ సెట్‌లో ఒక పెద్ద బ్రౌన్ మూన్‌స్టోన్ గిన్నె, నాలుగు చిన్న గిన్నెలు, వెండి చాప్‌స్టిక్‌లు ఉన్నాయి. ఈ గిన్నెల తయారీకి వాడిన మూన్‌స్టోన్‌ను ఆంధ్రప్రదేశ్ నుంచి సేకరించడం విశేషం. ప్రధాన గిన్నె కింద భాగంలో రాజస్థాన్‌కు చెందిన సంప్రదాయ 'పార్చిన్ కారీ' శైలిలో మక్రానా మార్బుల్‌పై రత్నాలతో అలంకరణ చేశారు. అలాగే, జపాన్ ప్రధాని భార్యకు మోదీ కశ్మీరీ పశ్మీనా శాలువాను బహూకరించారు.

లడఖ్‌లోని చాంగ్‌తాంగి మేక ఉన్నితో కశ్మీరీ చేనేత కళాకారులు తయారు చేసిన ఈ శాలువా ఎంతో ప్రసిద్ధి చెందింది. దీనితో పాటు పూలు, పక్షుల డిజైన్లతో కూడిన అందమైన పేపియర్‌మాచే బాక్స్‌ను కూడా అందించారు. ఈ బహుమతులు కశ్మీర్ వారసత్వానికి, కళాత్మకతకు నిదర్శనంగా నిలుస్తాయి. అంతేకాకుండా ప్రధానిమోడీ జపాన్ ప్రధాని షిగేరు ఇషిబాతో కలిసి కలిసి టోక్యో నుంచి సెందాయ్ నగరానికి వెళ్లారు. ఈ ప్రయాణాన్ని ప్రధాని ఆస్వాదించారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.

31-08Pg3exHMNWJQET.qxd:31-08Pg3exHMNWJQET.qxd 1/1/02 6:47 AM Page 1





## సామూహిక వినాయక నిమజ్జనాలను విజయవంతం చేద్దాం

### - తిరుపతిలో వినాయక కమిటీ ర్యాలీ

**తిరుపతి,ఆగస్టు 30ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మికనగరం తిరుపతిలో వెయ్యికిపైగా కొలువు దీర్చిన వినాయకుని విగ్రహాలను ఐదవరోజు ఆదివారం (నేడు) సామూహిక నిమజ్జనం జరిపేందుకు వరసిద్ధివినాయక మహోత్సవ కమిటీ పిలుపునిచ్చింది. ఈ విగ్రహాల నిర్వాహకులు మండపాల నుండి నిర్ణీత సమయంలోనే ఊరేగింపుగా భజనలతో. భక్తిపాటలతో బయలుదేరాలని కోరారు. సామాహిక వినాయక విగ్రహాల నిమజ్జనం విజయవంతం చేయాలని కోరుతూ శనివారం తిరుపతిలో వరసిద్ధివినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు గోపీనాథరెడ్డి, భాస్కర్‌నాయుడు, నవీన్ కుమార్‌రెడ్డి, ఆర్‌సి మునికృష్ణ, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కొండే చెంగారెడ్డి, సురేశ్ స్వామి, చంగల్‌రాయలు, కస్పా పద్మనాభం, కెఎన్ రాజ తదితరులు నగరంలో మటటారు సైకిల్ ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.

## నాగార్జున విశ్వవిద్యాలయంలో పబ్లిక్ పాలసీ కోర్సు దరఖాస్తుల గడువు పొడిగింపు

**విజయవాడ, ఆగస్టు 30,ప్రభాతవార్తప్రతినిధి:** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రవేశాల డైరెక్టర్ డా. పి. బ్రహ్మాజీ రావు ప్రకటించిన ప్రకారం, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఎం.ఏ. పబ్లిక్ పాలసీ (బి.ఏ.+ఎం.ఏ.) కోర్సు కోసం దరఖాస్తుల సమర్పణకు గడువును 2025-26 విద్యాసంవత్సరానికి పొడిగించారు. తక్షశిల ఐఏఎస్ అకాడమీ సమన్వయంలో అమలు అవుతున్న ఈ వినూత్న కార్యక్రమం, ఇంటర్మీడియేట్ (+2) అనంతరం సివిల్ సర్వీసెస్ (యు పి ఎస్ సి ), ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమవ్వదలచిన విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని రూపొందించబడింది. ఈ కోర్సులో ప్రవేశం పొందిన విద్యార్థులు పబ్లిక్ పాలసీ, గవర్నెన్స్, సంబంధిత రంగాలలో గట్టి విద్యా పునాదిని అందిపుచ్చుకోవడంతోపాటు, సమకాలంలోనే పోటీ పరీక్షలకు కూడా సిద్ధమయ్యే అవకాశం పొందుతారు. పునః సవరించిన షెడ్యూల్ ప్రకారం దరఖాస్తుల సమర్పణకు లేట్ ఫీజు లేకుండా గడువు సెప్టెంబర్ 6, 2025 వరకు, రూ.1,000 లేట్ ఫీజుతో సెప్టెంబర్ 9, 2025 వరకు ఉంటుంది. ప్రవేశ పరీక్ష సెప్టెంబర్ 10, 2025 న నిర్వహించబడనుంది. ప్రవేశాలకు సంబంధించిన వివరాల కోసం 9030088685 నంబర్లలో సంప్రదించవచ్చు. మరిన్ని వివరాలకు ప్రవేశాల డైరెక్టర్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్, గుంటూరు - 522510 ను సంప్రదించవచ్చు. విశ్వవిద్యాలయం ఫోన్లు 08632346171 / 08632346138, వెబ్‌సైట్/ ఇమెయిల్ ద్వారా కూడా సంప్రదించవచ్చు.

## పదవీవిరమణకు ముందేఅనారోగ్యంతో టిటిడి ఎఇఒ మృతి

**తిరుపతి,ఆగస్టు 30ప్రభాతవార్తప్రతినిధి:** దేవుని కొలువులో సేవాభావంతో అంకితభావంగా సుదీర్ఘకాలం విధులు నిర్వహించి, శేషజీవితాన్ని ఆనందంగా గడపాల్సిన ఓ టిటిడి ఉద్యోగి పదవీవిరమణకు రెండురోజులు ముందే అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ ఉదంతం శనివారం వెలుగుచూసింది. టిటిడిలో కపిల తీర్థం ఆలయంలో ఎఇఒగా కోనేటి సుబ్బరాజు విధులు నిర్వహిస్తున్నాడు. స్వామివారి పట్ల అచంచల భక్తివిశ్వాసాలు కలిగి ఉండేవాడు. భక్తుల పట్ల కూడా ఆయన మాటతీరు ఎంతో ఆప్యాయంగా ఉండేది. అంతేగాక ఆయన జీవితం కూడా నాటకరంగంలో ఎన్నో అద్భుతమైన ఘట్టాలు ప్రదర్శించాడు. కళాకారుడుగా కూడా ఉన్న సుబ్బరాజు రంగస్థలనటుడుగా ఎందరో కళాకారులకు ఆదర్శంగా నిలిచాడు. ఆయన చికిత్స పొందుతూ గురువారం రాత్రి అనారోగ్యంతో ఆయన మృతి చెందినట్లు కుటుంబసభ్యులుతెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టమ్ అనంతరం కుటుంబ సభ్యులు దహనక్రియలు నిర్వహించారు.

### సాంకేతిక పరిజ్ఞానంతో

# నేరాల కట్టడి

**తిరుమల,ఆగస్టు 30ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పోలీసులు సాంకేతికతను విని యోగించుకుని చాలావరకు నేరాలను కట్టడి చేయగలుగుతున్నారని రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్‌గుప్త తెలిపారు. ప్రధానంగా విపరీత మవుతున్న సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా పోలీసులు పనితీరు బావుందన్నారు. ప్రజలు సులభంగా మోసగాళ్ళ మాటలకు నమ్మి మోసపోతున్నారన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ మోసగాళ్ళకు చెక్‌పెట్టేలా చర్యలు తీసు కుంటున్నామన్నారు. రెండు రోజుల తిరుపతి,తిరుమల పర్య టనలో భాగంగా శని వారం ఉదయం డిజిపి హరీష్ కుమార్‌గుప్త శ్రీవారి ఆలయం లోనికి చేరు కున్నారు. ఆలయ మహా ద్వారం వద్ద తిరుపతి జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్‌రాజు, టిటిడి సివిఎస్ఒ మురళీ కృష్ణ, తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్, సిఐ విజయ



**- సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన**
**- డిజిపి హరీష్‌కుమార్ గుప్తా**

కుమార్ స్వాగతం పలికారు. ఆలయం లోనికి చేరుకున్న డిజిపి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం తిరుమలలో ఇరవైరోజుల్లో మొదలుకానున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, భద్రత, భక్తులకు సేవలపై సమీక్షించారు.

## ప్రజా సమస్యల పరిష్కారంతోనే పార్టీ బలోపేతం : బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



**విజయవాడ,ఆగస్టు30,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి మార్గం చూపితేనే పార్టీ బలోపేతమవుతుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రాల్లో నిర్వహించే స్పందన కార్యక్రమాల ద్వారా స్థానిక సమస్యలపై దృష్టి సారించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వం దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు.ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఏడాది తిరుగకుండా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. విజయవాడ లోని భాజపా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పదాధికారులు,మోర్చా రాష్ట్ర అధ్యక్షులు,అధికార ప్రతినిధులతో కార్యశాల నిర్వహించారు. 'పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలకు ఎక్కువ సమయం కేటాయించి...పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి.118 మన్‌కీ బాత్ కార్యక్రమాల్లో 40 సార్లు ఏపీ లోని అంశాలను మోడీ ప్రస్తావించారు. సారథ్యం యాత్రం 19 జిల్లాల్లో పూర్తయ్యింది. త్వరలో బాజపా అనుబంధ సంఘాలతోనూ నిర్వహిస్తాం. గాంధీ జయంతి రోజున స్వదేశీ వస్తు భాండాగార్ నిర్వహించాలి'అని పేర్కొన్నారు. తెలుగు భాషకు జీవం పోసిన వారిని మరొవద్దని,వారి సేవలు నేటి తరానికి తెలిసేలా తెలుగు భాష గొప్పతనాన్ని వివరించాలని పిలుపునిచ్చారు. జాతీయ సహ సంఘటన ప్రధాన కార్యదర్శి శివప్రకాష్ భాజపా నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని పరిచయం చేశారు. కార్యక్రమంలో భాజపా నాయకులు భూపతిరాజు శ్రీనివాసవర్మ,సత్యకుమార్ యాదవ్,దగ్గుపాటి పురంధరేశ్వరి,సోము వీర్రాజు,సి. ఆదినారాయణరెడ్డి,పార్థసారథి,ఈశ్వరరావు,దయాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి టిడిఆర్ బాండ్ల కుంభకోణంపై ప్రత్యేక దర్యాప్తు జరపాలి

### - భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

**విజయవాడ,ఆగస్టు 30,ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతి నగరపాలక సంస్థలో జరిగిన టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై ప్రత్యేక దర్యాప్తు జరిపించాలని టిడిపి ఎంఎల్‌సి భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కోరారు.ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన లేఖలో భూమిరెడ్డి కోరారు.గత ప్రభుత్వంలో టీడీఆర్ బాండ్లు భారీగా సొమ్ము దుర్వినియోగం జరిగిందన్నారు.వైఎస్సార్సీపీ మాజీ ఎంఎల్‌ఏ భూమన కరుణాకరరెడ్డి, సీనియర్ ఐఎఎస్ అధికారిణి పాత్రల్ని వెలికి తీయాలంటూ సీఎంకు లేఖ రాశారు. జగన్ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా అనేక టిడిఆర్ బాండ్ల కుంభకోణాలు జరిగాయని ఆరోపించారు. ఇందులో క్షేత్రస్థాయి నుంచి అప్పటి ముఖ్యమంత్రి జగన్ వరకు అవినీతి పాత్ర ఉందన్నారు.తిరుపతిలో జరిగిన కుంభకోణానికి ఓ సీనియర్ అధికారిణే కారణమని భూమన కరుణాకర్‌రెడ్డి ఇటీవల ఆరోపించిన విషయాన్ని ప్రస్తావించారు.

# తిరుమల సమాచారం

## తిరుప్పావై ఉపన్యాసాలకు ఆహ్వానం

**తిరుమల,ఆగస్టు 30ప్రభాత వార్తప్రతినిధి:** పవిత్రమైన ధను ర్మాసంలో టిటిడి దేశంలోని వివిధ అనుబంధ ఆలయాల్లో తిరుప్పావై ఉపన్యాసాలు చేసేందుకు వైష్ణవ సిద్ధాంతం తెలిసిన పండితుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టిటిడి తెలిపింది. అంగీకారపత్రాలు కూడా అందజేయాలని తెలిపింది. టిటిడి ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రతి ఏటా ధనుర్మాసంలో తిరుప్పావై ఉపన్యాసాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది సెప్టెంబర్ 1వతేదీ నుండి 30వతేదీ సాయంత్రం లోపు "ప్రత్యేక అధికారి, ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు,టిటిడి తిరుపతి"అనే చిరునామాకు దరఖాస్తులు, అంగీకారపత్రాలు పంపాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు ప్రాజెక్టు కార్యాలయం 9676120226, 8978734947 నంబర్లద్వారా సంప్రదించాలని టిటిడి తెలిపింది.



## గోవిందుని దర్శనంతో సకల శుభాలు : ప్రముఖులు



**తిరుమల,ఆగస్టు 30ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలకు శుభాలు కలగాలని, సుఖసంతోషాలతోఉండాలని దేవుని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. శనివారం ఉదయం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటజ్యోతిర్మయి కుటుంబంతో కలసి, పుదుచ్చేరి డిజిపి షాలినీసింగ్ దంపతులు,ఎంఎల్‌సి కల్యాణి విఐపి బ్రేక్ సమయంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఆంధ్రప్రదేశ్ డ్రా ఆఫ్ లాట్స్ ద్వారా 466 బార్ల కేటాయింపు

**విజయవాడ, ఆగస్టు 30,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కొత్త బార్ పాలసీ 2025-28 ప్రకారం 466 బార్లకు (388 ఓపెన్ + 78 రిజర్వ్) డ్రా ఆఫ్ లాట్స్ శనివారం ఉదయం 8 గంటలకు జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తయి, ఎంపికైన వారికి సమాచారం అందించబడింది. అయితే 37 ఓపెన్ బార్లు, 3 రిజర్వ్ బార్లకు నాలుగు కన్నా తక్కువ దరఖాస్తులు మాత్రమే రావడంతో, వీటికి దరఖాస్తుల గడువును సెప్టెంబర్ 1, 2025 సాయంత్రం 6 గంటల వరకు పొడిగించారు. ఈ బార్లకు డ్రా ఆఫ్ లాట్స్ సెప్టెంబర్ 2, 2025 ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నారు. దరఖాస్తులు రాని బార్లకు తిరిగి ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే బార్ పాలసీని ప్రకటించి, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 924 బార్లను కేటాయించింది. అందులో ఓపెన్ కేటగిరీకి 840, రిజర్వ్ కేటగిరీ (గీత్ కులాలకు)కి 84 బార్లు కేటాయించారు. బార్ల కేటాయింపును పారదర్శకత కోసం లాటరీ విధానం ద్వారానే చేపడుతున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా జిల్లా ప్రొహిబిషన్ , ఎక్సైజ్ అధికారులు ఓపెన్ కేటగిరీకి ఆగస్టు 18, 2025న, రిజర్వ్ కేటగిరీకి ఆగస్టు 20, 2025న గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేసి దరఖాస్తులను ఆహ్వానించారు. దరఖాస్తుల స్వీకరణ గడువును ఆగస్టు 29, 2025 వరకు నిర్ణయించారు. ఆ గడువు నాటికి ఓపెన్ కేటగిరీకి 1,698, రిజర్వ్ కేటగిరీకి 567 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఓపెన్ కేటగిరీలో 388 బార్లకు 1,657, రిజర్వ్ కేటగిరీలో 78 బార్లకు 564 దరఖాస్తులు సరైనవిగా తేలి, డ్రా ఆఫ్ లాట్స్ నిర్వహించడానికి అర్హత పొందాయి.

జిల్లావారీగా కేటాయింపులు ఇలా ఉన్నాయి: అనంతపురం 12, అన్నమయ్య 8, బాపట్ల 4, చిత్తూరు 5, అంబేద్కర్ కోనసీమ 1, తూర్పు గోదావరి 9, ఎలూరు 10, గుంటూరు 52, కాకినాడ 4, కృష్ణా 30, కర్నూలు 19, నంద్యాల 18, నెల్లూరు 19, శ్రీ సత్యసాయి 7, శ్రీకాకుళం 21, తిరుపతి 26, విశాఖపట్నం 72, విజయనగరం 14, పశ్చిమ గోదావరి 18, వైఎస్ఆర్ కడప 14.కేటాయించారు.

## చేనేతకు చేయూత.. వస్త్ర వైభవానికి ప్రతీక

### -.సిల్క్ ఎక్స్‌పోను ప్రారంభించిన కేశినేని జానకీ లక్ష్మీ
### - భారతీయ కళాత్మక నైపుణ్యానికి ఇండియన్ సిల్క్ గ్యాలరీ వేదిక..

**విజయవాడ,ఆగస్టు30,ప్రభాతవార్తప్రతినిధి:** భారతీయ సంప్రదాయాల్లో పట్టు వస్త్రాలు ప్రత్యేక ముద్రను సంతరించుకున్నాయని ప్రముఖ సామాజిక సేవకురాలు.విజయవాడ ఎంపీ సతీమణి కేశినేని జానకీ లక్ష్మి అన్నారుఎంతోమంది కళాకారులు తమ కళా నైపుణ్యంతో రూపొందించిన పట్టు వస్త్రాలకు ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో వేదికైందని, నేతన్నలే నేరుగా అమ్మకాలు నిర్వహించడం ద్వారా బయటికంటే తక్కువ ధరకు వినియోగదారులకు అందుబాటులోకి వస్తున్నాయని కేనకీ లక్ష్మీఅన్నారు. కంద్ర చేనేత, జౌళి శాఖ సహకారంతో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో ఆధ్వర్యంలో స్థానిక ఏ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన సిల్క్ ఎక్స్‌పోను శనివారం పార్లమెంటు సభ్యులు కేశినేని జానకీ లక్ష్మీ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. పట్టు వస్త్రాల స్టాళ్లను తిలకించారు. అనంతరం సభ ఆమె మాట్లాడుతూ వస్త్రాభిమానులను అలరించేలా ఏర్పాటుచేసిన ఎక్స్‌పోతో బెనారసి, పశ్చిమబెంగాల్ బొటిక్ ఐటెమ్స్, టస్సార్ కాంత, చందేరి, కోటా, రాజ్‌కోట్ పటోలా, గద్వాల్, కళంకారి, కాంచీపురం, వెంకటగిరి, ఉప్పాడ జాంధానీ.. ఇలా వివిధ కళాత్మక వస్త్రాలను ఒకే వేదికపై వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. దేశ వ్యాప్తంగా 14 వీవింగ్ క్లస్టర్ల పరిధిలోని కళాకారుల చేతిలో రూపుదిద్దుకున్న అత్యద్భుతమైన డిజైన్లకు ఈ ప్రదర్శన చిరునామాగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్ కమ్ సేల్‌ను నగర వస్త్ర ప్రియులు సద్వినియోగం చేసుకోవాలని కేశినేని జానకీ లక్ష్మి అన్నారు. ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో నిర్వాహకులు, సెంట్రల్ సిల్క్ బోర్డు విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ గ్యాలరీ సెప్టెంబర్ 2వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని.. ఈ ప్రదర్శనకు పెద్దఎత్తున వస్త్ర ప్రియులు వస్తున్నారని.. 100 శాతం చేనేత వస్త్ర ఉత్పత్తులకు ఇది వేదిక అని తెలిపారు. వివాహాలు, దసరా, దీపావళి వంటి పండగల నేపథ్యంలో ఈ ప్రదర్శన నగర ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు. దేశంలో ఒక్కో ప్రాంత కళాకారులది ఒక్కో అద్భుత శైలి అని.. అన్ని ప్రాంతాల కళాకారుల చేతిలో తయారైన వస్త్రాలను ఒకేచోట అందుబాటులో ఉంచడం ద్వారా ఆయా ప్రాంతాల నేత కళాకారులను ప్రోత్సహించడంతో పాటు వస్త్ర ప్రియులకు తక్కువ ధరల్లో మంచి వస్త్రాలను అందించేందుకు దోహదం చేస్తుందన్నారు. ఇలాంటి వస్త్రాలకు మద్దతివ్వడం ద్వారా మన ఘన చేనేత వైభవాన్ని భావి తరాలకు వారసత్వ సంపదగా అందించేందుకు వీలవుతుందని వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో బ్రాండ్ అంబాసిడర్ పి.దీపిక, మహిళా పారిశ్రామికవేత్త సజ్జా మంజుల పాల్గొన్నారు.



సిల్క్ ఎక్స్‌పోను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న కేశినేని జానకీ లక్ష్మీ

## మరో 4వేల మంది యాత్రికులకు అన్ని హంగులతో వేంకటాద్రి నిలయం వసతి

### - బ్రహ్మోత్సవాలకు పిఎసి 5 అందుబాటులోకి
### - టిటిడి ఛైర్మన్ నాయుడు, అదనపు ఇఒ చౌదరి

**తిరుమల,ఆగస్టు 30ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలకు వస్తున్న భక్తులకు అదనంగా మరో 4వేలమందికి వసతి కల్పించేందుకు పిఎసి 5(యాత్రికుల వసతి సముదాయం) వేంకటాద్రి నిలయం సిద్ధమైంది. ఈ వసతి సముదాయం భవనంలో దాదాపు ఐదువేలమంది వరకు సర్దుబాటు చేసుకునే దిశగా విశాలమైన హాళ్ళు, చంటి పిల్లలకు పాలుత్రాగించే ప్రత్యేక గదులు, అన్నప్రసాద వితరణ కేంద్రం ఉన్నాయి. శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు భక్తులకు వేంకటాద్రి నిలయం యాత్రికుల ఉచిత సముదాయం అందుబాటులోకి రానుంది. ఈ భవనాన్ని శనివారం ఉదయం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ నాయుడు మాట్లాడుతూ వేంకటాద్రి నిలయం యాత్రికుల ఉచిత సముదాయం తుదిదశ పనులు జరుగుతున్నాయన్నారు. 102కోట్ల రూపాయల వ్యయంతో ఐదు అంతస్థులు ఉచిత సముదాయాన్ని నిర్మించడం జరిగిందన్నారు. 2018లో అప్పటి టిటిడి బోర్డు నిర్ణయం మేరకు పిఎసి 5 నిర్మాణంపై నిర్ణయం తీసుకుని ఈ పనులు సాగాయన్నారు. ఇందులో 2,500మంది యాత్రికులకు అదనంగా వసతి సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. మరో వెయ్యిమంది వరకు సర్దుబాటు చేసుకునేలా విశాలమైన హాళ్ళు, డార్మిటరీలు, లాకర్లు ఉన్నాయన్నారు. 216 మరుగుదొడ్లు, 216 స్నానపు గదులు, రెండు కల్యాణకట్టలు, జలప్రసాదాలు, ప్రథమచికిత్సా కేంద్రాలు, అన్నప్రసాద భవనం సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. ప్రస్తుతం తిరుమలలో 45వేలమంది భక్తులకు మాత్రమే వసతి సదుపాయం కల్పించే వీలుందన్నారు. వేంకటాద్రినిలయం అందుబాటులోకి వస్తే 3వేలమంది వరకు భక్తులు ఇక్కడ విశ్రాంతి,వసతి పొందే వీలుకలుగుతుందన్నారు.



భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సదుపాయాలు ,భద్రత కల్పించడం జరిగిందన్నారు. ఎంతో అద్భుతంగా ఈ భవనం నిర్మాణం చేపట్టారన్నారు. అనంతరం పిఎసి 5లోని మరుగుదొడ్లు, గదులు, లాకర్లను, కల్యాణకట్టలను స్వయంగా ఛైర్మన్ నాయుడు, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిటిడి సిఇ సత్యనారాయణ, ఇఇలు వేణుగోపాల్, శ్రీనివాసరావు, సుధాకర్, డిప్యూటీ ఇఒలు రాజేంద్ర, సోమన్నారాయణ, డిఇ చంద్రశేఖర్,, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, విఎస్ఒ సురేంద్ర ఉన్నారు.

## పెరుగుతున్న శివయ్య హుండీల రాబడి



**శ్రీకాళహస్తి,ఆగస్టు 30 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరుని హుండీల రాబడి పెరుగు తుంది.ఈ నేపథ్యంలో ఆగస్టు నెల లో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను లెక్కించారు.నెల రోజులకు హుండీల ద్వారా వచ్చిన కానుకలను యూనియన్‌బ్యాంకు సహాయంతో ఇఓ డి.బాపిరెడ్డి,డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఇఇ మురళీధర్‌రెడ్డిల పర్యవేక్షణలో మందుకొట్టు మండపంలో లెక్కించారు. నగదు రూపంలో రూ.1,82,17,085లు వచ్చినట్లు ప్రకటించారు. కాగా రాహుకేతుదోష నివారణ పూజలకు ఉపయోగించే వెండి నాగపడగల రూపంలో 510.600 కిలోలు వచ్చినట్లు ప్రకటించారు. అలాగే అమెరికాకు చెందిన డాలర్లు 65 మలేషియా కరెన్సి 119 నోట్లు, ఖత్తర్‌కు చెందిన నోట్లు 30,కెనాడాకుచెంది నకరెన్సి 19న ఓట్లు ఇతర దేశాలకు చెందిన 32 వెరసి 265 నోట్లు వచ్చినట్లు వివరించారు.లెక్కింపులను ఎఇఓలు విద్యాసాగర్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి,హేమామాలిని, రవి, శ్రీహరి, నాగభూషణంయాదవ్, విజయ సారధి, లావణ్య సిబ్బంది పాల్గొన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుందని ఇఓ బాపిరెడ్డి వివరించారు. తిరుమలేశుని దర్శనానికి వచ్చే వారిలో 60శాతం వరకు శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వస్తున్నారన్నారు. ఇక్కడకు వచ్చే భక్తులకు సత్వర,సుదర్శనం ఏర్పాటు చేస్తున్నామన్నారు.బస సదుపాయాలతో పాటు సకల సదుపాయాలు కల్పిస్తున్నామని ఇఓ బాపిరెడ్డి వివరించారు. రాబోవు రోజులు ఆలయ పరిసరాలను సర్వాంగ సుందరంగా తిరుమల తరహాలో తీర్చి దిద్దుటకు చర్యలు తీసుకుంటున్నామని ఇఓ బాపిరెడ్డి వివరించారు.

## వైద్యఆరోగ్యశాఖలో సివిల్ సర్జన్ స్పెషలిస్టులకు పదోన్నతులు

**విజయవాడ, ఆగస్టు 30.ప్రభాతవార్తప్రతినిధి:** వైద్యఆరోగ్యశాఖలో సివిల్ సర్జన్ స్పెషలిస్టులకు పదోన్నతులను ఇస్తూ ఏపీ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. 2024- 25 ప్యానల్ ఇయర్‌కు సంబంధించి ఈ నిర్ణయం ఏపీ ప్రభుత్వం తీసుకుంది.ప్రస్తుతం నెల్లూరు జిల్లా రాపూర్ సీహెచ్ సీ లో పనిచేస్తున్న డాక్టర్ వి సరస్వతిని నరసాపురం పశ్చిమ గోదావరి జిల్లా ఏహెచ్ కు బదిలీ చేశారు. డాక్టర్ ఎం ఉషాబాలను ఎంసిహెచ్ ఒంగోలు నుంచి, ఏహెచ్ కావలి నెల్లూరు జిల్లాకు బదిలీ చేశారు. డాక్టర్ ఎన్ శైలజను ఏహెచ్ ధర్మవరం అనంతపురం నుంచి, ఏహెచ్ ఎమ్మిగనూరు కర్నూలు జిల్లాకు బదిలీ చేశారు. డాక్టర్ ఎన్ వనజ కుమారిని సిహెచ్‌సి ఏళేశ్వరం ఈస్ట్ గోదావరి నుంచి, ఏహెచ్ రంపచోడవరంకు బదిలీ చేశారు. ఆర్డర్ అందుకున్న పదిహేను రోజుల్లోగా ఆయా స్థానాల్లో జాయిన్ కావాలని ఆదేశిస్తూ వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంపి కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు వైద్యారోగ్య శాఖలో దీర్ఘకాలం పదోన్నతికి నోచుకోని డిప్యూటీ డైరెక్టర్లకు సైతం ఎట్టకేలకు ప్రమోషన్ లభించింది. సర్వీసు నియమాల ప్రకారం రెండేళ్లు డీడీగా పనిచేసిన వారు జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతికి అర్హులు. అయినా, డిపిహెచ్ పరిధిలో పనిచేస్తున్న ఐదుగురు డిప్యూటీ డైరెక్టర్లు 18 నుండి 20 సంవత్సరాలుగా పదోన్నతి కోసం ఎదురు చూస్తున్నారు. మరో ఇద్దరు 11 సంవత్సరాలకు పైగా నిరీక్షిస్తున్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ జోక్యంతో వారికి ప్రమోషన్ లభించగా ఆ ఏడుగురికి మంత్రి పోస్టింగులిచ్చారు. పదోన్నతి పొందిన వీరు ప్రస్తుత స్థానాల్లోనే జేడీలుగా కొనసాగుతారు. మందుల నియంత్రణ విభాగంలో పనిచేస్తున్న ఇద్దరు డిప్యూటీ డైరెక్టర్లకు పదోన్నతిపై జాయింట్ డైరెక్టర్లుగా మంత్రి పోస్టింగులిచ్చారు. రాజాభానును హెడ్ క్వార్టర్స్ లోనూ, పాండురంగ ప్రసాద్‌ను విశాఖపట్నంలోనూ పోస్ట్ చేశారు. ఐఎఎస్ అధికారుల బదిలీ ఏపీలో ఐఎఎస్ అధికారులను బదిలీ చేసారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

## బిసి మహిళకు సబ్ కోటా ఇస్తూ మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ చేయాలి: కేశన శంకరరావు

**విజయవాడ, ఆగస్టు 30, ప్రభాతవార్త :** బిసి మహిళలకు సబ్‌కోటానిస్తూ, మహిళా రిజర్వేషన్ చట్టం సవరించిన తర్వాత మాత్రమే అమలు చేయాలని ఏపి బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మహిళా విభాగ రాష్ట్ర అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ తదితర మహిళానేతలు విశాకలో వీఎంసి కార్యాలయం వద్ద వున్న గాంధిబొమ్మ దగ్గర నిరాహార దీక్షను ఒక్కరోజు చేపట్టి నిరసన చేశారు. ఈ సందర్భంగా కేసన మాట్లాడుతూ గత 30 ఏళ్ళుగా మహిళా రిజర్వేషన్ బిల్లు అటకెక్కించారని మండిపడ్డారు. ఎట్టకేలకు మోడీ ప్రభుత్వం 33 శాతంతో మహిళ రిజర్వేషన్ బిల్లును ఆమోదించారని హర్షం వ్యక్తం చేశారు. కానీ ఓబిసి మహిళలకు ఉప కోటా కేటాయించలేదని మండిపడ్డారు.



బిసి మహిళలకు సబ్‌కోటా రిజర్వేషన్లివ్వాలని నిరసన చేస్తున్న దృశ్యం

31-08pg6exHMNWJQE.qxd:31-08pg6exHMNWJQE.qxd 1/1/02 6:25 AM Page 1



# శాఖల మధ్య సమన్వయ లోపం - విద్యార్థులకు శాపం

## విద్యార్థుల పరిస్థితి త్రిశంకు స్వర్గం - ప్రభుత్వం స్పందించి జీవో విడుదల చేయాలి


శ్రీకాళహస్తిలోని ఇంజనీరింగ్ కళాశాల

**శ్రీకాళహస్తి, ఆగస్టు 30 ప్రభాతవార్త** సుమారు ఏడు సంవత్సరాల పాటు మూత పడ్డ శ్రీకాళహస్తీశ్వరాలయం సారథ్యంలో నిర్వహిస్తున్న స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను పునఃప్రారంభించుటకు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పాలకులు చుట్టు ప్రదక్షిణలు చేసి సాధించారు. మూడేళ్ళ పాటు (రూ.120కోట్లు) నిధులు ప్రభుత్వమే భరించుటకు ఒప్పించారు. ఈ నేపథ్యంలో ఈ కళాశాల నిర్వహణను అనంతపురంలోని జేయన్‌టియుకు అప్పగించుటకు ఆ యూనివర్శిటి నిర్వాహకులు కూడా హాజరై ప్రకటించారు. ఈ నేపథ్యంలో రెండవ కౌన్సెలింగ్‌లో ప్రవేశాలకు అనుమతించారు. ఈ నేపథ్యంలో 68 మంది ఇక్కడ చేరటానికి ఆప్షన్స్ ఇచ్చారు. అయితే కౌన్సెలింగ్ సమయంలో 37 మంది చేరటానికి సుముఖత చూపారు. రాష్ట్రంలోని ఇతర కళాశాలల్లో తరగతులుకూడా ప్రారంభ మయ్యాయి. అయితే శ్రీకాళహస్తి కళాశాలలో మాత్రం ఇంకా ఎటూ తేలని పరిస్థితి చోటు చేసుకుంది. శాసనసభ్యుడు అనుమతి అయితే సాధించారు. ఆన్‌లైన్లో విద్యార్థులు చేరటానికి సుముఖత చూపారు. అయితే జేయన్‌టియుకు అప్పగించినట్లు దానికి సంబంధించిన ఒప్పందాలపై ఎంఓయులు జరగాల్సి ఉంది. ప్రభుత్వం ఈ మేరకుజిఓ జారి చేయాల్సి ఉంది. కానీ ఎందుకో ఆ ప్రక్రియ అమలు జరగలేదు. ఇతర కళాశాలల్లో తరగతులు ప్రారంభం అయి జరుగుతుంటే ఇక్కడ ఆప్షన్ ఇచ్చి చేరిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా జేయన్‌టియు ఉపాధ్యాయ బృందం ఇక్కడకు రావాల్సి ఉంది. ఇందుకు ప్రభుత్వం ఒప్పందాలు జరపాలి. ఉత్తర్వులు జారి చేయాల్సి ఉంది. ఈ కళాశాల ఇంత కాలం దేవాదాయశాఖ పరిధిలో సాగింది. ఇక పై అనంతపురానికి చెందిన జేయన్‌టియు సారథ్యంలో నిర్వహించబడుతుందని 'కోడ్ కూడా' ఇచ్చారు. అయితే ఈ మేరకు ప్రభుత్వం ఒప్పందం చేస్తూ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ ప్రతిపాదన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వద్ద ఎపెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నత విద్యాశాఖలు కలసి ముఖ్యమంత్రి వద్ద చర్చించాల్సి ఉంది. దీనికి సంబంధించి ఉద్యోగుల మాటేమిటి? ఆర్థిక పరిస్థితి ఏమిటి? ఎలా నిర్వహిస్తారు. అనే అంశాలపై ఒప్పందం జరగాల్సి ఉంది. శ్రీకాళహస్తిలోని ఇంజనీరింగ్ కళాశాలను జేయన్‌టియు తీసుకుందని తెలియటంతో రెండవ కౌన్సెలింగ్ లో 68 మంది ఆప్షన్‌లు ఎపెట్టారు. వారిలో 37 మంది చేరటానికి సిద్ద మయ్యారు. అయితే ఇక్కడ చోటు చేసుకున్న సందిగ్ధంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. జేయన్‌టియు నిర్వాహకులేమో ప్రభుత్వం జివో జారి చేస్తే తాము ముందడుగు వేస్తామని మౌనం వహించారు. ఇక్కడ జేయన్‌టియు వారు అడుగుపెడితే కౌన్సెలింగ్‌లో అవకాశం రాని వారు మరో 70 మంది వరకు చేరటానికి సిద్దంగా ఉన్నట్లు సమాచారం. కానీ రోజులు గడుస్తున్న కొద్ది ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటంలో జాప్యం చేస్తుండటంతో 'భవిష్యత్తు ఏమిటన్నది ప్రశ్నార్ధకంగా' మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపాలి.

# వైభవోపేతంగా సింహాచల వరాహ లక్ష్మీ నృసింహస్వామి కళ్యాణం

## - వాసవి మార్కెట్ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనమైన నిర్వహణ


సింహాచల శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి కళ్యాణంలోప్రముఖులు

**విజయవాడ.ఆగస్టు30,ప్రభాతవార్తప్రతినిధి:**సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవం ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలో శోభాయమానంగా జరిగింది. గణపతి ఉత్సవ కమిటీ వాసవి మార్కెట్ ఆధ్వర్యంలో సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవం భక్త జననీరాజనాల నడుమ జరిగింది. శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం ఎదురుగా పట్టణ రథం సెంటర్‌లో వేద మంత్రాల నడుమ భక్తుల సందోహం మధ్య కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ మహోత్సవాన్ని ప్రధాన అర్చకులు శ్రీమాన్ కె. సీతారామాచార్యులు, ఉప ప్రధాన అర్చకులు శ్రీమాన్ నృసింహాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. సహస్రనామార్చన, నీరాజనం, మంత్రపుష్పములు, లక్ష్మీనారాయణ సుదర్శన హోమం వంటి వైదిక కర్మలు ఘనంగా జరిగాయి. కదలి ఫలములు, పుష్పాలతో స్వామివారి అలంకారం భక్తులను ఆకట్టుకుంది. కళ్యాణ మహోత్సవంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), శ్రీరామ్ చిన్నబాబు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి మండల కృష్ణకుమారి, కూటమి నేతలు, గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు కూడా భక్తి శ్రద్ధలతో స్వామివారి కళ్యాణాన్ని వీక్షించారు. కళ్యాణ మహోత్సవం అనంతరం వేద పండితులు ప్రముఖులను దృశ్యాలువాతో సత్కరించారు. వేద ఆశీర్వచనం చేసి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పెద్ద ఎత్తున హాజరై కళ్యాణం దర్శించుకున్నారు.
గణపతి ఉత్సవాల మధ్య భాగంగా జరిగిన ఈ కళ్యాణ మహోత్సవం నందిగామ పట్టణాన్ని ఆధ్యాత్మిక ఉత్సాహంతో నింపింది. వేలాది మంది భక్తులు స్వామివారి కళ్యాణాన్ని వీక్షించి ఆధ్యాత్మికానందం పొందారు. నందిగామ పట్టణంలోని గాంధీ సెంటర్‌లో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ గణనాథుని మండపం వినాయక చవితి సందర్భంగా భక్తులను ఆకర్షిస్తోంది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ గణేష్ మండపం సంప్రదాయ శోభతో, ఆకర్షణీయమైన అలంకరణలతో భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని అందిస్తోంది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ (తెదేపా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య జగ్గయ్యపేట శాసనసభ్యులు రామ్ రాజగోపాల్ (తాతయ్య) ఈ భారీ గణనాథుని మండపాన్ని దర్శించి, ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవినేని ఉమామహేశ్వరరావు గణపతి దేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి ఆధ్యాత్మిక వాతావరణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినాయక చవితి ఉత్సవాలు భక్తులలో ఆధ్యాత్మిక భావనలను, సామాజిక సామరస్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు చేసిన ఏర్పాట్లను అభినందిస్తూ, ప్రజలు శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో ఈ ఉత్సవాలను జరుపుకోవాలని కోరారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేతంగిరాల సౌమ్య గారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, విఘ్నేశ్వరుడు అన్ని విఘ్నాలను తొలగించి, భక్తులకు సుఖసంతోషాలను ప్రసాదిస్తాడని, ఈ ఉత్సవాలు ప్రతి ఒక్కరి జీవితంలో శాంతి,
ఐశ్వర్యాన్ని తెస్తాయని ఆకాంక్షించారు. జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీ రామ్ రాజగోపాల్ (తాతయ్య) గారు కూడా గణనాథుని దర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, నందిగామ పట్టణంలో ఈ వినాయక చవితి ఉత్సవాలు భక్తులకు ఆనందాన్ని, ఆధ్యాత్మిక ఉత్తేజాన్ని అందిస్తున్నాయని, నిర్వాహకుల కృషిని ప్రశంసించారు.

# రైల్వే యాంత్రిక విభాగంలో 15మందికి గ్రూప్న బి' అధికారులుగా పదోన్నతి

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 30,ప్రభాతవార్త** భారతీయ రైల్వేలో ఖాళీగా ఉన్న గ్రూప్ బి పోస్టుల భర్తీకి జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో 15మంది అభ్యర్థులు ఎంపిక చేసినటు 2025ప్యానల్‌ను రైల్వే బోర్డు డిప్యూటీ డైరెక్టర్ రామ్‌నాథ్ సింగ్ విడుదల చేశారు. వీరిలో చెన్నైలోని ఐసిఎఫ్ ఉత్పత్తి కర్మాగారానికి చెందిన వారు ముగ్గురు, ఈశాన్య రైల్వే జోన్‌కు చెందిన వారు ఇద్దరు, ఆగ్నేయ రైల్వే జోన్‌కు చెందిన వారు మరో ఇద్దరు, దక్షిణ మధ్య రైల్వే నుంచి నలుగురు సెంట్రల్ రైల్వే నుంచి ఇద్దరు, నార్థన్ రైల్వే నుంచి మరో ఇద్దరు చొప్పున మొత్తం 15మంది అభ్యర్థులు రైల్వే మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో గ్రూప్ బి అధికారులుగా నియమించబడ్డారు.

# చంద్రగ్రహణం రోజున శివయ్యకు శాంతి అభిషేకాలు

**శ్రీకాళహస్తి,ఆగస్టు 30 ప్రభాతవార్త** సెప్టెంబర్ నెలలో రెండు గ్రహణాలు రానున్నాయి. సెప్టెంబర్ 7 పౌర్ణమి రోజు సంపూర్ణ చంద్రగ్రహణం, 21న సూర్యగ్రహణం చోటు చేసుకోనుంది. ఈ రెండు కూడా భారత దేశం దర్శనమిస్తాయి. ఈ నేపథ్యంలో గ్రహణాలకు అతీతంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో శాంతి అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి. సెప్టెంబర్ 7న చంద్రగ్రహణం రాత్రి 9.58గంటలకు ప్రారంభం అవుతుందని శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పండితులు చెబుతున్నారు. 8వ తేది వేకువ జాము 1.26గంటలకు ముగుస్తుందని వివరించారు. 7వ తేది రాత్రి 11.42గంటలకు చంద్రుడు పూర్తిగా కనబడడని వివరించారు. సాధారణంగా గ్రహణం అంటే ఇబ్బంది అని అర్థం. ఈ సమయంలో శాంతింపజేయాలి కాబట్టి ఆ సమయంలో ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుడు తనకు అలంకరించే కవచంలో తొమ్మిది గ్రహాలను 27 నక్షత్రాలను పొందుపరచుకున్నారు కాబట్టి ఆ స్వామికి శాంతి అభిషేకాలు నిర్వహిస్తారు. గ్రహణ కాల అభిషేకం దర్శించుకోవటం శుభప్రదమంటారు.
ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తీశ్వరాయలంలో పూజలు నిర్వహిస్తారు. అలాగే 21న సంపూర్ణ సూర్యగ్రహణ సందర్భంగా కూడా శాంతి అభిషేకాలు జరుపుటకు నిర్ణయించినట్లు సమాచారం.

# కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామికి పట్టువస్త్రాలు

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 30, ప్రభాతవార్త** శ్రీకాణీపాకం వరసిద్ధి వినాయక స్వామివారి కి బెజవాడ దుర్గమ్మవారి తరపున పట్టువస్త్రాలు ఇఓ వికె శీనా నాయక్ బృందం శనివారం కాణీపాకం ఇఓ పెంచల కిషోర్‌కు అందించారు. పట్టువస్త్రాలను తీసుకుని కాణీపాకం ఆలయానికి చేరుకున్న దుర్గమ్మఆలయ ఇఓ బృందంకు మేళతాళాలు, మంగళవాయిద్యాలు, మంత్రపఠనాల నడుమ అపూర్వ స్వాగతం పలికి శ్రీ స్వామివారి సన్నిధికి తోడ్కొని వెళ్ళారు. అనంతరం అక్కడ ప్రత్యేక పూజాదికాలు నిర్వహించి పట్టువస్త్రాలను స్వామివారి చెంత వుంచారు. అనంతరం దుర్గమ్మ ఆలయ ఇఓ వికె శీనా నాయక్ బృందానికి శ్రీ కాణీపాకం వినాయక స్వామివారి జ్ఞాపిక, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందించి వేదాశీర్వచనాలం పలికారు. కార్యక్రమం లో దుర్గమ్మ ఆలయ ప్రధాన అర్చకులు ఎల్ దుర్గాప్రసాద్, ఇఇ బి రాంబాబు, అసిస్టెంట్ కమీషనర్ సిహెచ్ రంగారావు, ఏఇఓ డా కె గంగాధర్, వైదిక కమిటీ సభ్యులు శ్రీధర్ శర్మ, దేవస్థానం అర్చకులు ఆర్ శ్రీనివాస శాస్త్రి, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు. దుర్గమ్మ వారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం రు.1,00,116ల విరాళాన్ని తాడేపల్లికి చెందిన డి శివనాగరాజు, దుర్గారాణి దంపతులు అందించారు. అదేవిధంగా వేద పరిరక్షణ ట్రస్టుకు రు.1లక్ష విరాళాన్ని, గో సంరక్షణకోసం రు.50వేలను అమెరికాలోని టెక్సాస్ కు చెందిన భక్తురాలు సాయి సౌమ్య కామ రాజు, భర్త యశ్వంత్ రావు, కుమారుడు ఇషాన్‌కృష్ణ పేరిట తన కుటుంబసభ్యులతో కలిసి అందించారు. అలాగే రు.5లక్షల విరాళాన్ని హైదరాబాద్ లోని మేఘమాల ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ జగన్ మోహన్‌రెడ్డి, భార్య అనుపమలు శనివారం అందించారు.


కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయం ఇఓ దుర్గగుడి ఇఓ బృందానికి మెమొంటో అందిస్తున్న దృశ్యం


కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో దుర్గగుడి ఇఓ, తదితరులు పట్టువస్త్రాలు అందిస్తున్న దృశ్యం

# నెల్లూరు పురవీధుల్లో మహిళల స్త్రీ శక్తి భారీ ర్యాలీ

## - థాంక్యూ సిఎం సార్ అంటూ నినాదాలు

## - సూపర్ సిక్స్- సూపర్ హిట్ అంటూ ముందుకు నడిచిన మహిళలు



**నెల్లూరు, ఆగస్టు 30, ప్రభాతవార్త-వైద్యం** సంక్షేమ పథకాలను అమలు చేయడం అన్ని ప్రభుత్వాలు చేసే పనే, కానీ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పలా మార్చినా, ఖజానా ఖాళీ చేసి వెళ్లినా, ఏ మాత్రం తడబడకుండా పథకాల అమలు విషయంలో తన చిత్తశుద్ధి నిరూపించుకుంది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే సూపర్‌సిక్స్ హామీలను పట్టాలెక్కించింది. అధికారంలోకి వచ్చి రాగానే పెన్షన్ల పెంపు ద్వారా తన చిత్తశుద్ధి నిరూపించుకుంది. పెన్షన్లు పెంచడమే కాదు, బకాయిలు కూడా చెల్లించి మంచి మనసు చాటుకున్నారు. సీఎం చంద్రబాబు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రతస్తులు, ఇలా అందరికి పెన్షన్లు పెంచారు. ఏడాదికి రూ.33వేల కోట్లు కేవలం పెన్షన్ల కోసమే ఖర్చు చేయడం ఈ ప్రభుత్వం ఘనత అనే చెప్పుకోవాలి. తల్లికి వందనం ద్వారా ఎంత మంది పిల్లలుంటే అందరికి పథకాన్ని వర్తింపచేయడం మరో సాహసం అనే చెప్పాలి. ప్రతి పిల్లవాడికి రూ.15వేలు చొప్పున తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ రైతులకు ఇచ్చే ఆర్థిక సాయాన్ని రూ.20వేలకు పెంచింది. ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తోంది. స్త్రీ శక్తి పథకం ద్వారా మమిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన వెంటనే తొలి సంతకాన్ని మెగా డీఎస్సీ పైలుపై చేసి ఏడాదిన్నరలోనే రిక్రూట్‌మెంట్ కూడా పూర్తి చేసి 16వేల మందికి పైగా ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇవ్వబోతోంది. కూటమి ప్రభుత్వం ఇవన్నీ ప్రచారం కోసం చెబుతున్న మాటలు కాదు, ప్రచార ఆర్భాటాలు ఎంత మాత్రం కాదు, హామీలు అమలైన వేళ మహిళామణులు స్వచ్ఛందంగా తరలి వచ్చి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. నెల్లూరు పురవీధుల్లో మహిళలు ప్రభుత్వానికి ధన్యవాద ర్యాలీ నిర్వహించారు. నెల్లూరు గాంధీ బొమ్మ సెంటర్ నుంచి మొదలైన ఈ ర్యాలీ పప్పుల వీధి వరకు సాగింది. దారి పొడవునా మహిళలు నినాదాలతో హోరెత్తించారు. సూపర్ సిక్స్-సూపర్ హిట్ అంటూ ప్రభుత్వానికి మద్దతుగా నినాదాలు చేశారు. నెల్లూరు నగరంలో జరిగిన ఈ ర్యాలీ కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం అయింది. 5వేల మంది వస్తారని అంచనా వేస్తే దాదాపు 10 వేల మందికి పైగా ర్యాలీలో పాల్గొన్నారని సంతోషం వ్యక్తం చేశారు. మంత్రి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి ఆధ్వర్యంలో మహిళా నేతలు కదం తొక్కారు. మాజీ మున్సిపల్ చైర్మన్ తాళ్ళపాక అనురాధ, నెల్లూరు సిటీ నియోజకవర్గ మహిళా క్లస్టర్లు కపిర రేవతి, విజయమ్మ, శ్రీలక్ష్మి, అంచురు జానకి, మంజుల, శిల్పా, చందన, గౌసున్నీసా, డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్, బీజేపీ, జనసేన నేతలు , మహిళా కార్పొరేటర్లు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.
నెల్లూరు పురవీధుల్లో సూపర్‌సిక్స్ - సూపర్ హిట్ అంటూ నినాదాలు చేస్తూ మహిళలు ముందుకు కదిలారు. సూపర్ సిక్స్ పథకాలతో కూడిన ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ చేపట్టారు. ర్యాలీ అనంతరం సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.
అనంతరం ఈ కార్యక్రమంలో మహిళా నేతలు ప్రసంగించారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా కూడా సూపర్‌సిక్స్ పథకాలను అమలులో పెట్టిన సీఎం చంద్రబాబుకి ధన్యవాదాలు తెలిపారు.

# రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్‌గా ఆర్‌డి విల్సన్



**విజయవాడ,ఆగస్టు 30,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు సంస్కృత అకాడమీ చైర్మన్ గా విల్సన్ తెలుగు సంస్రుత అకాడమీ చైర్మన్ గా ఆర్. డి. విల్సన్ శరత్ చంద్ర ని నియమాకం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 156 విడుదల చేసింది. విల్సన్ బీజేపీ అధికార ప్రతినిధి గానూ, గతం బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు. దశాబ్ద కాలం పైగా బీజేపీ కి సేవలు అందించారు. అంతకు ముందు ఆయన కాంగ్రెస్ పార్టీ హయాం లో ఉమ్మడి రాష్ట్రములో ఎస్. సి కార్పొరేషన్ చైర్మన్ గా పని చేశారు. విల్సన్ ఉన్నత విద్యావంతుడు. ఈనాడు, ఆంధ్ర జ్యోతి లో ఏడేళ్ల పని చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా 9 ఏళ్ళు పని చేసి తన ఉద్యోగం కి రాజీనామా చేసి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. సృజన శీలి శరత్ చంద్ర కలం పేరుతో నాలుగు వందలకు పైగా కథలు, 20 పైగా నవలలు రాసారు. ప్రస్తుతం ఉషా సాహితీ పత్రికలకు సంపాదకులు గా వ్యవహరిస్తున్నారు. తానా సభల్లోనూ, అంతర్జాతీయ తెలుగు మహాసభల్లోనూ వక్త గా పాల్గొని తన బాణీ వినిపించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తనని నమ్మి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడి గారికి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ గారికి, జనసేన నేత పవన్ కళ్యాణ్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు భాషా వికాసం కొరకు కృషి చేస్తాను అన్నారు.

# వైద్య విద్య ఇన్‌చార్జి డైరెక్టర్‌గా రఘునందన్

**విజయవాడ,ఆగస్టు30,ప్రభాతవాక్తప్రతినిధి:** వైద్య విద్య ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా జి రఘునందన్‌ను రాష్ట్రప్రభుత్వం నియమించింది. ఇందుకు సంబంధించిన జివో 550ను వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు శనివారం విడుదల చేశారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా ఉన్న అడిషనల్ డైరెక్టర్ డిఎస్‌విఎల్ నరసింహాం ఈ నెల 31వ తేదితో పదవి విరమణ చేయనున్నారు. ప్రస్తుతం నియమించిన రఘునందన్ కూడా అడిషనల్ డైరెక్టర్‌గా వైద్య విద్య డైరెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.


# రోగులను పరీక్షిస్తూ గుండెపోటుతో చనిపోయిన కార్డియాక్ సర్జన్!

**చెన్నై, ఆగస్టు 30:** హృద్రోగ బాధితులకు చికిత్స చేసి ప్రాణాలు కాపాడే వైద్యుడు అదే గుండెపోటుతో మరణిం చాడు. ఆసుపత్రిలో రోగు లను పరీక్షిస్తూ ఒక్క సారిగా కుప్పకూలాడు. ఆయనను కాపాడేందుకు తోటి వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తమిళనాడులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో సేవలందిస్తున్న యువవైద్యుడు బుధవారం రాత్రి కన్ను మూశాడు. ఓ కార్డియాక్ సర్జన్ గుండెపోటుతో చనిపోవడంపై వైద్య వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వివరాల్లోకి వెళితే చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో డాక్టర్ గ్రాడ్లిన్‌రాయ్ (39) కార్డియాక్ సర్జన్ గా సేవ లందిస్తున్నారు. బుధవారం రాత్రి ఆసుపత్రిలో విధుల్లో ఉన్నారు. హృ ద్రోగ వార్డులోని పేషెంట్లను పరీక్షిస్తుండగా రాయ్ గుండెపోటుకు గుర య్యారు. అకస్మాత్తుగా కుప్పకూలిన డాక్టర్ రాయ్ ను వెంటనే ఐసీ యూకు తరలించి చికిత్స అందించినా ఫలితం లేకపోయిందని గ్రాడ్లిన్ రాయ్ ప్రాణాలు కోల్పోయారని ఆసుపత్రి అధికారులు తెలిపారు. హృద్రో గాలపై పూర్తి అవగాహన కలిగిన కార్డియాక్ సర్జన్ అదే గుండెపోటుతో మరణించడంపై వైద్య వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గ్రాడ్లిన్ రాయ్‌కు ఎలాంటి అనారోగ్య సమస్యలు కూడా లేవని ఆయన సహచర వైద్యుడు సుధీర్ కుమార్ పేర్కొన్నారు. వైద్యులు రోజుకు 1218 గంటలు పనిచేయాల్సి వస్తుందని, అందువల్ల వారిపై ఒత్తిడి అధికంగా ఉంటుం దని అన్నారు. రాయ్ మరణానికి ఇదే కారణమై ఉంటుంది.

# అవినీతి, అక్రమాలకు పాల్పడే వైద్యుల ప్రవర్తనపై నిఘా నేత్రాలు

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 30,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాలలోని దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోని కొన్ని డివిజన్‌లలో అవినీతి, అక్రమాలకు అలవాటు పడిన కొందరు వైద్యాధికారుల ప్రవర్తనపై రైల్వే నిఘా నేత్రాలు జోన్‌వ్యాప్తంగా ఉన్న రైల్వే ఆసుపత్రులలో దీర్ఘకాలంగా కనీసం ఆరేడు మాసాల మొదలు ఏడాది కాలానికి పైగా లాంగ్ సిక్ లీవ్‌లో ఉన్న కేటుగాళ్లపై రైల్వే నిఘా వర్గాలు డేగా కన్నులతో దృష్టి సారించాయి. విజయవాడ రైల్వే డివిజన్‌లో సీనియర్ పాసింజర్ ట్రైన్ 2 మేనేజర్‌గా పనిచేస్తున్న శివ నాగప్రసాద్ లైట్ జాబ్ నిమిత్తం మెడికల్ డి-క్యాటగిరైజేషన్ చేసుకొనేందుకు ఆసుపత్రిలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న హస్మత్ అలీ, అతని బావమరిది ఎస్‌కె రసూల్ ద్వారా ప్రయత్నించి లాలాగూడ రైల్వే సెంట్రల్ ఆసుపత్రిలో సిబిఐకి పట్టుబడిన విషయం పాఠకులకు విధితమే. ఈక్రమంలో కేంద్రీయ నిఘా వర్గాలు హైదరాబాద్, సికింద్రాబాద్, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు, నాందేడ్, లాలాగూడ, మెట్టుగుడ, తిరుపతి సిఆర్‌ఎస్, రాయనపాడు వర్క్‌షాప్‌లలో పనిచేసే సిబ్బంది వాస్తవంగా అనారోగ్యం కారణంగా సీక్ లీవ్‌లో ఉన్నారా, లేక కొందరు అవినీతి అక్రమాలకు అలవాటు పడిన వైద్యాధికారులను మ్యానేజ్ చేసుకుని సిక్‌లో ఉంటున్నారా అనే అంశాలపై వివరాలు సేకరిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. మెడికల్ అన్‌ఫిట్‌లకు భారతీయ రైల్వేలోనే పేరుగాంచిన గుంతకల్లు రైల్వే డివిజన్‌లో దాదాపుగా మూడు నుంచి ఐదుగురు సిక్‌లీవ్‌పై ఉన్నట్లు గుర్తించారు. లాంగ్ సిక్ లీవ్‌లో ఉన్నవారు నిజంగానే చికిత్స నిమిత్తం సిక్ లీవ్‌లో ఉన్నారా..?లేక మెడికల్ డీ-క్యాటగిరైజేషన్ నిమిత్తం ఉద్దేశపూర్వకంగా పైరవీదారుల మాటలునమ్మి లాంగ్ సిక్ లీవ్‌లో కొనసాగుతున్నారా అనే కోణంలో కూడా సమాచారాన్ని రాబడుతున్నట్లు తెలిసింది. ఉమ్మీద్ కార్డ్, సిఆర్ నంబర్‌లు ఆధారంగా ఎవరు ఎన్నెన్ని రోజుల నుంచి సిక్ లీవ్‌లో ఉన్నారు తదితర అంశాలపై అంతర్గత విచారణ కొనసాగిస్తున్నారు. ఈ విషయంలో ఫేక్ సిక్ లీవ్‌లో ఉన్నవారు, వారికి సహకరిస్తున్న వైద్యాధికారులు సైతం సమస్యల వలయంలో చిక్కుకొన్నట్లే..

# టిటిడిలో అక్రమంగా సస్పెండ్ చేసిన దళిత ఉద్యోగులను తిరిగి విధుల్లో చేర్చుకోండి: సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



విజయవాడ. ఆగస్టు30, ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల, తిరుపతి దేవస్థానంలో అక్రమంగా సస్పెండ్ చేసిన ఎనిమిది మంది దళిత ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. టిటిడిలో 30 ఏళ్ల నుంచి పనిచేస్తున్న ఎనిమిది మంది షెడ్యూల్డు కులాలకు చెందిన ఉద్యోగులను ఇటీవల సస్పెండ్ చేశారని తెలిపారు. టిటిడి ఒక ధార్మిక సంస్థ అని, దేవుని దృష్టిలో ప్రజలందరూ సమానమేనని, టిటిడి చర్య పూర్తిగా రాజ్యాంగస్ఫూర్తికి వ్యతిరేకమైనదని పేర్కొన్నారు. హిందూమతేతర ప్రార్థనా కార్యక్రమాల్లో పాల్గన్నారనే పేరిట వీరిపై చర్యలు తీసుకున్నారని, 2007కు ముందు వీరు టిటిడి ఉద్యోగాల్లో నియమించబడ్డారని వివరించారు. ఆ నాటికి ఇతర మతస్తులకు కూడా టిటిడి ఉద్యోగాల్లో అర్హత ఉందని, గత వందేళ్లుగా ఆలయ నిర్వహణలో వివిధ డిపార్ట్‌మెంట్లలో అన్ని తరగతులకు చెందిన వేలాదిమంది ఉద్యోగులు నియమించ బడుతున్నారని వివరించారు. కొందరు కారుణ్య నియామకాల ద్వారా నియమించబడ్డారని, అన్యమతస్తుల పేరిట కొంత మందిని సస్పెండ్ చేయడం సరైంది కాదని, టిటిడి సంప్రదాయానికి భిన్నమైనదని తెలిపారు. 2007 తరువాత హిందువులు మాత్రమే టిటిడిలో ఉద్యోగాలకు అర్హులని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, అప్పటి నుంచి ఇతర మతస్తులను ఉద్యోగాల్లోకి తీసుకోవడం లేదని పేర్కొన్నారు. తొలగించబడిన ఉద్యోగులు కొందరు రెండు, మూడు ఏళ్లలో పదవీ విరమణ కూడా చేయనున్నారని, 30 ఏళ్లకు పైగా టిటిడి, భక్తుల సేవలో వీరు ఉన్నారని తెలిపారు. సంస్థ పట్ల నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ సస్పెండ్ చేయడం సరైంది కాదని తెలిపారు. టిటిడిలో పనిచేస్తున్న 29 మంది ఇతర మతస్తులను రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉద్యోగాల్లోకి తీసుకోవాలని గతంలో టిటిడి యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించగా, సాంకేతిక కారణాలతో ఈ విజ్ఞప్తిని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించిదని వివరించారు. టిటిడి పరిధిలో విద్యాలయాలు, ఆస్పత్రులు, ఇంజినీరింగ్ వంటి సెక్షన్లలో పని చేయించుకోవాలని సూచించిందని, రాష్ట్ర ప్రభుత్వం జనవరి 24, 2025న మెమో నెం.1743960/337/2022 దేవాదాయశాఖ3 ద్వారా పై ఉత్తర్వులను జారీ చేశారని తెలిపారు. 29 మంది హిందూయేతరులను గతంలో తొలగించాలని టిటిడి యాజమాన్యం నిర్ణయించినపుడు హైకోర్టు మంద లించి నిలుపుదల చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుతం టిటిడి యాజ మాన్యం వ్యవ హరించిన తీరు హక్కుల ఉల్లం ఘనగా కనిపి స్తోందని, ఉద్యోగులందరికీ భద్రత కల్పించాల్సిన టిటిడి యాజమాన్యం మతం పేరుతో విభజన తీసుకురావడం అన్యాయమని తెలిపారు. ముఖ్యమంత్రిగా జోక్యం చేసుకుని, ఉద్యోగులను ఆదుకోవాలని,
సస్పెన్షన్ ఎత్తి వేసి వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

31-8Pg5.qxd:31-8Pg5.qxd 1/1/02 5:57 AM Page 1



# బడా టెర్రరిస్టు బాగుఖాన్ హతం

## నియంత్రణ రేఖ వద్ద భద్రతా బలగాల కాల్పుల్లో మరో ఉగ్రవాది కూడా కాల్చివేత



బాగుఖాన్ (ఫైల్)

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** జమ్మూ కాశ్మీర్ పోలీసులకు 25 ఏళ్లుగా కొరకురాని కొయ్యగా మారిన గజ టెర్రరిస్టు, కాశ్మీర్‌లోకి వంద మందికి పైగా చొరబాటుదారులను పంపించిన బాగుఖాన్ (50) భద్రతా బలగాల ఎదురు కాల్పుల్లో హతమయ్యాడు. హ్యూమన్ జీపీఎస్‌గా పేరొందిన బాగుఖాన్ పాక్ ఉగ్రవాద సంస్థ హిజ్బుల్ ముజాహిద్దీన్‌కు చెందిన టాప్ కమాండర్లలో ఒకడు. పాకిస్తాన్‌లోని లాహోర్‌కు చెందిన ఈ ఉగ్రవాది 30 ఏళ్లుగా పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో వుంటూ సరిహద్దు నియంత్రణ రేఖ వెంబడి చొరబాటుదారులను భారత్‌లోకి అక్రమంగా పంపడంలో దిట్టగా పేరుగాంచాడు. ఇప్పటి వరకు ఇతను వంద మందికి పైగా పాక్ ఉగ్రవాదులను భారత్‌లోకి పంపినట్లు నిఘా వర్గాలు చెబుతున్నాయి. పాక్ ఆక్రమిత ప్రాంతం సరిహద్దులో గల నౌషేరా, బందిపోరా, గురెజ్ సెక్టార్ల గురించి బాగు ఖాన్‌కు పూర్తి అవగాహన వుంది. ఎలాంటి కఠినమైన పరిస్థితులు ఎదురైనా, ఎంతటి కఠిన మార్గాలలో అయినా ఉగ్రవాదులను భారత్‌లోకి చొరబడేందుకు అనువైన పరిస్థితులను కల్పించడంలో ఇతను దిట్టగా పేరొందాడు. ఈ క్రమంలోనే ఇతన్ని భద్రతా బలగాలు హ్యూమన్ జీపీఎస్‌గా పిలుస్తుంటారు. దీంతో పాటు ఇతన్ని పాక్ ఉగ్రవాదులు సముందర్ చా చాగా కూడా పిలుస్తుంటారు. అనేకసార్లు ఇతను ఉగ్రవాదులను పంపే క్రమంలో జరిగిన కాల్పుల్లో తప్పించుకున్నాడు. కాగా తాజాగా ఈ నెల 23 వ తేదీన నౌషేరా సెక్టార్ ప్రాంతంలో మరోసారి ఉగ్రవాదులు భారత్‌లోకి చొరబడేందుకు యత్నిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సైన్యంతో పాటు బిఎస్ఎఫ్ బలగాలు ఆపరేషన్ నిర్వహించాయి. భద్రతా బలగాల రాకను గమనించిన బాగుఖాన్ బృందం కాల్పులకు దిగగా సైన్యం కూడా ఎదురు కాల్పులకు దిగింది. ఈ సందర్భంగా ఇద్దరు ఉగ్రవాదులు మరణించారు. మృతుల్లో ఒకరిని మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టు బాగుఖాన్‌గా గుర్తించామని సైన్యం శనివారం ఎక్స్ ద్వారా వెల్లడించింది. బాగు ఖాన్‌తో పాటు చనిపోయిన మరో ఉగ్రవాదిని ఇంకా గుర్తించలేదు. కాగా ఈ ఏడాది ఏప్రిల్ 22వ తేదీన పెహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పైశాచిక దాడి తరువాత భద్రతా బలగాల కాల్పుల్లో 23 మంది టెర్రరిస్టులు హతమయ్యారు. వీరిలో 12 మంది పాక్ దేశస్తులు కాగా తొమ్మిది మంది స్థానిక ఉగ్రవాదులుగా సైన్యం వెల్లడించింది.




## భార్య వదిలేస్తే జాక్‌పాట్ కొట్టిన భర్త

### రాత్రికిరాత్రే కోటీశ్వరుడు

**న్యూజెర్సీ, ఆగస్టు 30:** అమెరికాలోని న్యూజెర్సీకి చెందిన మైక్ వీర్‌స్కీకి ఉద్యోగం లేదన్న కారణంతో భార్య విడాకులు ఇచ్చిన కొద్ది రోజులకే, అతడికి ఏకంగా రూ.2,280 కోట్ల లాటరీ తగలడం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఉద్యోగంలేదని, ఆర్థిక అవసరాలు కూడా తీర్చలేని భర్త ఎందుకని వీర్‌స్కీ నుంచి భార్య విడిపోయి వెళ్లిపోయింది. మైక్ వీర్‌స్కీకి గత 15 ఏళ్ల క్రితం వివాహమైంది. అయితే, అతడికి సరైన ఉద్యోగం లేదు. కనీస అవసరాలు కూడా తీర్చడం లేదని, బయటకు తీసుకువెళ్లడం లేదని భార్య తరచూ గొడవ పడేది. పదిహేనేళ్ల పాటు ఈ గొడవలు కొనసాగాయి. చివరికి విసిగిపోయిన ఆమె ఇక నీతో కలిసి జీవించలేను అంటూ విడాకులు తీసుకుని వెళ్లిపోయింది. భార్య వదిలి వెళ్లిన తర్వాత మైక్ జీవితం ఊహించని మలుపు తిరిగింది. అతడు కొనుగోలు చేసిన ఓ లాటరీ టికెట్‌కు భారీ జాక్‌పాట్ తగిలింది. దాని విలువ అక్షరాలా 273 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ. 2,280 కోట్లు). దీంతో అతడు రాత్రికి రాత్రే కోటీశ్వరుడుగా మారిపోయాడు. ఈ వార్త కాస్తా సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యింది. నెటిజన్లు దీనిపై ఆసక్తికరంగా స్పందిస్తున్నారు. విడాకులు ఒక జాక్‌పాట్, లాటరీ రెండో జాక్‌పాట్ నువ్వు డబుల్ జాక్‌పాట్ కొట్టావు బ్రదర్ అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఇప్పుడు ఈ విషయం తెలిసి నీ మాజీ భార్య కచ్చితంగా తిరిగి వస్తుంది చూడు అని మరికొందరు జోస్యం చెబుతున్నారు. మొత్తానికి, మైక్ వీర్‌స్కీ కథ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.



## బీహార్ 'సర్' తరహాలోనే తమిళనాడులోను ఓట్ల చోరీ

### అనుమానం వ్యక్తంచేసిన సిఎం స్టాలిన్

**చెన్నై, ఆగస్టు 30:** తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత స్టాలిన్ కేంద్ర ఎన్నికల సంఘంపై సంచలన ఆరోపణలు చేశారు. 'ప్రత్యేక సమగ్ర సవరణ' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పేరుతో రాష్ట్రంలో ఓట్లను అక్రమంగా తొలగించే కుట్ర జరగవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. బీహార్‌లో జరిగిన తరహాలోనే ఇక్కడ కూడా ఓట్లచోరీకి పాల్పడే అవకాశాలు ఉన్నాయని, పార్టీ శ్రేణులు, ముఖ్యంగా బూత్ స్థాయి ఇన్‌ఛార్జులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయనపిలుపునిచ్చారు. డీఎంకే న్యాయవిభాగం కార్యదర్శి, ఎంపీ ఎన్ఆర్ ఇళంగో కుమార్తె వివాహ వేడుకలో స్టాలిన్ తన భార్య దుర్గా స్టాలిన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశం ప్రస్తుతం అత్యంత క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొంటోందని అన్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం, కేంద్రంలోని పాలకపక్షానికి అనుకూలంగా పనిచేస్తోందని ఆయన ఆరోపించారు. బీహార్‌లో జరిగిన ఓట్ల చోరీ ఎంతటి తీవ్ర ప్రభావం చూపిస్తోందో అందరికీ తెలుసని అన్నారు. బీహార్‌లో ఓట్ల తొలగింపునకు వ్యతిరేకంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిర్వహించిన నిరసన ర్యాలీలో తాను కూడా పాల్గొన్నానని, దానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని స్టాలిన్ తెలిపారు. అలాంటి పరిస్థితి తమిళనాడులో పునరావృతం కాకుండా డీఎంకే కార్యకర్తలు, మిత్రపక్షాల నాయకులు జాగ్రత్త వహించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో అధికారులు ఏవైనా తప్పులు చేయడానికి ప్రయత్నిస్తే వారిని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం చర్యలను అడ్డుకునేందుకు ఎన్ఆర్ ఇళంగో న్యాయపోరాటం చేశారని ఈ సందర్భంగా స్టాలిన్ ప్రశంసించారు. ఈ వివాహ వేడుకకు కాంగ్రెస్ సీనియర్‌నేత పి.చిదంబరం, డీఎంకే కోశాధికారి టీఆర్ బాలు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, మంత్రి సామినాథన్, ఎంపీ తిరుచ్చి శివా తదితర ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# సుంకాలు అమల్లోనే ఉన్నాయి..

### కోర్టు తీర్పుపై డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన




**వాషింగ్టన్, ఆగస్టు 30:** వివిధ దేశాలపై అమెరికా విధించిన సుంకాలు అమలులోనే ఉన్నాయని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం సోషల్ మీడియాలో స్పష్టం చేశారు. సుంకాలు చట్టవ్యతిరేకమంటూ అప్పీల్స్ కోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో ట్రంప్ ఈ వివరణ ఇచ్చారు. సుంకాలు చట్ట వ్యతిరేకమన్న న్యాయస్థానం తీర్పుపై సుప్రీం కోర్టులో సవాల్ చేసేందుకు ట్రంప్ సర్కారుకు కొంత గడువు ఇచ్చింది.'అన్ని సుంకాలు అమలులోనే ఉన్నాయి. సుంకాలు తొలగించాలంటూ అప్పీల్స్ కోర్టు అసంబద్ధమైన తీర్పు ఇచ్చింది. కానీ తుదకు విజయం అమెరికాదే. ఈ సుంకాలను తొలగిస్తే దేశానికి తీవ్ర నష్టం జరగుతుంది. ఆర్థికంగా మనం బలహీనపడతాం. మనం ధైర్యంగా నిలబడాలి' అని ఆయన తన సోషల్ మీడియా ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు.

వాణిజ్య లోటు, ఇతర దేశాలు తమపై అన్యాయంగా విధిస్తున్న సుంకాలను అమెరికా ఇక ఎంతమాత్రం సహించదని ట్రంప్ స్పష్టం చేశారు. మిత్ర దేశమైనా ప్రత్యర్థి దేశమైనా అమెరికా కంపెనీలు, రైతులు, ఇతరులకు వాణిజ్యపరమైన అడ్డంకులు సృష్టిస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. సుంకాలు రద్దు చేసిన కోర్టు తీర్పును అంగీకరిస్తే అమెరికా నాశనం అవుతుందని హెచ్చరించారు.

మేడ్ ఇన్ అమెరికా ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు, అమెరికా ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ఇతర దేశాలపై సుంకాల విధింపు తప్పనిసరి అని ట్రంప్ వాదిస్తున్న విషయం తెలిసిందే. ట్రంప్ అధ్యక్ష పదవి చేపట్టి దాదాపు 7 నెలలు అవుతోంది. రెండోసారి అధికారంలోకి వచ్చాక డొనాల్డ్ ట్రంప్ సుంకాలనే ప్రధాన ఆయుధంగా మలుచుకున్నారు. సుంకాల బెదిరింపుతో పలు దేశాలను లొంగదీసుకుని డీల్స్ కుదుర్చుకునే ప్రయత్నం చేయడం, లొంగని దేశాలపై భారీగా సుంకాలను పెంచడం చేస్తున్నారు. దీనిపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అమెరికాలోనే ట్రంప్ సర్కారు నిర్ణయంపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రస్తుతం భారత్, బ్రెజిల్ ఉత్పత్తులపై ట్రంప్ సర్కారు ఏకంగా 50 శాతం సుంకం విధిస్తోంది.

# ట్రంప్ అనారోగ్యంపై సోషల్‌మీడియాలో వైరల్



**వాషింగ్టన్, ఆగస్టు 30:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యంపై సామాజిక మాధ్యమాల్లో ఊహాగానాలు వెల్లువెత్తాయి. శనివారం 'ఎక్స్' వేదికగా 'ట్రంప్ ఈజ్ డెడ్' అనే హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్‌లో ఉండటం కలకలం రేపింది. ఈ హ్యాష్‌ట్యాగ్‌తో వేలాది పోస్టులు వెలువడటంతో 79యేళ్ల ట్రంప్ ఆరోగ్య పరిస్థితిపై జరుగుతున్న ఊహాగానాలకు మరింత ఆజ్యం పోసినట్టయింది. ఈ వదంతులకు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు మరింత బలం చేకూర్చాయి. ఆగస్టు 27న ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'ఒకవేళ ఏదైనా విషాదం సంభవిస్తే, బాధ్యతలు చేపట్టేందుకు నేను సిద్ధంగా ఉన్నాను' అని అన్నారు. అయితే, అదే సమయంలో అధ్యక్షుడు ట్రంప్ చాలా చురుగ్గా, ఆరోగ్యంగా ఉన్నారని కూడా ఆయన పేర్కొన్నారు. ట్రంప్ రాత్రింబవళ్లు ఎంతో ఉత్సాహంగా పని చేస్తారు. ఆయన ఆరోగ్యం చాలా బాగుంది అని వాన్స్ వివరించారు. అయినప్పటికీ, ఆయన చేసిన 'విషాదం' అనే వ్యాఖ్యను పట్టుకుని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం ఊపందుకుంది. కొన్ని నెలలుగా ట్రంప్ ఆరోగ్యంపై వివిధ రకాల వార్తలు వస్తున్నాయి. జూలైలో ఆయన చేతిపై గాయపు మచ్చలు, కాళ్ల వాపులతో కనిపించడం చర్చనీయాంశమైంది. ఇటీవలి కాలంలో మళ్లీ అలాంటి చిత్రాలే బయటకు రావడం, వాటిని మేకప్‌తో కప్పిపుచ్చే ప్రయత్నం చేశారన్న ఆరోపణలు రావడంతో అనుమానాలు బలపడ్డాయి. దీనికితోడు, ఆయన కొంతకాలంగా బహిరంగంగా కనిపించడం లేదనే ప్రచారం కూడా ఈ వదంతులకు కారణమైంది. అయితే, ఈ ప్రచారంలో వాస్తవం లేదని తెలుస్తోంది. ట్రంప్ సామాజిక మాధ్యమాల్లో చురుగ్గానే ఉన్నారు. ఆయన తన ట్రూత్ సోషల్ ఖాతాలో శనివారం తెల్లవారుజామున 3:40 గంటలకు కూడా ఒక పోస్ట్ చేశారు. వాషింగ్టన్ కాలమానం ప్రకారం శుక్రవారం సాయంత్రం 6:40 గంటల సమయానికి ఆయన ఆ పోస్టు పెట్టారు.

# నిరసన తెలిపిన బిజెపి కేడర్‌కు మిఠాయిలు పంచిన రాహుల్




**పాట్నా, ఆగస్టు 30:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన రాజకీయ యాత్రలో ఓ అనూహ్య చర్యతో అందరినీ ఆశ్చర్యపరిచారు. బీహార్‌లో తనకు వ్యతిరేకంగా నల్ల జెండాలతో నిరసన తెలుపుతున్న వారికి ఆయన స్వయంగా మిఠాయిలు అందించారు. వోటర్ అధికార్ యాత్ర నిర్వహిస్తున్న రాహుల్‌గాంధీకి భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) కార్యకర్తల నుంచి నిరసన ఎదురైంది. ఇటీవల రాహుల్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన తల్లిని ఉద్దేశించి కొందరు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ వారు నల్ల జెండాలు ప్రదర్శించారు. అయితే, నిరసనకారుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేయకుండా రాహుల్ గాంధీ వారి వద్దకు మిఠాయిలు పంపించి సానుకూల దృక్పథాన్ని ప్రదర్శించారు. ఈ నిరసనల మధ్యే రాహుల్ గాంధీ తన యాత్రను కొనసాగించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో పాటు ఎన్నికల సంఘం కూడా కలిసి దేశంలో ఓట్లను దొంగిలిస్తున్నాయని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. బీహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా చేపట్టిన ఈ యాత్ర దేశవ్యాప్త ఉద్యమంగా మారుతుందని ఆయన స్పష్టంచేశారు. ప్రధానిపై అనుచిత వ్యాఖ్యల వీడియో వైరల్ కావడంతో బీజేపీ తీవ్రంగాస్పందించింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై రాహుల్ స్పందిస్తూ, సత్యం, అహింస గెలుస్తాయి, అసత్యం, హింస నిలబడవని సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఓటు హక్కు అనేది దళితులు, మైనారిటీలు, మహిళలదని, కానీ మోదీ ప్రభుత్వం గెలుపు కోసం ఓట్లను దొంగిలిస్తోందని ఆయన ఆరోపించారు. బీహార్‌లో ఒక్క ఓటు కూడా దొంగతనానికి గురికాకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

# ఎనిమిదినెలల్లో 841 మంది ఉరితీత

## ఇరాన్‌లో అత్యంత కఠినంగా ఉరిశిక్షలు అమలు




**టెహ్రాన్, ఆగస్టు 30:** ఇరాన్‌లో మరణశిక్షల అమలు ఆందోళనకర స్థాయిలో పెరిగిపోయిందని ఐక్యరాజ్య సమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అసమ్మతి గళాలను, వ్యతిరేకతను అణచివేసేందుకు అక్కడి ప్రభుత్వం ఉరిశిక్షలను ఒక ఆయుధంగా ప్రయోగిస్తోందని ఆరోపించింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఆగస్టు 28 వరకు కేవలం ఎనిమిది నెలల వ్యవధిలోనే ఇరాన్‌లో కనీసం 841 మందికి మరణశిక్ష అమలు చేశారని యూఎన్ మానవ హక్కుల విభాగం (ఓహెచ్‌సీహెచ్ఆర్) విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గత ఏడాదితో పోలిస్తే ఉరిశిక్షల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు యూఎన్ నివేదిక స్పష్టం చేసింది. కేవలం జులై నెలలోనే 110 మందిని ఉరితీశారని, ఇది గతేడాది జులైలో నమోదైన సంఖ్యకు రెట్టింపు కంటే ఎక్కువని తెలిపింది. మరణశిక్షకు గురైన వారిలో మహిళలు, ఆఫ్ఘనిస్థాన్ పౌరులతో పాటు బలోచ్, కుర్దులు, అరబ్బుల వంటి మైనారిటీ వర్గాల వారు అధికంగా ఉన్నారని పేర్కొంది. పారదర్శకత లేకపోవడం వల్ల వాస్తవ మృతుల సంఖ్య ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఐరాస ప్రతినిధి రవీనా షమ్దాసాని అన్నారు. మైనారిటీలు, వలసదారులనే లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆమె వివరించారు. ఇరాన్‌లో బహిరంగంగా ఉరితీయడాన్ని కూడా ఐక్యరాజ్య సమితి తీవ్రంగా ఖండించింది. ఈ ఏడాది ఇప్పటివరకు ఏడు బహిరంగ ఉరిశిక్షలు నమోదయ్యాయని పేర్కొంది. ఇలాంటి చర్యలు ప్రజల్లో, ముఖ్యంగా వాటిని చూడవలసి వస్తున్న చిన్నారులలో తీవ్ర మానసిక క్షోభకు కారణమవుతాయని షమ్దాసాని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మరో 11 మంది ఉరిశిక్ష ప్రమాదంలో ఉన్నారని ఐరాస తెలిపింది. వీరిలో ఆరుగురిపై ప్రవాస ప్రతిపక్ష సంస్థ పీపుల్స్ ముజాహిదీన్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇరాన్ (ఎంఈకే) తో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో 'సాయుధ తిరుగుబాటు' అభియోగాలు మోపారు. మిగిలిన ఐదుగురిని 2022 నాటి నిరసనల్లో పాల్గొన్నందుకు దోషులుగా నిర్ధారించారు. వీరిలో కార్మిక హక్కుల కార్యకర్త షరీఫే మహమ్మది కూడా ఉన్నారు.

ఆమెకు విధించిన మరణశిక్షను గతవారమే ఇరాన్ సుప్రీంకోర్టు ఖరారు చేసింది. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్ వోల్కర్ టర్క్ ఈ విషయంపై స్పందిస్తూ, ఇరాన్ తక్షణమే మరణశిక్షలపై తాత్కాలిక నిషేధం (మారిటోరియం) విధించాలని డిమాండ్ చేశారు. "మరణశిక్ష జీవించే హక్కును కాలరాస్తుంది. దీనివల్ల అమాయకులను ఉరితీసే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది" అని షమ్దాసాని తెలిపారు. గత ఏడాది ఇరాన్‌లో 850 మందికి పైగా మరణశిక్ష అమలు చేసినట్లు మానవ హక్కుల సంస్థలు నివేదించగా, ఈ ఏడాది ఆ సంఖ్య మరింత పెరగడం ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది.



## మాజీ ఎమ్మెల్యే పింఛన్‌కు జగదీప్ ధన్‌ఖడ్ దరఖాస్తు

**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** పదవీ కాలం మిగిలి ఉన్నప్పటికీ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తూ జగదీప్ ధన్‌ఖడ్ తీసుకున్న అనూహ్య నిర్ణయం దేశరాజకీయాల్లో సంచలనం రేపిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆయన మాజీ ఎమ్మెల్యే పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా అందుకు సంబంధించిన ప్రక్రియ మొదలైంది. ధన్‌ఖడ్ గతంలో రాజస్థాన్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1993 అసెంబ్లీ ఎన్నికల్లో అజ్మేర్‌లోని కిషన్‌గడ్ నుంచి కాంగ్రెస్ తరఫున విజయం సాధించారు. ఆ సమయంలో రూల్స్ కమిటీకి సభ్యుడిగానూ పనిచేశారు. నిబంధనల ప్రకారం రాజస్థాన్ మాజీ ఎమ్మెల్యే రూ.35వేల పింఛన్‌కు అర్హులు. అలాగే వయసు ఆధారంగా ఆ మొత్తంలో పెంపు ఉంటుంది. 70 ఏళ్లు దాటిన మాజీ సభ్యుడికి 20 శాతం అదనపు పింఛను అందుతుంది. అదే 80 యేళ్లు దాటితే అది 30 శాతంగా ఉంటుంది. మాజీ ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ ప్రస్తుత వయసు 74 యేళ్లు. దాంతో ఆయనకు రూ.42వేల వరకు పింఛన్ లభించనుంది. ఈ పింఛన్ దరఖాస్తు అందిందని రాజస్థాన్ అసెంబ్లీ స్పీకర్ వాసుదేవ్ దేవనాని వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ధన్‌ఖడ్‌కు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉంది. లోక్‌సభ సభ్యుడిగా, కేంద్రమంత్రిగా పనిచేశారు. 2003లో బిజెపిలో చేరారు. 2019 నుంచి 2022 మధ్య పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2022ఆగస్టులో ఉపరాష్ట్రపతిగా నియమితులైన ధన్‌ఖడ్ రెండేళ్ల పదవీకాలం మిగిలి ఉండగానే అనూహ్యంగా వైదొలిగారు. అనారోగ్య కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

# దేశాల మధ్య శాశ్వత మిత్రత్వం, శత్రుత్వం ఉండదు..

### రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** దేశాల మధ్య శాశ్వత మిత్రత్వం , శత్రుత్వం అంటూ ఏమీ ఉండదని, అలాగే శాశ్వత మిత్రులు కాని, శత్రువులు కాని ఉండరని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. కేవలం ఆ దేశానికి ఉపయోగపడే శాశ్వత ప్రయోజనాలే ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే రక్షణరంగంలో ఆత్మనిర్భరత సాధించడం అత్యావశ్యకమని ఓ జాతీయ మీడియా సదస్సులో అన్నారు. పహల్గాం ఉగ్రదాడి – ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాలు, ట్రంప్ టారిఫ్‌లు, ప్రధాని మోడీ చైనా పర్యటన నేపథ్యంలో భారత్ అనుసరిస్తోన్న వైఖరిని వెల్లడించారు. ప్రపంచం వేగంగా మారుతోంది. అదే సమయంలో కొత్త సవాళ్లు పుట్టుకొస్తున్నాయి. మహమ్మారులు, ఉగ్రవాదం, ప్రాంతీయ ఘర్షణలు వంటి వాటితో ఈ శతాబ్దం అత్యంత సవాలుతో కూడి ఉందని అర్థమవుతోంది. ఈ నేపథ్యంలో మన వ్యూహాత్మక అవసరాల దృష్ట్యా, ఆత్మనిర్భరత అనేది అత్యావశ్యకం. మనకు శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరు. శాశ్వత ప్రయోజనాలే ఉంటాయి. భారత్ ఎవరినీ శత్రువుగా పరిగణించదు. మన రైతులు, వ్యాపారవేత్తల ప్రయోజనాలే మనకు ముఖ్యం. ప్రస్తుతం మారుతున్న భౌగోళిక రాజకీయాల కారణంగా రక్షణ పరంగా విదేశాలపై ఆధారపడడం సరైన ఎంపిక కాదని స్పష్టమవుతోంది. స్వావలంబన అనేది మన ఆర్థిక వ్యవస్థకు, భద్రతకు అత్యవసరం. 2014లో మన రక్షణ రంగం ఎగుమతుల విలువ రూ.700 కోట్లు. ఇప్పుడది రూ.24వేల కోట్లకు చేరింది. ఈ గణాంకాలు చూస్తుంటే భారత్ ఒక కొనుగోలుదారుగానే మిగలకుండా ఎగుమతిదారుగా మారుతుందని వెల్లడవుతోంది. ఇక మన బలగాలు స్వదేశీ పరికరాలతో లక్ష్యాలపై కచ్చితత్వంతో చేసిన దాడులు దూరదృష్టి, సమన్వయానికి నిదర్శనం. అలాంటి సన్నద్ధత లేకపోతే ఏ మిషన్ విజయవంతం కాదు అని మంత్రి పేర్కొన్నారు. భారత్‌ను మిత్ర దేశం అంటూనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై సుంకాల మోత మోగించారు. రష్యా నుంచి ముడిచమురు కొంటున్న భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు గతంలో విధించిన 25 శాతానికి అదనంగా మరో 25 శాతం సుంకాలు విధించారు. అవి ప్రస్తుతం అమలవుతున్నాయి. ఈ తరుణంలోనే ఏడేళ్ల తర్వాత తొలిసారి ప్రధాని మోడీ చైనా పర్యటనకు వెళుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

# సంక్షిప్తంగా..

## ఉక్రెయిన్ పార్లమెంట్ మాజీ స్పీకర్ ఆండ్రీ పరుబీ దారుణ హత్య



**కీవ్, ఆగస్టు 30:** ఉక్రెయిన్, రష్యా మధ్య యుద్ధం ఆపేందుకు ఓవైపు చర్చలు జరుగుతున్నా రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మాత్రం రోజు రోజుకూ మరింత తీవ్రమవుతున్నాయి. గత రెండురోజులుగా మాస్కో, కీవ్‌పై భారీ దాడు లకు పాల్పడుతోంది. ఈ క్రమంలో ఉక్రెయిన్ పార్లమెంట్ మాజీ స్పీకర్ ఆండ్రీ పరుబీ దారుణ హత్యకు గురైనట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ వెల్లడించారు. లివివ్ ప్రాంతంలో ఆండ్రీ పరుబీని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి నట్లు తెలిపారు. నిందితుల కోసం అధికారులు తీవ్ర గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారన్నారు. నిందితుడికి కఠిన శిక్ష విధిస్తామన్నారు. మరోవైపు డొనెట్స్క్ ప్రాంతంలోని ఓ గ్రామాన్ని తమ దళాలు అధీనంలోకి తీసుకున్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఉక్రెయిన్ క్షిపణి, విమానయాన సంస్థలతో పాటు, సైనిక, వైమానిక స్థావరాలపై కచ్చితమైన దాడులు చేస్తున్నట్లు పేర్కొంది. కాగా రాత్రి రష్యా జరిపిన సముద్ర డ్రోన్‌దాడిలో 17 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు పేర్కొన్నారు.

## భారత్ మిసైల్ దాడులతో సీజ్‌ఫైర్‌కు దిగొచ్చిన పాకిస్థాన్: నర్మదేశ్వర్



**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించిన ఎయిర్ స్టాఫ్ వైస్ చీఫ్ ఎయిర్ మార్షల్ నర్మదేశ్వర్ తివారీ. ఆపరేషన్ సిందూర్‌తో భారత బలగాలు అత్యంత కచ్చితత్వంతో పాక్ ఆక్రమిత కశ్మీర్, పాకిస్థాన్‌లోని లక్ష్యాలను ఛేధించాయి. దీంతో దాయాది కాళ్లబేరానికి వచ్చింది. అందుకోసం వైమానికదళం 50 కంటే తక్కువ ఆయుధాలనే ప్రయోగించిందని ఆయన వెల్లడించారు. 'యుద్ధాన్ని ప్రారంభించడం సులభమే. ముగించడం అంత సులువైన పనికాదు. దానిని దృష్టిలో పెట్టుకుని మన బలగాలను సంసిద్ధంగా ఉంచాం. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేలా మోహరింపులు చేపట్టాం' అని ఆయన వెల్లడించారు. నియంత్రణరేఖ వెంట నాలుగు రోజులపాటు ఖచ్చితమైన లక్ష్యాల తో చేసిన మిసైల్‌దాడులతో మే 10నపాకిస్థాన్ సీజ్‌ఫైర్‌కు దిగొచ్చిందని పేర్కొన్నారు.

## తొక్కిసలాట బాధితులకు రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సాయం



**బెంగళూరు, ఆగస్టు 30:** ఐపీఎల్ 2025 టైటిల్ గెలిచిన సంబరాల్లో జరిగిన ఘోర విషాదంపై దాదాపు మూడు నెలల మౌనం తర్వాత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) యాజమాన్యం ఎట్టకేలకు స్పందించింది. తీవ్ర విమర్శల నేపథ్యంలో తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన 11 మంది అభిమానుల కుటుంబాలకు అండగా నిలుస్తున్నట్లు ప్రకటించింది. ఒక్కో కుటుంబానికి రూ. 25 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు శనివారం అధికారికంగా వెల్లడించింది. 'ఆర్సీబీ కేర్స్' అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు సోషల్ మీడియాలో ఒక పోస్ట్ ద్వారా తెలిపింది. జూన్ 4న మా హృదయాలు ముక్కలయ్యాయి. మా ఆర్సీబీ కుటుంబంలోని 11 మంది సభ్యులను కోల్పోయాం. వారి లేని లోటును ఏ సాయమూ పూడ్చలేదు. కానీ ఒక తొలిఅడుగుగా, వారి కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున అందిస్తున్నాం. ఇది కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదు. కరుణ, ఐక్యత, నిరంతర సంరక్షణకు ఇదొక వాగ్దానమని ఆర్సీబీ యాజమాన్యం పేర్కొంది.

# రూ.500లకు కక్కుర్తిపడ్డ కానిస్టేబుల్, లాయర్

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** ఉత్తరప్రదేశ్‌లోని ఝూన్సీలో షాకింగ్ ఘటన వెలుగు చూసింది. నేరస్తులకు ఎస్కార్టుగా వుండే ఓ కానిస్టేబు ల్, మరో మహిళా లాయర్ కేవలం 500 రూపాయలకు కక్కుర్తి పడి ఓ నేరగాడికి ఫోన్ ఇవ్వగా, అతను ఈ ఫోన్‌తో ఏకంగా ఓ బడా వ్యాపారికి ఫోన్ చేసి తనకు వెంటనే కోటి రూపాయలు డబ్బులు కావాలని, లేకుంటే చంపేస్తానని బెదిరించాడు.

తనకు వచ్చిన బెదిరింపు కాల్‌ను వీరేంద్ర రాజ్‌పుత్ అనే వ్యాపారి రికార్డు చేసి దీనిని జిల్లా పోలీసు అధికారులకు ఇచ్చి దీనిపై చర్యలు తీసుకోవాలని కోరడంతో పాటు సోషల్ మీడియాలో వైరల్ అయ్యేలా చూశాడు. దీంతో ఈ ఘటన యుపి వ్యాప్తంగా సంచలనం రేపింది.

31-8pg4.qxd:31-8pg4.qxd 1/1/02 7:04 AM Page 1



ఈ యేడు ప్రకృతి వైపరీత్యం కారణంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో లక్షలాది ఎకరాల పంట నీట మునిగి రైతులకు తీరని నష్టం వాటిల్లింది. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కురిసిన అకాల వర్షాల కారణంగా వివిధ రకాల చేతికి వచ్చిన పంటలు నీటి పాలుకాగా, తాజాగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పెద్ద మొత్తంలో పంటలకు నష్టం వాటిల్లింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఈ భారీ వర్షాల కారణంగా పలు జిల్లాల్లో వ్యవసాయ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా వరి, పత్తి, మొక్కజొన్న, అరటి, మిర్చి వంటి పంటలకు నష్టం వాటిల్లింది. నీరు నిలిచిపోవడం, వరదలతో పంటలు కొట్టుకుపోవడం, పొలాల్లో ఇసుక మేటలు వేయడం వంటి కారణాలతో రైతులు అపార నష్టాన్ని ఎదుర్కొంటున్నారు.



రెండు రాష్ట్రాల్లో గత నాలుగు రోజులుగా అత్యంత భారీ వర్షాలు పడ్డాయి. భారీ వర్షాలతో రెండు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో చెరువులు, కుంటలు పొంగిపొర్లాయి. కొన్నిచోట్ల కట్టలు తెగిపోయి. దీంతో చెరువులు, వాగులు, వంకలు పొంగిఊరిమీద, పొలాల మీద, చేపల చెరువుల మీద పడ్డాయి. ఎక్కడికక్కడ వరదనీటిలో పంటలు కొట్టుకుపోయాయి. పలుచోట్ల పంటపొలాల్లో ఇసుక మేటలు వేశాయి. దీంతో వేలాది మంది రైతులకు తీరని నష్టం మిగిలింది. పొలాల్లోనే నీళ్ల నిలవడంతో పంటలు మురిగిపోయే పరిస్థితి ఏర్పడింది. దెబ్బతిన్నపంటలో ప్రధానంగా వరి, పత్తి, కూరగాయల తోటలు అత్యధికంగా ఉన్నాయి. పత్తిపూత దశలో ఉండటం, వరినాట్లు పూర్తయిన నేపథ్యంలో వర్షాలు, వరదల ప్రభావం వీటిపైతీవ్రంగా చూపించాయి. పత్తి కాత దశలో ఉండగా, పెసర చేన్లు చాలావరకూ చివరి దశలో ఉన్నాయి.

# పంటలు వరదపాలు

**సిహెచ్ వి వి రఘుబాబు**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో వర్ష బీభత్సం అన్నదాతకు అపారనష్టాన్ని మిగిల్చింది. ఈ సంవత్సరం వర్షాకాలం సీజన్ ప్రారంభమైన నాటి నుంచి నాలుగు దఫాలుగా వర్షాల కారణంగా పంటలు నీట మునగగా, రైతులకు తీరని నష్టం వాటిల్లింది. తెలంగాణలో వరదల నేపథ్యంలో వివిధ జిల్లాల్లో 12 మంది మృత్యువాతపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4.10 లక్షల ఎకరాల్లోని పంటలకు నష్టం జరిగినట్టు తెలుస్తున్నది. దీంతో వేలాది మంది రైతులకు తీరని నష్టంమిగిలింది. ఇందులో 1.80 లక్షల ఎకరాల్లోని పత్తిచేలు నీట మునిగాయి. అలాగే మరో 1.30 లక్షల ఎకరాల్లో వరిచేలు వరద ముంపునకు గురైంది. రాష్ట్రంలోని మెదక్, సంగారెడ్డి, నల్లగొండ, కొత్తగూడెం, జనగాం, మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట్, ములుగు, ఖమ్మం, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, హన్మకొండ తదితరజిల్లాల్లో అత్యధికంగా పంటలు నీట మునిగాయి. ఒక్క ఖమ్మం జిల్లాలోనే 5 లక్షలకు పైగా ఎకరాల్లో పంట నీట మునిగినట్లు అంచనా వేస్తున్నారు. భారీ వరదలు ప్రవహించడంతో పొలాల్లో ఇసుక మేటలు వేసింది. పొలాల్లోనే నీళ్ల నిలవడంతో పంటలు మురిగిపోయే పరిస్థితి ఏర్పడింది. కామారెడ్డి, నిర్మల్, సిద్దిపేట జిల్లాల్లో ఎక్కువ మొత్తంలో పంటలు నామారూపాల్లేకుండా పోయాయి. ఎక్కడ చూసినా పంటపొలాల్లో నీళ్లు, ఇసుక దిబ్బలే కనిపిస్తున్నాయి. భారీ వరదలకు చాలాచోట్ల పంట కొట్టుకుపోయింది. వర్షాలతో పూతకొచ్చిన పత్తి పాడైపోతున్నది. మిగిలిన పంట చేలల్లో రోజుల తరబడి వర్షపు నీరు నిలిచి, పత్తి ఎర్రబారి దిగుబడి తగ్గుతుంది. వర్షాలు మరికొన్ని రోజులు వస్తే పంటపై గులాబీ పురుగు సోకే ప్రమాదం ఉంది. ఓవైపు వర్షాలు, మరోవైపు గులాబీ పురుగుతో పత్తి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నిర్మల్‌జిల్లాలోని ముజ్గి, తాంశ, చిట్యాల్ మంజులాపూర్ శివారులో దాదాపు 100 ఎకరాల వరకు వరిపంట నీట మునిగింది. అలాగేసోన్ మండలం కడ్తాల్‌లో స్వర్ణ వాగు ఉప్పొంగడంతో పొలాల్లోకి భారీగా వరద నీరు చేరుకున్నది. కుంటాల మండలంలోని వెంకూర్ శివారులో పత్తి, సోయా పంటలు పూర్తిగా నీట మునిగాయి. జిల్లాలో చాలాచోట్ల వరితో పాటు, పత్తి, సోయా, మక్క పంటలు నీట మునిగాయి. ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో వరద నీటితో వందలాది ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. భూపాలపల్లి జిల్లాలోని మోరంచవాగు పరీవాహక ప్రాంత పంట పొలాలన్నీ వరదనీటిలోనే మునిగాయి. పలిమెల మండలం లెంకలగడ్డలో వేసిన ఎకరం మిరపనారు కొట్టుకుపోయింది. ఖమ్మం జిల్లాలోని పెద్ద చెరువు కింద



పంట పొలాలన్నీ పూర్తిగా నీటమునిగాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో 15,686ఎకరాల్లో పంటల నష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. సంగారెడ్డి జిల్లాలో 2,000 ఎకరాలు, మెదక్‌లో 6,341 ఎకరాలు, సిద్దిపేటలో 7,345 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. చిన్నశంకరంపేట శివారులో పంట పొలాలు పూర్తిగా నీట ముగినిగాయి. నిజాంసాగర్ దిగువ అనేక గ్రామాల్లో పంటలు నీటమునిగాయి. నందిగామలోని పౌల్ట్రీ ఫాంలో 10వేల కోళ్లు మృత్యువాతపడ్డాయి. మంచిర్యాల జిల్లాలో నాట్ల దశలో ఉన్న వరి వరదల్లో కొట్టుకు పోగా, ఏపుగా పెరుగుతున్న పత్తిపంట పూర్తిగా నీట మునిగింది. వికారాబాద్ జిల్లాలో 7,781 మంది రైతులకు చెందిన 13,126 ఎకరాల్లో పంటలు వరదపాలయ్యాయి. భీమిని, తాండూరు, మందమర్రి, నెన్నెల, వేమనపల్లి, కన్నెపల్లి, కోటపల్లి, బెల్లంపల్లి, లక్షెట్టిపేట, కాసిపేట, హాజీపూర్, చెన్నూరు, జైపూరు, జన్నారం మండలాల్లో 3,215 మంది రైతులకు చెందిన 4,964 ఎకరాల వరి పంట నీటమునగగా, 4,538 మంది రైతులకు చెందిన 8,107 ఎకరాల పత్తి చేలలో నీరు నిలిచింది. అలాగే 13 మంది రైతులకు చెందిన 35 ఎకరాల మిర్చి, 15 మందికి చెందిన 20 ఎకరాల కూరగాయల సాగు సైతం వర్షార్పణం అయింది. వర్షాల కారణంగా వరికి ఎకరాకు రూ.10వేల చొప్పున రూ.4,96,40,000 నష్టం వాటిల్లగా, పత్తి పంటకు ఎకరాకు రూ.15వేల చొప్పున మొత్తం రూ.12 కోట్ల 16లక్షల 5వేలవరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ఒక్క పాత మంచిర్యాలలోనే సుమారు 100ఎకరాలకుపైగా పత్తి పంట నీట మునిగింది. అయితే ప్రభుత్వం అధికారికంగా వెల్లడించిన వివరాల ప్రకారం తెలంగాణలో 2.20 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. కామారెడ్డిలో 77 వేల ఎకరాలు నష్టపోయినట్లు గుర్తించారు. ఆగస్టు నెలలో కురిసిన భారీవర్షాలు రాష్ట్రవ్యాప్తంగా పంటలకు తీవ్ర నష్టం కలిగించాయని తెలిపింది. మొత్తం 28 జిల్లాల్లో 2.20లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా 1.43,304 మంది రైతులు నష్టపోయా అత్యధికంగా కామారెడ్డి, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో పంటల నష్టం ఎక్కువగా నమోదైంది. కామారెడ్డి జిల్లాలోనే 77,394 ఎకరాల పంటలు దెబ్బతిన్నాయి. మెదక్ జిల్లాలో 23,169 ఎకరాలు, ఆదిలాబాద్‌లో 21,276 ఎకరాలు, నిజామాబాద్‌లో 18,417 ఎకరాలు, ఆసిఫాబాద్ జిల్లాలో 15,317ఎకరాల్లో పంటలు నష్టపోయాయి. ఆ తర్వాత అత్యధికంగా నష్టపోయిన జిల్లాల్లో మంచిర్యాల, ఖమ్మం, నిర్మల్, సూర్యాపేట, సిద్దిపేట సంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, గద్వాల, పెద్దపల్లి, వనపర్తి, భూపాలపల్లి, మహబూబ్‌నగర్, ములుగు, సిరిసిల్లా, నాగర్‌కర్నూల్, నల్గొండ, జగిత్యాల రంగారెడ్డి, కరీంనగర్, మేడ్చల్, జనగాం, యాదాద్రి భువనగిరి జిల్లాలు ఉన్నాయి. పంట పొలాల్లో ఇసుక మేట వేసింది. జిల్లాల వారీగా చూస్తే వరి పంట అత్యధికంగా దెబ్బతింది. మొత్తం 1.09లక్షల ఎకరాలు వరి నీటమునిగింది. పత్తి 60వేల ఎకరాలు నష్టం చవిచూసింది. మొక్కజొన్న 16వేల ఎకరాలు, వేరుశనగ 20వేల 900 ఎకరాల్లో దెబ్బతింది. సోయాబీన్, టమాట, మిర్చి, మినుములు, ఇతర పంటలు కూడా గణనీయంగా దెబ్బతిన్నాయి. పంట నష్టానికి సంబంధించిన ప్రాథమిక నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపనుంది. కేంద్ర సాయంతో పాటు, రాష్ట్రప్రభుత్వం కూడా కొంత కలిపి రైతులకు సాయం చేయాలన్న ఉద్దేశ్యంతో ఉంది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి, విశాఖపట్నం, గుంటూరు, కృష్ణా తదితర జిల్లాలను వర్షాలు వణికించాయి. వాగులు, వంకలు పోటెత్తుతున్నాయి. ప్రమాదకర ప్రవాహాలకు అనేకగ్రామాల మధ్యరాకపోకలు స్తంభించాయి. పంటలు నీటమునగడంతో రైతులు లబోదిబోమంటున్నారు. గుంటూరు, విజయవాడ నగరాల్లోని ప్రధాన రహదారులపై 2 అడుగులకుపైగా నీరు ప్రవహించింది. భారీవర్షాల దృష్ట్యాపల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మునిగిన లోతట్టు ప్రాంతాలు వర్షాలకు ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. 3వంతెనల మార్గం, కంకరగుంట, ఆర్‌యూబీ వంతెన మార్గాల్లో నీరు నిలిచి ట్రాఫిక్ స్తంభించింది. శంకర విలాస్‌వంతెన కూల్చివేత వల్లరాకపోకలు లేక జనం అవస్థలు పడ్డారు. నగరంలోని అనేక లోతట్టు ప్రాంతాలు, శివారు కాలనీలను వరద ముంచెత్తింది. ఏటీఅగ్రహారం, చుట్టుగుంట, శ్రీరామ్‌నగర్, హనుమాన్ నగర్ కాలనీ వాసులు ముంపులో చిక్కుకున్నారు. వ్యవసాయ కమిషనర్ కార్యాలయం, రైతుబజార్‌లోకి నాలుగు అడుగుల మేర నీరుచేరింది. ఇక జిల్లాలోని తుళ్లూరు మండలం పెదపరిమివద్ద కోటేళ్లవాగు పొంగి పెదపరిమి తుళ్లూరు మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పాలడుగులో పొలాలు తటాకాలను తలపిస్తున్నాయి. నల్లపాడులో రైతుల రెక్కలకష్టం నీటిముని గింది. దుగ్గిరాల, తెనాలి, కొల్లిపర మండలాల్లో పొలాల్లోకి వరదచేరింది. పొన్నూరు నియోజకవర్గంలోనూ వర్షం వణికించింది. వర్షాలకు యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని, పంట నష్టం నివేదికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించా రు. బాపట్లజిల్లాలోనూ విస్తారంగా వర్షాలు కురిశాయి. భట్టి ప్రోలు, కొల్లూరు, వేమూరు మండలాల్లో పొలాలు చెరువులుగా మారాయి. కొమ్మమూరు కాల్వకు

---

పశ్చిమ బెంగాల్

ఎన్నికలొస్తున్నాయనుకునేసరికి ఏ పార్టీకైనా గుర్తుకు వచ్చేది ఓటరే. ఎంత రాజకీయమైనా ఆ ఓటరు చుట్టూనే తిరుగుతూంటుంది. ఓటు, ఓటరు అనే రెండు మాటలే వేద మంత్రంలా వినిపిస్తూంటాయి. బీహార్‌లో దృశ్యం చూస్తే అన్ని రాజకీయ పార్టీలు ఎలా ఓటు చుట్టూ తిరుగుతున్నాయో బాగా అర్థమవుతుంది. కాంగ్రెస్ అగ్రనేత అయిన రాహుల్ గాంధీఓటరు అధికార యాత్ర నిర్వహిస్తూ అధికార ఎన్డీయే గుండెల్లో గుబులు పుట్టిస్తుంటే, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా అదే రాగం అందుకొని తాము కూడా ఓటరు చైతన్య యాత్రలు నిర్వహిస్తామంటూ ప్రకటించడం ఇప్పుడు సంచలనాత్మకంగా మారింది. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు మరో రెండు నెలల్లో జరుగబోతుండగా, బెంగాల్‌లో వచ్చే సంవత్సరం మధ్యలో జరుగనున్నాయి. ఇంకా తగినంత వ్యవధిఉన్నా, గతవారం సిఇసి తీసుకొన్న ఓ చర్య ఆమె తక్షణమే ఆందోళన ప్రకటించేట్లు చేసిందనిపిస్తుంది. అందుకే ఓటర్లలో 'చైతన్యం' కోసం మమత ఇప్పటినుంచే నడుం బిగించినట్లు కనిపిస్తుంది. బీహార్‌కు, బెంగాల్‌కు మధ్య తేడాలు చాలానే ఉన్నాయి. అక్కడ బిజెపిపై విపక్ష కాంగ్రెస్ తిరగబడుతోంది. ఇక్కడ బిజెపిపై అధికార తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) సమరశంఖం పూరిస్తోంది. అందువల్ల యుద్ధం ఒకేలా కనిపించినా, విధానాల్లో వ్యత్యాసం ఉంటుంది. అక్కడ సిఎం నితీశ్‌కుమార్ నాయకత్వంలోని జెడి(యు)నే గాక ఎన్డీయే కూటమిని అధికారం నుంచి తొలగించి ఈసారి ఎలాగైనా కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడానికి రాహుల్ ముమ్మరంగానే ప్రయత్నిస్తున్నారు. బెంగాల్‌లో బిజెపి అధికారంలో లేదు కనుక, ప్రధాన విపక్షంగా ఉన్న ఆ పార్టీ ముందుకు రాకుండా కళ్లెం వేయడానికి అధికార టిఎంసితరఫున సాక్షాత్తు మమతే బరిలోకి దిగు తున్నారు. 'అవాస్తవిక ఓటర్ల'ను జాబితాలనుంచి తొలగించడానికి 500 టీమ్‌లను రాష్ట్రానికిసిఇసి పంపిస్తున్నదని తెలియగానే బిజెపి కుట్రను ఎదుర్కొనడానికి ఆమె ఈ వ్యూహం రూపొందిం చినట్లు కనబడుతోంది. బీహార్‌లో రాహుల్ నిర్వ హిస్తున్న ఓటరు అధికార యాత్ర ప్రభావం గణ నీయంగానే

# మరో 'వంగ' సమరం!

**ఎ.వి.వి ప్రసాద్**

కనిపిస్తుండడంతో మమత కూడా అదే తరహా యాత్ర జరుపనున్నారనే విషయం దీనితో స్పష్టమవుతోంది. టిఎంసి విద్యార్థి విభాగం 'తృణమూల్ ఛాత్ర పరిషత్' స్థాపక దినోత్సవం సందర్భంగా గత గురువారం (28,ఆగస్టు) ఆమె ఈ ప్రకటన చేస్తూ బిజెపి కుట్రలు తమ రాష్ట్రంలో సాగనివ్వబో మంటూ ప్రతిజ్ఞ కూడా చేశారు. నిజానికి బీహార్ లో మాదిరే పశ్చిమ బెం గాల్ లోను 'అక్రమ ఓట ర్లు' అధికంగానే ఉన్నారనే ఆరోపణలున్నాయి. రోహింగ్యాలు, అఫ్గాన్, బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన వారు బెంగాల్‌లో అక్రమ ఓటర్లుగా చెలామణి అవుతున్నారని ఇసి గతంలోనే చెప్పింది. అందుకే బీహార్ తరహాలో ఇక్కడ కూడా 'సర్' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) నిర్వహించాలని ఇసి నిర్ణయించింది.



మమతా బెనర్జీ

బీహార్‌లో 'సర్'ద్వారా దాదాపు 65లక్షల అక్రమ ఓటర్లను తొలగించినట్లు ఇసి ప్రకటించగానే బెంగాల్ ముఖ్యమంత్రిలో ఆందోళన మొదలైంది. బీహార్ ఓటర్ల తొలగింపు వివాదం సుప్రీం కోర్టు దాకా వెళ్లడం, తొలగించిన ఓటర్ల జాబితాను ఇసి ప్రకటించడం జరిగాయి. ఆ వివాదం ఇంకా రగులుతూనే ఉంది.'బల ప్రయోగంతో మాత్రమే ఎవరూ విజయం సాధించలేరు. మీ సీక్రెట్లను మేమూ బహిర్గతం చేస్తా'మంటూ మమత గత వారం సమావేశంలో ఓ సవాల్ కూడా విసిరారు. 'ప్రజల ఆశీస్సులతో మేం అధికారం లోకి వచ్చాం, కుట్రలు చేసి కాదు' అంటూ నిశితంగానే విమర్శించారు. 'బిజెపికి లాలీపాప్ లామారితే ఇసి ఉనికే ప్రశ్నార్థకమవుతుంది' అంటూఎన్నికల సంఘానికి ఓ హెచ్చరిక కూడా విసిరారు. ఇదంతా చూస్తుంటే రానున్న ఎన్నికలకు ఆమె సమర భేరి మోగించినట్లుగానే స్పష్టమవుతుంది. బీహార్‌లో 'ఓట్ల చోరీ'కి పాల్పడుతున్న బిజెపి ఆటలు బెంగాల్‌లో సాగనివ్వబోమంటూ మరో చురక వేశారు. బీహార్, బెంగాల్‌లో కనిపిస్తున్న అలజడే తమిళనాడులో కూడా దర్శనమిస్తోంది. తమ రాష్ట్రంలో కూడా ఓట్లను కొల్లగొట్టడానికి బిజెపి కుట్రలు పన్నుతున్నదనీ, ఆ పార్టీ ఆట కట్టించడానికి తమ వద్ద భారీ వ్యూహాలే ఉన్నాయనీ అక్కడి సిఎం స్టాలిన్ కూడా పది రోజుల క్రితమే ప్రకటించారు. తమిళనాట కూడా వచ్చే సంవత్సరమే ఎన్నికలు జరుగనున్నాయి. బీహార్‌లో 'సర్'ను ప్రయోగించిన సిఇసి బెంగాల్‌తో పాటు తమిళనాడుపై కూడా ఆ అస్త్రాన్ని ప్రయోగించనుండడంతో అక్కడా ఆందోళనకర పరిస్థితే నెలకొని ఉంది. సర్ నిర్వహణ కోసం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులను (ఇఆర్‌ఒ) నియమించాలంటూ రాష్ట్రఎన్నికల సంఘానికి సిఇసి గతవారమే ఆదేశాలిచ్చింది. అయితే ఇఆర్‌ఒలను రాష్ట్రసిఎస్ ఆదేశాల మేరకు నియమించవలసి ఉంటుంది. కానీ సిఎస్ సాధారణంగా ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారమే నడుచుకుంటూ ఉంటారు గనుక బెంగాల్‌లో ఈ'ఓటరు వడపోత' కార్యక్రమం ఏ మేరకు ప్రశాంతంగా సాగుతుందో చూడవలసి ఉంది. బీహార్‌లో ఉన్నది 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం గనుక సిఇసి ఆదేశాల మేరకు తేలికగానే 'సర్' నిర్వహించారు. కానీ బెంగాల్‌లో అధికారంలో ఉన్నది బిజెపికి వ్యతిరేకమైన టిఎంసి ప్రభుత్వం గనుక సర్ నిర్వహణ ఎలా కొనసాగుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైపెచ్చు ముఖ్యమంత్రి స్వయంగా ఓటరు చైతన్య యాత్ర ప్రకటించడంతో సిఇసి ఆదేశాలు ఎంత వరకు పూర్తిగా అమలవుతాయనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల వేళ అధికారుల బదలీలు కూడా ఎక్కువగానే జరుగుతూంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య 'సమన్వయం' ఉంటే అవన్నీ తేలికే. లేనిచోట రోజూ ఉప్పు, నిప్పులా వాతావరణం మారిపోతుంది. మమత గతవారం ప్రకటించిన 'సమరం' ఎటు తిరుగుతుందో చూడాలి.

---

అమెరికా

ఓ పక్క సుంకాలతో ప్రపంచ దేశాలను వణికిస్తున్న ట్రంప్ మరోవైపునుంచి నోబెల్ శాంతి పురస్కారం కోసం లాబీయింగ్‌ల వంటి వాటితో అత్యంత బిజీగా గడుపుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుకున్నట్లుగానే ఆయన వారసుడొచ్చేసాడు. 78 ఏళ్ల ఏడునెలల వయసులో ఉన్న ట్రంప్ మేక్ అమెరికా గ్రేట్ అగైన్ అంటే తాను ముద్దుగా పిలుచుకునే 'మాగా' సాధనకు తన వారసుడిగా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ పనిచేస్తారని ప్రకటించినట్లుగానే ఆమెరికా వైస్ ఇప్పుడు అవసరమైతే అధ్యక్షపదవి చేపడతానంటూ బహిరంగంగానే ప్రకటించేసారు. దీనికంతటికీ కారణం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యం అంతంతమాత్రంగానే ఉందని, ఆయనకు సిరల వ్యాధి ఉందని, తరచూ కరచాలనాలు చేయడంవల్లనే వచ్చిందని చెపుతున్నా వృద్ధాప్యసమస్యలు కూడా ట్రంప్‌ను చుట్టుముడుతున్నట్లు తెలుస్తోంది. అయినా ఇప్పటికీ ఆయన ఆరోగ్యంగా ఉన్నారని, శ్వేతసౌధంలో వచ్చిన సంస్కరణలు తనకు ముచ్చటేసాయని చెప్పిన యుఎస్ వైస్‌జెడివాన్స్ అత్యవసరం అయితే అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు కూడా వెనుకాడనని చెప్పడాన్ని చూస్తుంటే గ్రాండ్ ఓల్డ్ పార్టీ (జిఒపి) రిపబ్లికన్లలో ఇపుడు నాయకత్వ మార్పుపైనా చర్చలుజరుగుతున్నట్లు తెలుస్తోంది. ఒకప్పుడు ట్రంప్ అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన వాన్స్ తదనంతరం ఆయనకు వీరవిధేయుడిగా మారిపోయారు. పైగా అక్కడి ఆంగ్లమీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉన్నారని, ఆయనతో కలిసి పనిచేసేవాళ్లు ఆయనకంటే చిన్నవారేనని చెపుతూ అందరికంటే ఎక్కువ సేపుపనిచేసే ట్రంప్ అందరికంటే ముందే నిద్ర లేచి పనుల్లో నిమగ్నం అయిపోతారన్నారు. ఏదేని అనుకోని భయంకర విషాదం చోటుచేసుకుంటే అధ్యక్షపదవిలోకి వచ్చేందుకు తాను సిద్ధమేనని స్పష్టంచేసారు. అమెరికా చరిత్రలో 41 ఏళ్ల పిన్నవయసులోనే 50వ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వాన్స్‌లో ఆ నాయకత్వ లక్షణాలు కూడా పుష్కలంగానే ఉన్నాయని చెప్పవచ్చు. దీనికంతటికీ కారణం దక్షిణకొరియా అధ్యక్షుడు లీజే మ్యూంగ్‌తో చర్చలు జరిగిన సమయంలో అధ్యక్షుడు ట్రంప్ చేతికి పెద్ద గాయం

# ఇక నేనే అధ్యక్షుణ్ణి!

**గన్ని మోహన్**

కనిపించింది. దీనితో ప్రపంచ మీడియా ట్రంప్ ఆరోగ్యంపై పలు కథనాలు ప్రచురించాయి. వయోభారం కూడా మీదపడుతున్నది. రెండు మూడునెలలు ఆగితే ట్రంప్ 79ఏళ్ల వయసులోకి వచ్చేస్తారు. నిజానికి ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్ ఆస్ప్రిన్ అత్యధికంగా వినియోగించడంవల్ల ఈ గాయం ఏర్పడినట్లు శ్వేతసౌధం కూడా వివరణ ఇచ్చింది. అధ్యక్షుడు ట్రంప్ ప్రజల మనిషి అని అమెరికా చరిత్రలో ఇతర అధ్యక్షులకంటే ఎక్కువగా ఆయన ప్రతిరోజూ అమెరికన్లను, ప్రపంచదేశాధినేతలను కలుసుకుంటూ వారితోకరచాలనం చేస్తుంటారని ఆందోళన చెందాల్సిన పనిలేదంటూట్రంప్ అనారోగ్యాన్ని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ కూడా వివరణ ఇచ్చి సర్దుబాటు ప్రయత్నం చేసారు.



జెడివాన్స్


ఈ ఏడాది గత జూలైలోనే ఒక పర్యాయం ట్రంప్ కాళ్లపై కనిపించిన వాపు ఆయన ఆరోగ్యంపై అనుమానాలను మరింత పెంచింది. ఆ సమయంలోనే వైట్‌హౌస్ వైద్యుడు డాక్టర్ సీన్ బార్బెల్లా ఆయనకు 'క్రానిక్ వీనస్ ఇన్సఫిషియెన్సీ' అనే వ్యాధి ఉందని నిర్ధారించారు. 70ఏళ్లకంటే ఎక్కువ వయసున్న వారిలో సహజంగా కనిపించే ఒకవ్యాధి అని ఈవ్యాధి సిరల్లో రక్తప్రసరణ సరిగాలేకపోవడంవల్ల వస్తుందని వివరించారు. ఈ నెలారంభంలోనే ఒక ఫిజియో థెరపిస్టు మాట్లాడుతూ కంజెసివ్ హార్ట్ ఫెయిల్యూర్, క్రానిక్ కిడ్నీ డిసీజ్‌లు వంటివాటితో ట్రంప్ బాధపడుతున్నారని, కేవలం ఏడాదిలోపు ఇవి నివారించుకోవడం ఆయనకు కష్టమేనన్న నివేదిక ప్రకటించారు. రెండేళ్ల క్రితం ట్రంప్ కరోనరీ కాల్షియం స్కోరు 133గా ఉందని, దీనివల్ల ఆయనకు కరోనరీ ఆర్టరీ డిసీజ్ ముప్పు సూచిస్తుందని కార్డియాలజిస్టులు సైతం వెల్లడించారు. అయితే వైట్‌హౌస్ వైద్యులు తమ నివేదికలో ఎలాంటి గుండెజబ్బులు లేవని నిర్ధారించారు. ఈ వివరణలతో ట్రంప్ ఆరోగ్యంపై వస్తున్న కథనాలకు తాత్కాలిక తెరపడినప్పటికీ తాజాగా ఉపాధ్యక్షుడు వాన్స్ చేసిన ప్రకటనతో మళ్లీ అగ్రరాజ్యం అధ్యక్షుడి ఆరోగ్యంపై అనుమానాలు పెరిగాయి. దీనికితోడు ట్రంప్ ఇటీవలికాలంలో మీడియా ముందుకు రావడంలేదు. ఇవన్నీ కూడా ఆయన ఆరోగ్యంపై చర్చలకు మరింత ఊతం ఇచ్చాయి. ఇక రెండుసార్లు అధ్యక్షపదవిచేపట్టిన తర్వాత అమెరికాకు యువతరం బాధ్యతలు తీసుకోవాలని అక్కడి పౌరుల ప్రధానకాంక్షగా కూడా ఉంది. ఉపాధ్యక్షుడుగా 200 రోజులు పూర్తిచేసిన తన పదవీకాలం ఒక గొప్ప అనుభవం అని 'దిబెస్ట్ ఆన్‌ది జాబ్ ట్రైనింగ్' అని అభివర్ణించిన వాన్స్ ఒకవేళ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాల్సి వస్తే ఆయనకు పోటీకూడా లేకుండాపోలేదు. విదేశాంగ మంత్రి మార్కో రుబియో, మార్క్ రుట్టే వంటి వారు పోటీలో ఉన్నా ఆనాడు ఉపాధ్యక్ష పదవికి ట్రంప్ స్వయంగా వాన్స్‌పేరును ఎంపిక చేసుకుని ప్రకటించారు. దీనికితోడు వాన్స్ కూడా తనదైన శైలిలో ట్రంప్‌పాలన తీరుకు ఎక్కడా భిన్నత్వంలేకుండా కొనసాగిస్తూ వచ్చారు. భారత్ పర్యట నతోపాటు జి20, జి7 వంటి దేశాలతో నెరపిన సంబంధాలు, ఆపై ఉక్రెయిన్ యుద్ధ విరమణకు ట్రంప్‌తో కలిసి జరిపిన సంప్రదింపులు, చర్చలు వాన్స్‌లోని రాజకీయ పరిణతిని చాటిచెప్పాయి. ప్రస్తుతం ట్రంప్ ఆరోగ్యంపై జరుగుతున్నచర్చల క్రమంలో రిపబ్లికన్లు అధ్యక్షుడిని మార్చాల్సి వస్తే ఇక ఉపాధ్యక్షుడు జెడివాన్స్‌నే ఎంపికచేస్తారన్న భావన కూడా వ్యక్తం అవుతోంది. అందువల్లనే విషమపరిస్థితి వస్తే అధ్యక్షపదవి చేపట్టేందుకు తానుసిద్ధమేనని ప్రకటించడంతో వాన్స్‌కు అధ్యక్షపదవిపై బలమైన వాంఛఉన్నదని ఆయన మనోగతం చెప్పకనే చెపుతోంది. ఈపరిణామాల న్నింటి దృష్ట్యా భవిష్యత్తు అమెరికా అధ్యక్షుడు జేమ్స్ డేవిడ్ వాన్స్ అయినా ఆశ్చర్యపోనవసరంలేదు.

---

# ప్రగతి పథంలో పయనం - విచ్ఛిన్నకర కుట్రల పట్ల అప్రమత్తం

**యేచన్ చంద్రశేఖర్**

రెండువేల ఇరవైఐదు, రెండువేల ఇరవై ఆరు ఆర్థిక సంవత్సరానికి భారతదేశ జిడిపి 6.4 శాతానికి చేరుతుందన్న అంచనా. ప్రత్యేకించి కోవిడ్19 తరువాత కూడా ఆర్థిక ప్రగతిని కొనసాగిస్తూ తన వ్యూహాత్మక చొరవలతో నిలకడైన ఆర్థిక ప్రగతి, స్థిరమైన అభివృద్ధితో భవిష్యత్ ప్రపంచ దృశ్యాన్ని ఆవిష్కరించడంలో కీలక పాత్ర ధారిగా నిలుస్తోంది. ప్రపంచ వృద్ధికి గణనీయంగా దోహదపడుతూ 2027నాటికి ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడానికి సిద్ధంగా ఉంది. గ్లోబల్ సౌత్‌తో సంబంధాలపై వ్యూహాత్మకంగా దృష్టి సారిస్తూ ఆధునిక సాంకేతిక పురోగతులు భౌగోళిక రాజకీయ మార్పులకు అనుగుణంగా సమ్మిళిత, స్థిరమైన వృద్ధిని పెంపొందిస్తోంది. ఆర్థికాభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా సమ్మిళిత వృద్ధికి ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా మానవాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి నిరుద్యోగం వంటి సమస్యల పరిష్కారానికి అనేక చొరవలు చేపడుతోంది. స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి దేశంలోని అధిక సంఖ్యాకులు మధ్య ఆదాయ వర్గానికి చేరుకునేలా ప్రజా పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వాణిజ్య సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడంపై నిరంతరం దృష్టి సారిస్తోంది. స్వదేశీకరణకు ప్రాధాన్యం, వ్యూహాత్మక విధాన సంస్కరణలు, ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మేక్ ఇన్ ఇండియా చొరవ, పెరిగిన దేశీయ డిమాండ్, డిజిటల్ పరివర్తన వంటి అంశాలతో పాటు బలమైన ప్రభుత్వ మద్దతుతో ప్రైవేటు రంగంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజిటల్ సేవలు, తయారీ, పునరుత్పాదక ఇంధనం, ఆరోగ్య సంరక్షణ పరిశ్రమలు గత దశాబ్ద కాలంలో గణనీయమైన పురోగతిని సాధించాయి. ఎలక్ట్రానిక్స్ తయారీ (ముఖ్యంగా మొబైల్ ఫోన్లు), ఫార్మాస్యూటికల్స్, ఆర్థిక సాంకేతికత, ఇకామర్స్ ఎలక్ట్రిక్ వాహనాలు కీలకవృద్ధి రంగాలలో ఉన్నాయి. అదనంగా, 2014 నుండి ప్రైవేట్ రంగం రక్షణ, అంతరిక్షం, మౌలిక సదుపాయాలు లాజిస్టిక్స్ వంటిరంగాలలో గణనీయమైన అభివృద్ధినిసాధిస్తోంది. తమ ఉత్పత్తులు సేవల ఎగుమతుల ద్వారా అనేక కీలక రంగాలు గణనీయమైన విదేశీ మారక ద్రవ్య ఆర్జనతో జాతీయాదాయానికి దోహదపడుతున్నాయి. నైపుణ్య మానవ వనరులు, పోటీధరలు, ప్రభుత్వ మద్దతు వ్యూహాత్మక వాణిజ్య భాగస్వామ్యాలు వంటి అంశాల ద్వారా ఇది సాధ్యమవుతోంది. మేక్ ఇన్ ఇండియా ప్రోడక్ట్ లింక్డ్ ఇన్సెంటివ్ వంటి పథకాలతో 2024 ఆర్థిక సంవత్సరంలో ఇంజినీరింగ్ వస్తువుల (యంత్రాలు, ఆటోమోటివ్ భాగాలు, మరియు లోహంతో సహా విస్తృత శ్రేణి ఉత్పత్తులు) ఎగుమతి 109.32 బిలియన్ అమెరికా డాలర్లతో స్థిరంగా భారతదేశపు అగ్ర ఎగుమతులలో ఒకటిగా ఉంది. ముడి చమురు నికర దిగుమతిదారుగా ఉన్నప్పటికీ, భారతదేశం గణనీయమైన శుద్ధి సామర్థ్యంతో డీజిల్, గ్యాసోలిన్ విమాన ఇంధనం వంటి శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తులను నెదర్లాండ్స్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సింగపూర్‌లకు ఎగుమతి చేస్తుంది. బంగారం, వెండి ఆభరణాల తయారీలో రాణిస్తున్న భారతదేశం వజ్రాల కటింగ్, పాలిషింగ్‌లో తన నైపుణ్యంతో ప్రపంచ కేంద్రంగా బాసిల్లుతూ ప్రధానంగా అమెరికా, హాంకాంగ్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాలకు వజ్రాలు, బంగారు ఆభరణాలు ఎగుమతి చేస్తోంది. ప్రపంచ ఫార్మసీగా పేరొందిన భారతదేశం జెనరిక్ ఔషధాల అతిపెద్ద సరఫరాదారుగా మాత్రమే కాక ప్రపంచ వ్యాప్తంగా సరఫరా అయ్యే 60 శాతం వ్యాక్సిన్లను ఉత్పత్తి చేస్తుంది. అంతేకాదు, కోవిడ్19 సమయంలో 160దేశాలకు కోవిడ్ వ్యాక్సిన్లు, ఔషధాలు సరఫరా చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఔషధాల ఎగుమతుల విలువ 30 బిలియన్ అమెరికా డాలర్లను దాటింది. సాంప్రదాయ వస్తువుల ఎగుమతి కాకపోయినా, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, సమాచార



సాంకేతిక (ఐటి)కన్సల్టింగ్, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ వంటి సేవలు దేశానికి గణనీయమైన ఆదాయాన్ని ఆర్జిస్తాయి. భారతదేశ నైపుణ్య మానవ వనరులు, తక్కువ జీతభత్యాలు ఆంగ్ల భాషా ప్రావీణ్యం ఐటిఆధారిత సేవలను కోరుకునే ప్రపంచ కంపెనీలను ఆకర్షిస్తుంది. ఈ ఎగుమతుల ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో 12.48 వృద్ధి రేటుతో 224.40 బిలియన్ అమెరికా డాలర్లు ఆర్జించింది. ఆత్మనిర్భర్ భారత్ ప్రోత్సాహం నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ రక్షణ ఎగుమతులు రికార్డు స్థాయిలో రూ.23,622 కోట్లకు (సుమారు 2.76 బిలియన్ అమెరికా అమెరికా డాలర్లు) చేరుకుంది. భారతదేశ అంతరిక్ష ఆర్థికవ్యవస్థను గణనీయంగా విస్తరించాలనే లక్ష్యంలో భాగంగా ప్రైవేట్ అంతరిక్ష సంస్థలను ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం 2024-25 కేంద్ర బడ్జెట్‌లో రు.1,000 కోట్ల ప్రత్యేక వెంచర్ క్యాపిటల్ ఫండ్ ఏర్పాటు వంటి చొరవలను చేపట్టింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో, అంతరిక్ష కార్యకలాపాల కోసం భారతదేశ వాణిజ్య విభాగం, న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్, రు.3,026.09 కోట్ల ఆదాయాన్ని నివేదించింది. 202425 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం మొత్తం వస్తువులు సేవల ఎగుమతులు రికార్డు స్థాయిలో 824.90 బిలియన్ అమెరికా డాలర్లకు చేరుకున్నాయని టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వస్త్రాలు, దుస్తుల ఎగుమతుల ద్వారా 37.70 బిలియన్ అమెరికా డాలర్ల ఆదాయం చేకూరింది. జాతీయ ఖజానాకు గణనీ యంగా దోహదపడే విభిన్న శ్రేణి పరిశ్రమలు భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా ప్రపంచ వాణి జ్యంలో కూడా కీలక పాత్ర పోషిస్తోయి. క్వెస్ కార్ప్ నివేదిక ప్రకారం, 2025 నాటికి భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటె లిజెన్స్ నిపుణులు 4లక్షలు దాటారని అంచనా. ఈ సంఖ్య అమెరికా, చైనా కంటే అత్యధికం. ప్రపంచమంతా ఇంటర్నె ట్‌తో తలమునకలవుతున్న వేళ, ప్రజలు డిజిటల్ ప్రపంచం తో అనుసంధానం అయ్యేందుకు, అధికార, అనధికార వ్యక్తిగత సమాచార మార్పిడికి సంభాషించేందుకు మొబైల్ డేటా అత్యంత కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే అత్యంత చౌకగా మొబైల్ డేటా అందించే దేశంగా భారతదేశం నిలుస్తోంది. దేశవ్యాప్తంగా ప్రతి రోజు అత్యల్ప లావాదేవీల నుండి అత్యధిక లావాదేవీలు యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ) ద్వారా జరుగుతున్నాయి. మార్చి 31, 2025 నాటికి, రికార్డుస్థాయిలో రూ. 24.77 ట్రిలియన్ల విలువ గల 19.78 బిలియన్ లావాదేవీలు నమోదయ్యాయి. మార్చి 2024తో పోలిస్తే ఇది లావాదేవీల పరంగా 36 శాతం విలువ పరంగా 25 శాతం అధికం. ఉమ్మడిగా అమెరికా, చైనా యూరప్‌లలో ఇన్ని లావాదేవీలు జరగలేదు. ఈ విధానం చిన్న, చితక వీధి వ్యాపారులనుండి భారీ వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించే వారికి ఎంతో ఉపయుక్తం. పలు అంచనాల ప్రకారం జూలై2025 నాటికి, మహిళల యాజమాన్యంలోని వ్యాపారాల మొత్తం సంఖ్య 15.7మిలియన్లకు పైగా ఉంది. 2025 ప్రారంభంలో, క్రియాశీల స్టార్టప్‌లలో దాదాపు7,000 కంటే ఎక్కువ వెంచర్‌లు (7.5 శాతం) మహిళల నేతృత్వంలోనివే. భారతదేశం ఫిన్‌టెక్ రంగంలో పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చూరగొనడంతో మన ఫిన్‌టెక్ సామర్థ్యానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు లభిస్తోంది. 90 బిలియన్ అమెరికా డాలర్ల విలువైన 26 యునికార్న్‌లకు నిలయమైన భారతదేశ సెమీకండక్టర్ మార్కెట్ 13శాతం వృద్ధితో 2030 నాటికి 103 బిలియన్ అమెరికా డాలర్లకు చేరుకుంటుందని భారతదేశ ఎలక్ట్రానిక్స్ సెమీకండక్టర్ అసోసియేషన్ అంచనా. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఎఫ్‌ఎంసిజి ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతు న్న నేపథ్యంలో ఇకామర్స్ వేగంగా వృద్ధి చెందుతోంది. 2030నాటికి మార్కెట్ విలువ 325 బిలియన్ అమెరికా డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ప్రపంచ దేశాలను ఆశ్చర్యంలో ముంచెత్తుతూ అనూహ్యమైన ఆర్థిక ప్రగతితో భారతదేశం ముందుకుసాగుతున్న వేళ పలు అంతర్గత బాహ్యశక్తులు విచ్ఛిన్నకర కుట్రలతో ప్రగతికి ఆటంకం కలిగించి దేశంలో అస్థిరతను సృష్టించే కుయుక్తులకు పాల్పడుతున్నారు. ఇటువంటి సందర్భాలలో దేశ ప్రజలంతా అప్రమత్త తను ప్రదర్శించి, విచ్ఛిన్నకర శక్తుల కుట్రలను భగ్నం చేసి, సంఘటితంగా దేశ సమగ్రతను,

31-8P□g7exHMNWJQE.qxd:31-8P□g7exHMNWJQE.qxd 1/1/02 7:10 AM Page 1



# క్లాస్‌గా కనపడినా.. మాగంటి గోపీనాథ్ మాస్ లీడర్

## సభలో సంతాపం ప్రకటిస్తూ తీర్మానం ప్రవేశపట్టిన సిఎం రేవంత్‌రెడ్డి

### ఆదివారం ఉదయం 9 గంటలకు శాసనసభ వాయిదా : స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే దివంగత మాగంటి గోపీనాథ్ చూడటానికి క్లాస్‌గా కనిపించినా మాస్‌లీడర్ అని, నాకు మంచి మిత్రుడని విద్యార్థి నాయకుడిగా ప్రజాప్రతినిధిగా, నిర్మాతగా ఆయన రాణించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. అసెంబ్లీ సమావేశం తొలిరోజున శనివారం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతికి సంతాపం తెలుపుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టారు.

గోపీనాథ్ తనకు చిన్ననాటి నుంచే మిత్రుడని, సౌమ్యుడు, మితభాషి అని గుర్తుచేసు కొన్నారు. రాజకీయ విధానాలు మార్చుకున్నా తన వ్యక్తిత్వం మార్చుకోలేదని జూబ్లీహిల్స్ నుంచి మూడుసార్లు వరుసగా గెలిచి హ్యాట్రిక్ సాధించడం అంటే అంత ఆషామాషి విషయం కాదని, ఆయన విలువలతో వ్యవహరించడాని చెప్పడానికి ప్రబల నిదర్శనం అని వివరించారు. ఆయన మృతి తనను వ్యక్తిగతంగా తీవ్రంగా కలిచివేసిందని అరుదైన ఒక ప్రజా ప్రతినిధిని కోల్పోయామని గోపీనాథ్ కుటుంబానికి ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాజకీయంగా పార్టీలు వేరైనా.. వ్యక్తిగతంగా నాకు మంచి మిత్రుడని తెలిపారు. ఆయన విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుకుగా ఉన్నారని అన్నారు. గోపీనాథ్ అకాల మరణం వారి కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చిందని.. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

**అందరితో కలసిపోయే ఆయన లేనిలోటు స్పష్టంగా తెలుస్తోంది : మంత్రి శ్రీధర్‌బాబు**



మాగంటి గోపీనాథ్ నిజాయితీగా, అందరితో కలిసి మెలసిపోయే గుణం కలిగిన వ్యక్తి అని అసెంబీల్లో ఆయన లేనిలోటు స్పష్టంగా తెలుస్తోందని శాసనసభ వ్యవవ హారాల మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని ఆయన బలపరుస్తూ గోపినాథ్ అన్నగా నాకు మార్గదర్శి వ్యక్తి చనిపోవడం దిగ్భ్రాంతి కలిగిందని, మన హృదయాలను ద్రవింపచేస్తోందని ఆయన అన్నారు. తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయన తమ్ముడు రాజకుమార్ చనిపోతే అప్పుడు వారి కుటుంబం సంవత్సరాలు ఆ విషాదం నుంచి కోలుకోలేదని ఆయనకు ఇద్దరు అన్నలు ఉన్నారని కుటుంబ నేపథ్యం సభకు వివరించారు. హైదరాబాద్‌లో 1963లో పుట్టిన గోపినాథ్ ఇక్కడే తన చదువులు పూర్తిచేసుకొన్నారు.

**గోపన్నగా ప్రజలకు అనురాగం పంచారు: ఎమ్మెల్యే కెటిఆర్**



బతుకమ్మ చీరెలు తెలంగాణ ప్రభుత్వం 2016లో పంపిణీ చేయడం మొదలు పెడితే, మాగంటి గోపీనాథ్ మాత్రం అంతకుముందే తన నియోజకవర్గం పరిధిలోని వారికి బతుకమ్మ సందర్భంగా చీరెలు పంపిణీచేశారని ఎమ్మెల్యే తారక రామారావు గుర్తుచేశారు. ఈ సభలో సోదరుడు, సహచరుడు, హైదరాబాద్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గోపీనాథ్ సంతాప తీర్మానం ప్రవేశపెట్టాల్సి వస్తదని కలలో కూడా అనుకోలేదు. జీవించి ఉన్నంత కాలం ఆయన అనారోగ్యం గురించి చెప్పుకోలేదు. పబ్లిక్ పరంగా చాలా యాక్టివ్‌గా ఉండేవారు. హైదరాబాద్ నగరంలో జూబ్లీహిల్స్ అంటేనే సంపన్నులు నివసించే ప్రాంతం అని పేరు. కానీ అక్కడ ఉండేది మొత్తం పేద ప్రజలు. బస్తీలతో కూడిన ఏరియా. అలాంటి ఏరియాను మాగంటి గోపీనాథ్ ఎంతో అభివృద్ధి చేశారని కెటిఆర్ కొనియాడారు. హైదరాబాద్‌లోని హైదర్ గూడలో జన్మించిన గోపీనాథ్ కటౌట్ సంస్కృతికి పునాది వేశారని గుర్తుచేసుకొన్నారు. ఎన్టీఆర్‌కు వీరాభిమానికిగా టిడిపి అడుగుపెట్టారు. హ్యాట్రిక్ కొట్టడం ఎమ్మెల్యేలకు అంత సులువు కాదు. అది గోపీనాథ్‌కు సాధ్యమైంది. మాదాపూర్ ఏరియాలో చాలా చిన్న ఇంట్లో గోపీనాథ్ నివాసం ఉన్నారు. బతికినంత కాలం మాస్ లీడర్‌గా డైనమిక్‌గా ఉన్నారు. స్పందించే గుణం ఎక్కువ. కేసీఆర్‌కు నమ్మిన విధేయుడిగా పని చేశారు. ఆయన మరణం పార్టీకి, జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి తీరని లోటు. గోపీనాథ్ కుటుంబానికి మా పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుంది అని కేటీఆర్ స్పష్టం చేశారు.

**క్రమశిక్షణగల నేత మాగంటి : సభలో ప్రజాప్రతినిధుల నివాళులు**

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గోపినాథ్ మృతిచెందడం దురదృష్టం అని అన్నారు. జూబ్లిహిల్స్ ప్రజలను ఆయన ఆశించిన రీతిలో అభివృద్ధి పరిచేబాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకొంటారని తెలిపారు. బిసివెల్ఫ్‌ర్ మంత్రి హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజలమనిషి మాగంటి అని కొనియాడారు. తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ పేద ప్రజలను ప్రేమించే నాయకుడు ఆయన విషయాలు ఎప్పుడు బయటకు చెప్పుకోలేదు గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన మంచి వ్యక్తి అని అన్నారు. ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్వర్లు, గోపాల్ మాట్లాడుతూ గోపినాథ్ వివాదరహితుడని అభివర్ణించారు. బిజెపి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ప్రజలు గుర్తుంచుకొనే పనులు చేయాలని ఆయన మనందరికి మార్గనిర్దేశం చేశారని అని కొనియాడారు. ఎంఐఎం ఎమ్మెల్యే, సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సున్ని తంగా మర్యాదగా వ్యవహరించే వ్యక్తి అని అన్నారు. సిపిఐ తరుపున ఆయన కుటుంబానికి సంతాపం తెలుపుతున్నానని చెప్పారు.

**అరుదైన నేత మాగంటి : స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్**

అరుదైన నాయకుడు మగంటి గోపీనాథ్ మృతికి సంతాప తీర్మానం చేస్తూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఆ తర్వాత సభను ఆదివారం(మార్చి 31) ఉదయం 9 గంటలకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

## గత ప్రభుత్వంలో లేని పిపిటి సంప్రదాయం ఇప్పుడెందుకు?: డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** ప్రతిపక్షాలకు అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ఇచ్చే సంప్రదాయంలేదని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. భారత రాష్ట్ర సమితి హయాంలో తాము పిపిటి అవకాశం ఇవ్వాలని లేఖ ఇచ్చినట్లు గుర్తుచేశారు. అప్పుడు తమకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. అప్పడు లేని సంప్రదాయం ఇప్పుడు ఎలా ఉంటుందన్నారు. ప్రభుత్వం రూ.6,500 కోట్ల వడ్డీ కట్టట్లేదనే భారత రాష్ట్ర సమితి వాదన సరికాదని పేర్కొన్నారు. మరి వడ్డీలు ఆ పార్టీ నేతలు కడుతున్నారా అని ప్రశ్నించారు. మరోవైపు శాసనసభలో కాళేశ్వరంపై పిపిటికి అవకాశం ఇవ్వాలని భారత రాష్ట్ర సమితి నేతలు డిమాండ్ చేస్తున్నారు.

## సిర్పూర్‌కాగజ్‌నగర్, మంచిర్యాల స్టేషన్‌లలో వందేభారత్ హాల్ట్

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** సికిందరాబాద్-నాగపూర్ మధ్య నడుస్తున్న వందేభారత్ రైలుకు రెండు హాల్టింగ్‌లు ఇచ్చినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రధాన స్టేషన్‌లు సిర్పూర్ కాగజ్ నగర్, మంచిర్యాల స్టేషన్లలో హాల్టింగ్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను రైల్వేశాఖ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి ఈ రెండు స్టేషన్లలో హాల్టింగ్ ఏర్పాటు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో రైల్వే మౌలిక వసతులకు నిరంతరం సహాయ సహకా రాలు అందిస్తున్న ప్రధాని ప్రధాని మోడీ రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు తెలంగాణ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు.

## పదవీ విరమణ చేసిన అదనపు కార్యదర్శులు

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** రాష్ట్ర సచివాలయంలో పలువురు అధికారులు, సిబ్బంది శనివారం పదవి విరమణ చేశారు. సాధారణ పరిపాలన విభాగంలో పని చేస్తున్న అదనపు కార్యదర్శులు బండి యాదగిరి, నిర్మల, అరుణ్ కుమార్, ఏఎస్ఓ అశోక్ కుమార్, జమేదార్ అబ్దుల్లా పదవీ విరమణ సందర్భంగా శనివారం నాడు జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, సంయుక్త కార్యదర్శి శివ లింగయ్య(ప్రోటోకాల్) వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిఏడి కార్యదర్శి రఘునందన్ రావు మాట్లాడుతూ, పదవీ విరమణ చేసిన అధికారులు అంకితభావంతో పని చేశారని వారిని ప్రశంసించారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలిచి, అత్యున్నత సేవలు అందించారని అన్నారు. సచివాలయ అధికారులు, సిబ్బంది కూడా వారిని ఆదర్శంగా తీసుకొని అంకితభావంతో పనిచేయాలని, సేవా దృష్టితో విధులు నిర్వహించాలని అన్నారు.

## ఎస్టీలుగా లంబాడా, బంజారాలు రాజ్యాంగ విరుద్ధం

### సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** బంజారా, లంబాడా, సుగాలీలను ఎస్టీలుగా గుర్తించడం రాజ్యాంగ విరుద్ధమని, వారిని ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సుప్రీం కోర్టులో తెలంగాణకు చెందిన ప్రజాప్రతినిధుల నుండి పిటిషన్ దాఖలైంది. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎంపీ సోయం బాపూరావుతోపాటు మరికొందరి తరపున సీనియర్ న్యాయవాది అల్లంకి రమేశ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఎస్సీ, ఎస్టీ ఉత్తర్వుల సవరణ చట్టం 1976 మేరకు ఆ మూడు వర్గాలను ఎస్టీలుగా గుర్తించడం ఆర్టికల్ 342ని ఉల్లంఘించడమేనని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. బంజారా, లంబాడాలు, సుగాలీలు గిరిజనులు కాదని, 1976 వరకు పాత ఆంధ్ర ప్రదేశ్‌లోని తెలంగాణ జిల్లాల్లో వారిని ఎస్టీలుగా పరిగణించలేదని, ఇతర రాష్ట్రాల నుంచి వారు తెలంగాణకు వలస వచ్చి అక్కడి అసలైన గిరిజనులకు ఉద్దేశించిన హక్కులను కొల్లగొట్టారని వెల్లడించారు. అంతకుముందు వారు బీసీ జాబితాలో ఉన్నారన్నారు. హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనమైన సందర్భంలో ఆంధ్రా ప్రాంతం మద్రాసు రాష్ట్రంలో ఉందని, ఆ సమయంలో లంబాడా, సుగాలీలను ఆంధ్రా ప్రాంతంలో ఎస్టీలుగా గుర్తించారని, కానీ హైదరాబాద్ స్టేట్‌లో కాదని తెలి పారు. కాసు బ్రహ్మానందరెడ్డి కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో ఒక రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో ఒక కులానికి చెందిన వారు ఎస్టీలు, మరికొన్ని జిల్లాల్లో బీసీలుగా ఉండడం సరికాదని ఆ మూడు కులాలను ఎస్టీ జాబితాలో చేర్చారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌కు ఐఎఎస్ శివశంకర్ కేటాయింపు

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి శివశంకర్ లోతేటిని కేంద్రం ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు కేటాయించింది. ఈ మేరకు ఆయనను ఏపీకి రిలీవ్ చేయాలని కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ కార్యదర్శి ఏకే మిశ్రా తెలంగాణ ప్రభుత్వానికి ఉత్తర్వులు పంపించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 2013 బ్యాచ్ ఐఏఎస్ అధికారి శివశంకర్‌ను ఏపీకి కేటాయిస్తున్నట్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. విజయనగరం జిల్లాలోని ధర్మవరం శివశంకర్ సొంతూరు. కానీ రంగారెడ్డి జిల్లాలోని తన మామగారి నివాసంలో ఉండి ఆయన సివిల్ సర్వీసెసు సాధించారు. యూపీఎస్సీకి చేసిన దరఖాస్తులో తన శాశ్వత చిరునామాగా రంగారెడ్డి జిల్లానే పేర్కొన్నారు. రాష్ట్ర విభజన సమయంలో క్యాడర్‌ను నిర్ణయించేటప్పుడు చిరునామా ఆధారంగా కేంద్రప్రభుత్వం ఆయనను తెలంగాణకు కేటాయించింది.

## శాసనమండలిలో మాజీ సభ్యులు రత్నాకర్‌రావు, మాగం రంగారెడ్డికి సంతాపం

### ఆ తరువాత సోమవారానికి సభ వాయిదా

### కొత్త సభ్యులను సభకు పరిచయం చేసిన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** తెలంగాణ శాసనమండలి సమావేశాలు శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యాయి. సభ ప్రారంభం కాగానే సభ్యులకు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వినాయక చవితి శుభా కాంక్షలు తెలిపారు. అనంతరం కొత్తగా శాసనమండలికి ఎన్నికైన సభ్య లను సభకు పరిచయం చేశారు. కొత్తగా మండలికి ఎన్నికైన అద్దంకి దయాకర్, కేతావత్ శంకర్, విజయశాంతి, దాసోజు శ్రవణ్ కుమార్, సత్యం నెల్లికంటి, పింగిలి శ్రీపాల్ రెడ్డి, సి.అంజిరెడ్డి, మల్క కొమరయ్యను పరిచయం చేయగా రెండోసారి రియాజుల్ ఎఫెండి ఎన్నిక కాగా ఆయనను కూడా సభకు పరిచయం చేశారు. అనంతరం గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు సభ్యులుగా కొనసాగి ఈ మధ్య కాలంలో మరణించిన డాక్టర్ టి రత్నాకర్‌కి, తెలంగాణ శాసన పరిషత్తుకి రెండుసార్లు ఎన్నికై మరణించిన మాగం రంగారెడ్డికి సంతాపం తెలుపుతూ మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. మౌనం పాటించిన అనంతరం సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్టు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు.



సచివాలయం వద్ద మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు

## బిసి రిజజర్వేషన్లు పెంచే చట్టానికి ప్రతిపక్షాలు మద్దతు తెలపాలి

### లేదా బిసి ద్రోహులుగా ప్రటిస్తాం: జాజుల

**హైదరాబాద్, ఆగస్టు 30,ప్రభాతవార్త:** సామాజిక రిజర్వేషన్ల పరిమితిని 50 పరిమితిని ఎత్తివేస్తూ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని బిసి రిజర్వేషన్లు 42 శాతం పెంచడానికి ఈ అసెంబ్లీ సమావేశాల్లో పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించాలని నిర్ణయించడం అభినంద ీయమని బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈమేరకు శనివారం సచివాలయం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లపై చట్టం చేసిన తర్వాతనే ప్రత్యేక జీవోను తీసుకురావాలన్నారు. అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లు పెంచుతూ చేయబోయే చట్టంపై అఖిలపక్ష రాజకీయ పార్టీలు బెషరతుగా మద్దతు తెలపాలన్నారు. బీసీ రిజర్వేషన్ అంశంపై అసెంబ్లీలో రాజకీయం చేస్తే ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. బీసీ రిజర్వేషన్ల చట్టానికి మద్దతు ఇవ్వని రాజకీయ పార్టీలను బీసీ ద్రోహులుగా ప్రకటిస్తాన్నారు. బిసిలు ముస్లింలకు మతపరమైన రిజర్వేషన్లు అంటే, దేశంలో సిక్కు మతానికి రిజర్వేషన్లు ఇవ్వడం లేదా? అని ప్రశ్నించారు. మోకాలుకు బోడిగుండుకు మెలిక పెట్టి రిజర్వేషన్లు అడ్డుకోవాలని చూసే పార్టీలను రాజకీయంగా బొంద పెడతామని హెచ్చరించారు. రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లపై చట్టం చేసిన తర్వాత రెండోసారి గవర్నర్‌కు ఆపే అధికారం లేదని గవర్నర్ ఆమోదించకుంటే బిజెపి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికైనా బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 రిజర్వేషన్లు పెంపుకు అన్ని రాజకీయ పార్టీలు, శాసనసభ పక్ష నేతలు శాసనసభ్యులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చంద్రశేఖర్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బిక్షపతి, జాజుల లింగం తదితరులు మాట్లాడారు.

## యాదిగిరిగుట్ట ఆలయ ఇఒగా వెంకటరావు

### 31న పదవీవిరమణ చేస్తున్నందున.. పునర్నియామకం

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** యాదగిరి గుట్ట దేవాలయం ఎక్జిక్యూటీవ్ ఆఫీసర్(ఈవో)గా ఎస్ వెంకట రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న 2015 బ్యాచ్‌కి చెందిన ఐఎఎస్ అధికారి ఎస్.వెంకటరావును యాదగిరిగుట్ట ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా, శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ ప్రత్యేక అధికారిగా నియమిస్తూ జీవో ఆర్‌టి నంబర్ 1179ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావును జారీ చేశారు. ఇందుకు సంబంధించిన నియామక నిబంధనలు, షరతులు విడిగా జారీ చేయబడతాయని ఉత్తర్వులో పేర్కొన్నారు.

## సమస్యలను చర్చించే ధైర్యంలేని కాంగ్రెస్ సర్కారు

### బిజెపి నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** అసెంబ్లీ వర్షాకాల సమావేశాలను 30 రోజుల పాటు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరామని బిజెపి నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుకో ప్రజాసమస్య చొప్పున 30 రోజుల పాటు చర్చించాల్సి న 30 అంశాల జాబి తాను ప్రభుత్వానికి ఇచ్చామని, కానీ కాంగ్రెస్ సర్కారుకు ప్రజాసమస్యలపై చర్చించే చిత్తశుద్ధి లేదన్నారు. అందుకే సమావేశాలను మూడు రోజుల్లోనే ముగిస్తామంటుందన్నారు. ఇది పూర్తిగా బాధ్యతారాహిత్యం. ప్రజాసమస్యలపై పలాయన వాదమన్నారు. భారీ వర్షాలకు జరిగిన పంట నష్టం, రోడ్లు తెగడం, చెరువులకు గండ్లు పడడం రైతులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత, మహిళలు, పెన్షనుదారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్టీసీ సిబ్బంది, ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు చేనేత, కల్లుగీత వంటి వృత్తిదారుల కష్టాలు, ఎస్సీ, ఎస్టీ, బిసి వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు, విద్యా, వైద్య, ఇరిగేషన్, వ్యవసాయం, రెవెన్యూ, ఆర్థిక రంగాల్లోని సమస్యలు ఉన్నాయన్నారు. గత బిఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న భూముల అన్యాక్రాంతం, దేవాలయాలపై దాడుల వంటి అంశాలను అసెంబ్లీలో చర్చించాలని, అందుకే 30 రోజుల పాటు సమావేశాలను నిర్వహించాలని కోరామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నపుడు అప్పటి బిఆర్ఎస్ సర్కారు అసెంబ్లీ సమావేశాలను తక్కువ రోజులు నిర్వహించడాన్ని తప్పుపట్టిందని, తాము అధికారంలోకి వస్తే అసెంబ్లీని ఎక్కువ రోజులు నిర్వహిస్తామని హామీ ఇచ్చిందన్నారు. కానీ అన్ని హామీల మాదిరే ఈ హామీ కూడా ఎగవేతనే అని, కాంగ్రెస్ సర్కార్ గత బడ్జెట్ సమావేశాలను కేవలం 11 రోజులే నిర్వహించిందన్నారు గత శీతాకాల సమావేశాలు (2024 డిసెంబరులో) జరిగింది ఏడు రోజులే అన్నారు. అసెంబ్లీ సమావేశాలను ఇలా తక్కువ రోజుల పాటు నిర్వహించడమనేది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల హాయంలో అసెంబ్లీ తక్కువ రోజులే సమావేశమైందని, ఒక్క యేడాది మాత్రమే 30 రోజులకు పైగా నడిచింది. మిగిలిన సంవత్సరాలన్నీ కూడా 30 రోజుల్లోపే అసెంబ్లీ నడిచింది. కెసిఆర్ బాటలోనే రేవంత్ సర్కార్ నడుస్తూ సమావేశాలను తక్కువ రోజులు నిర్వహించడం ద్వారా శాసనసభ ఔన్నత్యాన్ని దెబ్బతీస్తుందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకుని వినాయక నిమజ్జనం తర్వాత అసెంబ్లీని తిరిగి సమావేశ పరిచి ప్రజాసమస్యలను చర్చించి, పరిష్కారాలను చూపాలన్నారు. ప్రజాసమస్యలను చర్చించే పరిష్కరించాలనే చిత్తశుద్ధిలేని సర్కారులే ఇలా వ్యవహరిస్తాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజాసమస్యలను చర్చించే దమ్ము, ధైర్యం ఉంటే వినాయక నిమజ్జనం తర్వాత అసెంబ్లీని 30 రోజుల పాటు నడపాలని డిమాండ్ చేశారు. సభలో ప్రజాసమస్యలను చర్చిస్తే ప్రభుత్వ వైఫల్యాలు, డొల్లతనం బయట పడుతుందని సిఎం రేవంత్ రెడ్డి భయపడుతున్నారు. అందుకే సమావేశాలను మూడురోజుల్లోనే ముగిస్తున్నారు. తమ సమస్యలను అసెంబ్లీలో చర్చించి పరిష్కరించకుండా దాటవేస్తున్న దగాకోరు కాంగ్రెస్ సర్కారుకు ప్రజలు వచ్చే స్థానిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

## వెల్ఫేర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సవ్యసాచిఘోష్‌కు అదనపు బాధ్యతలు

### గిరిజన సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు కూడా..

### ఉత్తర్వులు జారీ చేసిన సర్కార్

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** పశు సంవర్ధక, డైరీ డెవలప్‌మెంట్ అండ్ ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా కొనసాగుతున్న సీనియర్ ఐఎఎస్ అధికారి సభ్యసాచి ఘోష్‌కి అదనపు బాధ్యతలు అప్పగిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వెల్ఫేర్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా అలాగే గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన జీవో ఆర్‌టి నంబర్ 1180ను జారీ చేశారు. ఇప్పటి వరకు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా డాక్టర్ విఎస్ అలగు వర్షిణికి ఇచ్చిన అదనపు బాధ్యతల నుంచి తొలగించారు. అలుగు వర్షిణి రెండు సంవత్సరాల పాటు డిప్యూటేషన్‌లో కేంద్ర సర్వీసులకు వెళ్తున్న నేపథ్యంలో అదనపు బాధ్యతలను ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**సంక్షేమ శాఖల సమన్వయంపై ప్రత్యేక మెమో జారీ**

వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సభ్యసాచి ఘోష్‌కి అదనపు బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం.. బిసి, ఎస్సి, ఎస్టి, మైనారిటీ సంక్షేమ శాఖలను సమన్వయం చేస్తారని పేర్కొంటూ మెమో నంబర్ 1279ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జారీ చేశారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, వెనుకబడిన తరగతుల సంక్షేమం, మైనారిటీ సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖల అంతటా సమన్వయాన్ని బలోపేతం చేయడానికి, పథకాల కలయికను నిర్ధారించడానికి, వ్యూహాత్మక దిశానిర్దేశం చేయడానికి, ప్రభుత్వం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కేడర్‌లో ఒక అధికారిని సంక్షేమం కోసం ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించాలని నిర్ణయించింది.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి




యూసుఫ్‌గూడలో నిర్వహించిన బిజెపి బూత్ స్థాయి సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), ఆగస్టు 30, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికలో బీజేపీ పార్టీ గెలుపునకు బూత్ స్థాయి నుంచి కష్టపడి పనిచేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్‌రావు అన్నారు. శనివారం యూసుఫ్ గూడ మహ్మూద్ ఫంక్షన్ హాల్‌లో హైదరాబాద్ సెంట్రలల్ జిల్లా అధ్యక్షులు లంకల దీపక్‌రెడ్డి ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం భారతీయ జనతాపార్టీ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రామచందర్‌రావు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావు పాల్గొన్నారు. రామచందర్‌రావు మాట్లాడుతూ నగరంలో బలమైన పార్టీ బీజేపీ పార్టీ అని జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో 48 సీట్లు గెలవటం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు బీజేపీ మాత్రమే ప్రత్యామ్నాయం అన్నారు. రాష్ట్రాన్ని గత పదేళ్లలో బీఆర్ఎస్ కుటుంబపాలన సాగిస్తే 22 నెలల్లో కాంగ్రెస్ అప్పుల రాష్ట్రంగా మార్చిందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ పార్టీని గెలిపించాలని కాంగ్రెస్, ఎమ్ఐఎమ్ మద్దతుతో ముందుకు వెళ్తున్నారని ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు. బీహార్‌లో ఎమ్ఐ ఎమ్‌తో కలిసి రాహుల్‌గాంధీ ఓట్ చోర్ జరిగిం దంటూ ప్రచారం చేస్తున్నారని కానీ హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ ఎమ్ఐఎమ్ కలిసి ఓట్ చోర్ అధికారులను కలుపుకుని చేస్తున్నార న్నారు. కాంగ్రెస్ పాలనను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. అనంతరం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేశాకే ఓట్లు అడగాలని ఓటు అడిగే నైతిక హక్కు ను వారు కోల్పోయారన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో పాటు, గ్రామాలలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రజలు కాంగ్రెస్‌ను నిలదీయాల న్నారు. ఆరు గ్యారెంటీలలో మహి ళలకు రూ.2,500, తులం బంగారం, కాలేజి వెళ్లే విద్యా ర్థినులకు స్కూటీలు, నిరుద్యోగ బృతి ఏమ య్యాయని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో మహిళలకు పొదుపు సంఘాల పేరుతో రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తున్నా మని కాంగ్రెస్ మాత్రం రుణాలకు వడ్డీ చెల్లించలేని పరిస్థితి ఉందని ఉద్యోగులకు డీఏలు లేవని ఉద్యోగాల పంచన్లు ఇచ్చే పరిస్థితి కూడా లేదన్నా రు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అడుగడుగున కాంగ్రెస్‌ను అడ్డుకోవాలన్నారు. అనంతరం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలను చూస్తుంటే 2020లో బీహార్ ఎన్నికల సమయంలో దుబ్బాక ఎన్నికలు నిర్వహించారని అదే పరిస్థితి ప్రస్తుతం బీహార్ ఎన్నికల సమయంలోనే జూబ్లీహిల్స్ ఎన్నికలు రావడం బీజేపీ గెలుపునకు నాందిగా పలుకుతుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్, మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షులు గౌతమ్‌రావు, భరత్‌గౌడ్, శ్యామ్ సుందర్‌గౌడ్, డాక్టర్ పద్మా వీరపనేని, అట్లూరి రామకృష్ణ, నగర కార్యదర్శి ప్రేమ్‌కుమార్, కుంబాల గంగరాజు, కొలన్ సత్యనారాయణతోపాటు డివిజన్ల అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూరియా అంశం కేంద్ర పరిధిలోనిది

### విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి ఛైర్మన్

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** యూరియా అంశం కేంద్రం పరిధిలోనిదని విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ నేతలకు రైతుల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో లేకపోతే బీజేపీ కార్యాలయం ముందు ధర్నా చేయాలన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో తెలంగాణ రైతాంగాన్ని కేంద్రం నిండా ముంచిందని చెప్పారు. రాష్ట్రానికి ఈ సీజన్ లో కేటాయించిన యూరియా కోటాలో 60 కూడా సరఫరా చేయలేదని వెల్లడించారు. రామగుండం ఎరువుల కర్మాగారం రెండు నెలల నుంచి మూతపడినా, ఇప్పటి వరకు కేంద్రం పట్టించుకోలేదని విమర్శించారు. ఈ సీజన్‌లో రాష్ట్రానికి ప్రణాళిక ప్రకారం రావాల్సింది 8.30 లక్షల టన్నులు అయితే కేంద్రం ఇచ్చింది 5.95 లక్షల టన్నులు మాత్రమేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వం చనిపోయిన రైతులకు పరిహారం కూడా ఇవ్వలేదని, వీరిలో 141 మంది రైతులకు తమ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందని వివరించారు.

## యూరియాపై ఆందోళనలు

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యూరియా కొరత తీర్చాలంటూ వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆందోళనలు చేశారు. ధర్నాకు దిగిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పలువురు నేతలను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ఆయా పోలీసు స్టేషన్లకు వారిని తరలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అంతకుముందు వ్యవసాయ శాఖ కమిషనర్‌కు యూరియా కొరతపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వినతిపత్రం అందించారు. యూరియా కొరత తీర్చాలని, ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కమిషనర్‌కు బీఆర్ఎస్ నేతలు సూచించారు.

తాము రాజకీయాలు చేయడం లేదని, రైతుల తరపున మాట్లాడుతున్నామని కమిషనర్‌కు బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. యూరియా సంక్షోభానికి కారణం కాంగ్రెస్ పార్టీ అంటూ నినాదాలు చేశారు. పండగపూట కూడా రైతన్నలను రోడ్లపై నిలబెట్టిందని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. గణపతి బప్పా మోరియా - కావాలయ్యా యూరియా" అంటూ నినదించారు. రైతన్నలకు ఎరువులు సరఫరా చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని నినాదాలు చేశారు. రైతన్నలకు యూరియా వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.



## అందుబాటులో లేని 108 వాహనం.. ఇబ్బంది పడుతున్న రోగులు..

### వైసిపి మండల కన్వీనర్ ఆకుల రామారావు

ఎటపాక, ఆగస్టు 30, ప్రభాతవార్త

ఎటపాక మండల పరిధిలోని నెల్లి పాక ప్రభుత్వ ఆసుపత్రి 108 వాహనం గత రెండు నెలలుగా (సుమారు 70 రోజులు) హాస్పిటల్‌లో అందుబాటులో లేకపోవడంతో ఆపద వచ్చిన అభాగ్యులు ఆటోలు, కార్లు ద్వారా పెద్ద ఆసుపత్రులకు వెళ్లడానికి కిరాయిల రూపంలో జేబులో గుల్ల చేసుకుం టున్నారు. సుమారు మూడు నెలలుగా అందుబాటులో లేని వాహనం గురించి అధికారులు పట్టదా...? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు, 108 వాహనం లేకపోవడంతో మండల పరిధిలోని యాక్సిడెంట్ లకు అత్యవసర చికిత్స నిమిత్తం రోగులను పెద్ద ఆసుపత్రులకు తీసుకుపోవడానికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇటువంటి సమస్యని పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## 50 మెట్రిక్ టన్నుల యూరియా సిద్ధం : ఏఓ చక్రధర్

రాజవొమ్మంగి, ఆగస్టు 30, ప్రభాతవార్త




యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు అంటూ వార్తలో ఈనెల 23న వచ్చిన ప్రత్యేక వార్తకు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ స్పందించిన విషయం తెలిసిం దే. కలెక్టర్ కమీషనర్ మాట్లాడటంతో 50 మెట్రిక్ టన్నులు యూరి యా శనివారం వచ్చినట్లు ఏ.ఓ చక్రధర్ తెలిపారు. మండలంలో ఐదుగురు డీలర్లకు ఈ యూరియా ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వ ధరలకే యూరియాను అమ్మాలన్నారు. యూరియాను సచివాల యం వ్యవసాయ సహాయకులు పర్యవేక్షణలో దింపడం జరిగిం దని ఏ.ఓ వెల్లడించారు. రెండో విడత రైతు భరోసా కేంద్రాలకు యూరియా వస్తుందన్నారు. ఏ.ఓ చక్రధర్, సచివాలయ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



## వాల్మీకి సంఘ నేతలు సహాయం

రాజవొమ్మంగి, ఆగస్టు 30, ప్రభాతవార్త

శనివారం జడ్డంగి గ్రామంలో వాల్మీకి తెగ కు చెందిన పులిమెట్ల కాసులమ్మ మరణించడం జరిగింది. ఆదివాసి వాల్మీకి సంక్షేమ సంఘం సభ్యురాలు అయిన కాసులమ్మ కుటుంబానికి జిల్లా ఆదివాసి వాల్మీకి సంక్షేమ సంఘం ఆదేశాలతో మండల కమిటీ అధ్యక్షులు వజ్రపు అప్పారావు, జిల్లా కార్యదర్శి రాళ్ళగడ్డ. అర్జున్ జడ్డంగి గ్రామ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో రూ.5,000లు ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబం సభ్యులకు అందించారు. ఆదివాసి వాల్మీకి సంక్షేమ సంఘం కార్యదర్శి రాళ్ళగడ్డ అర్జున్, రాజవొమ్మంగి మండల అధ్యక్షుడు వజ్రపు అప్పారావు, జడ్డంగి గ్రామ కమిటీ సభ్యులు ముంగారి గణపతి, మద్దికొండ కృష్ణ, బారంగి రాజబాబు, పులిమెట్ల మోహనరావు మఠం సత్తిబాబు, ముంగారి అమ్మన్న బారంగి ప్రకాశరావు ఉపాధ్యాయులు దూడా సాంబయ్య, బొంకు దొరబాబు, యువకులు తలారి అర్జున్, మహిళలు పాల్గొన్నారు.

## ఒకటో తేదీన పింఛను సొమ్ములు పంపిణీ

రాజవొమ్మంగి, ఆగస్టు 30, ప్రభాతవార్త

మండలంలో 6,352 మంది పించను లబ్ధిదారులకు ఆగస్టు నెలకు రూ.26,11,78,500 సొమ్ములను 30న బ్యాంకు నుండి తీసి ఒకటో తేదీన పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు తెలిపారు.

## సొసైటీలో 20 టన్నులు పోటాష్ ఎరువులు సిద్ధం: సి. ఇ. ఓ గోపాలకృష్ణ

రాజవొమ్మంగి ఆగస్టు 30, ప్రభాతవార్త

జడ్డంగిలో గల సొసైటీ గోడౌన్ కు 20 టన్నులు పోటాష్ ఎరువులు వచ్చినట్లు సి.ఇ.ఓ గోపాలకృష్ణ శుక్రవారం తెలిపారు. 50 కిలోలు ధర రూ. 1,810లు అని అన్నారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ సి.ఇ.ఓ. అప్పారావు పాల్గొన్నారు.

## ఆశ్రమోన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం

రాజవొమ్మంగి, ఆగస్టు 30, ప్రభాతవార్త



బోర్నగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, ధ్యానచంద్ చిత్రపటాలకు హెచ్. యం. రమేష్ బాబు, ఉపాధ్యాయులు పూలమాలలను వేశారు. క్రీడ దినోత్సవంపై పి. డి.ధర్మరాజు మాట్లాడుతూ హాకీలో విశేష కృషి చేసిన ధ్యాన్‌చంద్ పుట్టినరోజున జాతీయ క్రీడా దినోత్సవాన్ని చేసుకొంటామని అవగాహన కల్పించారు. హెచ్.ఎం. రమేష్ బాబు, డిప్యూటీ వార్డెన్ యం. రమేష్ బాబు, విజయబాబు, వరప్రసాద్, కృష్ణ, పాపారావు, ధర్మరాజు, బాలరాజు, కోటేశ్వరరావు, శివ, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాలు అభివృద్ధికి సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తున్న మంత్రి సంధ్యారాణి

### మంత్రిపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి : టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు డిమాండ్

పాడేరు,ఆగస్టు30,ప్రభాతవార్త



రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి గిరిజన ప్రాంతాలు అభివృద్ధికి,సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని అయితే మంత్రి సంధ్యారాణి హయాంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసిపి నాయకులు,కొన్ని ప్రసారమాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలను ప్రసారం చేస్తున్నారని అటువంటి వారిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు డిమాండ్ చేశారు.మంగళవారం అయన మాట్లాడుతూ మంత్రి సంధ్యారాణి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఉన్న అన్ని గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పనలు సుమారు రూ.1300 కోట్లు వెచ్చించి గిరిజన ప్రాంతాల్లో అభివద్ధి కార్యక్రమాలను మంత్రి నిర్వహిస్తున్నారని దీనిని ఓర్వలేక మంత్రిపై కావాలనే వైసిపి నాయకులతో కలిసి కొన్ని ప్రసారమాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలను ప్రసారం చేస్తున్నారని అటువంటి వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని బొర్రా నాగరాజు కోరారు. మంత్రిపై తప్పుడు దుష్ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని నాగరాజు కోరారు.

## విధి నిర్వహణలో ఫర్ఫెక్ట్.. అందరిదృష్టిలో ఆయన కరెక్ట్..!

### ఉద్యోగ విరమణ పొందిన మర్రివాడ హెచ్ఎంకు ఘన సన్మానం

కొయ్యూరు ఆగస్టు30 ప్రభాతవార్త



విధి నిర్వహణలో ఆయన పర్ఫెక్ట్, అందరి దృష్టిలో ఆయన కరెక్ట్ అంటూ ఉద్యోగ విరమణ పొందిన మండలంలోని మర్రివాడ ఎంపీపీఎస్ ప్రధానోపా ధ్యాయుడు బిజె నరసింహారావును ఉద్దేశించి వింతఊట రాంబాబు, ప్రసాద్, సర్పంచ్ మాదల సత్యవతి, మాజీ ఎంపీపీ సత్య నారాయణ, పిట్టరియ నేత వేపాటి తలుపులు, పీటీఎఫ్ నేత రఘువరన్, ఉపాధ్యాయ సంఘ నేతలు ఆర్. నాగేశ్వర రావు, భరత్, కుంచె మురళి, రమణ, బడుగు రామకృష్ణ, ఫణీంద్ర, వై సింహాచలం, అచ్చిరాజు, ఆకె సురేష్ తదితరులు కొనియాడారు. శనివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించిన ఈ ఉద్యోగ విరమణ సన్మానకార్యక్రమంలో సన్మాన గ్రహీత నరసింహారావు మాట్లాడుతూ తనను ఆదరించిన, అభిమానించిన అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తోటి ఉపాధ్యాయులను ఎప్పటికీ మరువలేను అన్నారు. కాగా వక్తలు మాట్లాడుతూ సన్మాన గ్రహీత నరసింహారావు తన సేవ జీవితాన్ని ఆయురారోగ్యాలతో, కుటుంబ బీకులతో హాయిగా గడపాలని ఆకాంక్షించారు. స్థానిక పెద్దలు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కురసాల'కు మండల వైసీపీ నేతల ఘన నివాళి

కొయ్యూరు, ఆగస్టు30, ప్రభాతవార్త



ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్ఆర్సీపీ రీజనల్ కోఆర్డినేటర్ మాజీ మంత్రి కురసాల కన్నబాబు తండ్రి కురసాల సత్యనారాయణకి మండల వైసీపీ నేతలు ఘన నివాళులు శనివారం అర్పిం చారు. ఎంపీపీ బడుగు రమేష్ బాబు, జడ్పిటిసి వారా నూక రాజు, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంకిరెడ్డి నూకాలమ్మ, నేతలు జల్లి బాబులు, గాడె సత్య నారాయణ, జైలరాజులమ్మ, ఫోని బాబ్జి, కాళ్ల వనం బాబు,సర్పంచులు ఎంపీటీసీలు నత్తారు సోమన్న దొర, పొట్టిక శ్రీను, రీమల శ్రీనివాస్, జంపా రాజకుమారి, పాదుగు రత్నం, నేమాని నూకాలమ్మ, గంగాభవాని, గాడిఅచ్చిరాజు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ అధికారిగా కే.సుధాకర్

హుకుంపేట, ఆగస్టు 30, ప్రభాతవార్త



మండల నూతన వ్యవసాయ అధికారిగా కే.సుధాకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో విజయనగరం సహా మూడు మండలాల్లో వ్యవసాయ అధికారిగా పనిచేశానని ఆయన గుర్తుచేశారు. రైతులతో మాట్లాడుతూ సోమ వారం నుంచి ఎప్పుడైనా తమను సంప్రదించవచ్చని, ఎటువంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని రైతులను కోరారు. వ్యాధి కారణంగా నష్టపోయిన రైతులు తప్పనిసరిగా ఈ-పంట క్రాప్ నమోదు చేసుకోవాలని, అప్పుడు మాత్రమే వారికి బీమా సౌకర్యం లభిస్తుందని సుధాకర్ స్పష్టం చేశారు.

## కొయ్యూరు నూతన సీఐగా శ్రీనివాస్

కొయ్యూరు ఆగస్టు 30 ప్రభాతవార్త



ప్రస్తుతం విజయనగరం సైబర్ క్రైమ్ సెల్ సీఐగా పనిచేస్తున్న శ్రీనివాస్ కొయ్యూరు నూతన సీఐగా బదిలీ అయ్యారు. ప్రస్తుతం కొయ్యూరు సీఐగా పని చేస్తున్న పి.వెంకటరమణ అల్లూరి సీతారామరాజు జిల్లా సోషల్ మీడియా సైబర్ సెల్ కు బదిలీ కావడంతో శ్రీనివాస్ నూతన సీఐగా నియమితులయ్యారు. కాగా శ్రీనివాస్ గతంలో కొయ్యూరు ట్రైనీ ఎస్ఐగా పనిచేసి, అటుపై 2008 సం. నుండి 2010 సం. వరకు కొయ్యూరు ఎస్సైగా పనిచేశారు. కాగా నూతన సీఐ గా శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించుకున్నారు.

## ఈదులపాలెం పీహెచ్సి ఆకస్మిక తనఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. విశ్వేశ్వర నాయుడు

పాడేరు,ఆగస్టు30, ప్రభాతవార్త



పాడేరు మండలం ఈదులపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సి)నీ అల్లూరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. విశ్వేశ్వర నాయుడు శనివారం ఆకస్మిక తనఖీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న గ్రామాల రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు పి. హెచ్.సిలో జరుపుచున్న సుఖప్రసవాల గురించి వైద్యాధికారికి అడిగి తెలుసుకున్నారు. పి హెచ్ సి పరిధిలో నమోదయిన మలేరియా కేసుల గూర్చి అందించిన చికిత్సల గురించి వైద్యాధికారినీ అడిగి తెలుసుకొన్నారు. పి..హెచ్.సి వైద్యాధికారి డా. విశ్వేశ్వర నాయుడు, జిల్లా కార్యాలయ ఆరోగ్య విస్తరణ అధికారులు గుల్లేలి సింహాద్రి, యం.సంజీవ్ పాత్రుడు, పి. హెచ్.సి హెల్త్ ఏడ్యూకెటర్ శివరామ కృష్ణ,డి. కొండలరావు, పి. హెచ్సి సిబ్బంది పాల్గొన్నారు.

## అంకితభావంతో ఉత్తమ సేవలందించిన డీ పి.ఆర్.ఓ రాములు

పాడేరు,ఆగస్టు30,ప్రభాతవార్త



ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా అంతకిత భావంతో డివిజనల్ పౌర సంబంధాల అధికారి, సహాయ ప్రాజెక్టు అధికారిగా రాములు ఉత్తమ సేవలను అందించారని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్ దినేష్ కుమార్ అన్నారు. రాములు సేవలు ఆదర్శనీయమని పేర్కొన్నారు. శనివారం డివిజనల్ పిఆర్ఓ పి.రాములు పదవి విరమణ సందర్భంగా డివిజనల్ పి ఆర్ ఓ రాములును డ్రైవర్ కన్నబాబును కలెక్టర్ చాంబర్ లో శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రచార కార్య క్రమాలు, సమావేశాలు, ప్రెస్ మీట్లు ఏర్పాటు, మీడియా సమస్యయంలో చురుకైన పాత్ర పోషించారని అన్నారు. అధికారులు చెప్పిన పనులను సకాలంలో నెరవేర్చేవారని అన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి కె. బి.ఎం. సింగ్ మాట్లాడుతూ 1995 లో పబ్లిసిటీ అసిస్టెంటుగా ఉద్యోగంలో చేరి డివినల్ అధికారిగా రిటైరపుతున్నారని అన్నారు. 30 ఏళ్లు సహకారం అందించిన అధికారులకు, పాత్రికేయులకు కార్యలయం సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సహాయకులు పి.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ కె.సంధ్యారాణి, కార్యాలయం సిబ్బంది పుష్ప ,వరలక్ష్మీ బహదూర్ తదితరులు సహాయకులు పాల్గొన్నారు.

## ఐదు జిల్లాల్లో 413 విద్యుత్ వినియోగదారులు క్యాంప్ కోర్టులు

రాజవొమ్మంగి, ఆగస్టు 30, ప్రభాతవార్త



రాజవొమ్మంగి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ వినియోగదారులు సమస్యలపై పరిస్కార వేదిక నిర్వహించిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా అనంతరం ప్రభాత వార్త తో చైర్ పర్సన్ మాట్లాడుతూ ఐదు ఉమ్మడి జిల్లాలు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ˘ట్టణం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలు పరిధిలో 2016 సం. నుండి 2025 సం. వరకూ 413 క్యాంపు కోర్టులు, 124 అవగాహన సదస్సులను నిర్వహించడం జరిగిందన్నారు. 2016 సం. నుండి 2025 సం. ఆగస్ట్ వరకూ 113 కేసులకు రూ.14,64,950లు నష్ట పరిహారం ఇవ్వడం జరిగిందని వివరించారు. విద్యు త్ సమస్యలు పరిస్కారానికి 1912 నెంబర్ కు ఫోన్ చేసి తెలుప వచ్చునని అన్నారు. ఈ సమా వేశమునకు (సి.జి.ఆర్.ఎఫ్) చైర్‌పర్సన్ డా.బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు యస్. రాజుబాబు, స్వతంత్ర సభ్యులు యన్. మురళీకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి. గాబ్రియేల్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్ యల్ సిహెచ్ పాత్రులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. గోపాలకృష్ణ పాల్గొని పలు విద్యుత్ సమస్యలను తెలిపారు.. ఈ సమావేశంలో రాజవొమ్మంగి ఏఇ కొంగర అబ్బాయిదొర, జెఈలు పోలేశ్వరరావు, సుదర్శన్, యల్ఐ వీరబాబు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## నిర్మాసితులను కాలనీలకు తరలింపుకు తగిన ఏర్పాట్లు : కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్

పాడేరు,ఆగస్టు30, ప్రభాతవార్త



పోల వరం ప్రాజెక్టు నిర్మాసితులు పునరావాస కాలనీలకు తరలింపుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. భూములు కోల్పోయిన రైతులకు ప్రత్యామ్నాయంగా భూములు అందించడానికి భూ సేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుండి రంపచోడవరం, చింతూరు డివిజన్ అధికారులు, తాహశీల్దారులు, పోలవరం పరిపాలనాధికారు లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతులకు ప్రత్యామ్నాయ భూములు సేకరణ, పునరావాసం, పునరేర్పాట్లుపై సమీక్షించారు. పోలవరం పరిపాలనాధికారి వి. అభిషేక్, రంపచోడవరం ఐటిడి ఏ పి ఓ కె. సింహచలం, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, చింతూరు పి ఓ అపూర్వ భరత్, ప్రత్యేక ఉప కలెక్టర్ అంబేద్కర్, చింతూరు, రంపచోడ వరం డివిజన్ల పరిధిలో పలువురు తాహశీల్దారులు తదితరులు పాల్గొన్నారు.



## వరద ప్రభావితం ప్రాంతాల్లో పిఓ పర్యటన

చింతూరు డిసెంబర్ 30 ప్రభాతవార్త

చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం నొకహ్వాల్ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి వరద ముంపుకు గురైన గ్రామాల ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శబరి, గోదావరి నదుల వరద ముప్పుతో గతవారం రోజులుగా చింతూరు మండల కేంద్రం నుంచి విఆర్ పురం మండల కేంద్రాన్ని కలిపే రహదారులన్నీ నీటమునిగాయి. దాంతో ఆ రహదారికి ఆనుకొని ఉన్న గ్రామాలన్నీ టికి రాకపోకలు లేకపోతే ప్రజలు అవస్థలు పడుతున్నారు. శనివారం చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి చిం తూరు నుంచి సోకిలేరు వాగు వరకు చేరుకుని అక్కడ పడవపై సోకులేరు నదిని దాటి ద్విచక్ర వాహనాలపై సమీప గ్రామాలకు వెళ్లి అక్కడి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముకునూరు, నర్సింగపేట, జల్లివారిగూడెం ఏజి కోడేరు గ్రామాల్లో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## మౌళిక వసతుల కల్పన వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్

పాడేరు,ఆగస్టు30, ప్రభాతవార్త



మౌళిక వసతుల కల్పన వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ తన పర్యటనలో భాగంగా పాడేరులో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల సందర్శించారు. నేటికీ చేపట్టిన పనులపురోగతి పై ఆరా తీశారు. లెక్చరర్ గ్యాలరీస్ పరిశీలించి పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎనాటమీ డిసెక్షన్ హాల్లో కడావర్స్, వాటి డిసెక్షన్ గురించి డాక్టర్ లక్ష్మీకుమారిని అడిగి తెలుసుకున్నారు సీనియర్ రెసిడెన్స్ క్వార్టర్స్, గర్ల్స్ హాస్టల్,బాయ్స్ హాస్టల్ ని ఇన్స్పెక్ట్ చేశారు.స్టూడెంట్స్‌కి బాస్కెట్బాల్ వాలీబాల్, షటిల్ కోర్ట్ త్వరగా అందుబాటులో ఉంచాలని ఏపీ ఎంఎస్ఐడిసి, ఈఈ ఎన్.సి.సి కాంట్రాక్టర్స్‌కి కలెక్టర్ సూచనలు ఇచ్చారు, సిసి కెమెరాలు, స్ట్రీట్ లైట్స్ పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలనీ ఆదేశించారు. క్యాంపస్లో సేఫ్టీ ఇంపార్టెంట్ అని సూచనలు ఇచ్చారు, స్టూడెంట్స్ కోసం గ్రౌండ్, ఆడిటోరియం ఫెసిలిటీ ఉండాలన్నారు. మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ హేమలత దేవి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీ కుమా రి, ఏపీ ఎంఎస్ ఐడీసీ ఈ.ఈ అచ్చం నాయుడు, డిఈఏఈ, ఎన్ సిసి, ఏజిఎం మధుబాబు ఉన్నారు.



## బూర్జ పంచాయతీని జల సమాధి చేయొద్దు..

హుకుంపేట, ఆగస్టు 30, ప్రభాతవార్త

మండలంలో బూర్జ పంచాయతీలో నవయుగ కంపెనీ కోసం భుర్జ పంచాయతీ సర్వం జలసమాధి చెయ్యద్దనీ హుకుంపేట మండల కేంద్రం మెయిన్ రోడ్డులోశనివారం పంచాయతీ ప్రజలు భారీ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణనికి ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భుర్జ పంచాయతీ ఆదివాసీ ప్రజలు హుకుంపేట మండలం కేంద్రంలో భారీ ర్యాలీ పొట్టి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భుర్జ పంచాయతీ మజ్జి వలస గ్రామంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణనికి ఆగస్టు 28 తేదీన గ్రామ సభ ఏర్పాటు చెయ్యాలనీ నోటీస్ ఇచ్చిందని భుర్జ పంచాయతీలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం జరిగితే 14 గ్రామంలో 5 వేల మంది ఆదివాసులు జలసమాధి అవుతున్నా రనీ ఆగ్రహంతో పంచాయతీకి చెందిన వందలాది మంది ఆదివాసులు గ్రామసభలో హాజరయ్యారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లోసురేంద్ర, అనంతగిరి జెడ్పీటీసీ సభ్యులు డి.గంగరాజు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పీ.బలదేవ్ నాయకత్వంలో జరిగిన సమావేశంలో పిర్యాదు ఇవ్వడం జరిగిందని, భుర్జ పంచాయతీలో 14 గ్రామ పరిధిలోని 5 వేల మంది ఆదివాసులు జలసమాధి చేస్తున్న హైడ్రోపవర్ ప్రాజెక్ట్ నిర్మాణనికి ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఆదివాసీల హక్కులు,చట్టాలు కాపాడాలని నీరజ్ ఐపీఎస్ దృష్టికి తీసుకుని వెళ్ళారు. ఆదివాసీ గిరిజన సంఘం హుకుంపేట మండల కమిటి కార్యదర్శి టీ.కృష్ణారావు హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాటకమిటి కన్వీనర్ మజ్జి సురేష్. భుర్జ ఎంపీటీసీ మజ్జి హరి పోరాటకమిటి సభ్యులు మజ్జి కృష్ణ మూర్తి హుకుంపేట మండల సిపిఎం పార్టీ కార్యదర్శి వి.లక్మన్, గిరిజన సంఘం మండల నాయకులు కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాల వద్ద విద్యుత్ లైన్ల భద్రత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి : అల్లూరి జిల్లా ఎస్ఈ జి.ఎన్.ప్రసాద్

పాడేరు, ఆగస్ట్30,ప్రభాతవార్త

గణేష్ మండపాల వద్ద విద్యుత్ లైన్ల భద్రత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలనీ విద్యుత్ శాఖ అల్లూరి జిల్లా ఎస్ఈ జి.ఎన్.ప్రసాద్ పేర్కొన్నారు. మండపాలకు విద్యుత్ సరఫరా కోసం అధికారిక తాత్కాలిక కనెక్షన్లను మాత్రమే తీసుకోవాలనీ, అనధికారిక కనెక్షన్లు లేదా విద్యుత్ దొంగతనం ప్రమాదకరం మరియు చట్టవిరుద్ధం అని అయన హెచ్చరించారు. అనుమతులు తప్పనిసరి:- మండపాల ఏర్పాటుకు సంబంధిత విద్యుత్ శాఖ, పోలీసు మరియు మున్సిపల్ అధికారుల నుండి అనుమతులు తీసుకోవాలనీ అయన స్పష్టం చేశారు. విద్యుత్ పనులు లైసెన్స్ పొందిన ఎలక్ట్రిషియన్లు లేదా నిపుణుల ద్వారా మాత్రమే చేయించాలనీ ఇది విద్యుత్ ప్రమాదాలను నివారిస్తుందన్నారు.

## ప్రమాదస్థాయి దాటి ఉధృతంగా పెరుగుతున్న గోదావరి, శబరి

### ప్రధాన రహదారులపై వరద నీరు -నిలిచిపోయిన రవాణా వ్యవస్థ -భద్రాచలం- కూనవరంల మధ్య ఆర్టీసీ బస్సుల నిలుపుదల -అప్రమత్తమైన అధికార యంత్రాంగం -భద్రాచలం వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక వద్ద కొనసాగుతున్న గోదావరి నీటిమట్టం -గిరిజన గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు

కూనవరం, ఆగస్టు 30, ప్రభాతవార్త :



గోదావరి, శబరి నదులు ఉధృతంగా పెరుగుతూ ప్రమాద స్థాయి హెచ్చరికలు దాటి పొంగి ప్రవహిస్తున్నాయి. ఇటీవల వరదలు తగ్గుముఖం పట్టి వారం రోజులు తిరగకముందే మళ్లీ గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఈ నెలలో రెండు పర్యా యాలు ప్రమాద హెచ్చరికలు దాటి గోదావరికి వరదలు రావడం జరిగింది. వరదలతో విలీన మండలాలైన కూనవరం, వీఆర్పురం, ఎటపాక ప్రజలు భీతుల్లుతున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం రెండవ ప్రమాద హెచ్చరిక చేరువలో కొనసాగు తోంది. శబరి, గోదావరి సంగమ స్థలమైన కూనవరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. వరద ఉధృతి పెరగడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యారు. లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. గోదావరి నీటిమట్టం పెరగడంతో కూనవరం – భద్రాచలం ప్రధాన రహదారులలో వరద నీరు చేరడంతో రవాణా వ్యవస్థ స్తంభించింది. ఈ ఆగస్టు నెలలోనే విస్తారంగా వర్షాలు పడటం, రెండు పర్యాయాలు వరదలు రావడం వలన ఉపాధి అవకా శాలు కోల్పోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోదావరి వరద ఇంకా స్వల్పంగా క్రమక్ర మంగా పెరుగుతూనే ఉంది. ఆదివారం నుండి వరద తగ్గుముఖం పట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది.

## వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో గురువుల ఓరియంటేషన్ సమావేశం

చింతపల్లి ఆగస్టు 30 ప్రభాతవార్త



చింతపల్లి మండలం పరిధిలోని వంగసార బాలికల ఆశ్రమ పాఠశాలలో మరియు చింతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమ్మాయిల శక్తివంతం కార్యక్రమం క్రింద గురువుల కోసం ప్రత్యే క ఓరియంటేషన్ సమావేశం శనివారం నిర్వహించారు. వాసవి మహిళా మండలి సభ్యులు మాట్లాడుతూ గురువులు, సమా జం కలిసి ఒక్క చిన్నారి కూడా వెనుకబడకూడదని అదే భావనతో బాలికలందరు ముందుకు సాగాలని అన్నారు. ప్రతి ఒక్క చిన్నారి పాఠశాలలో తరగతులకు హాజరవ్వడం, తరగతి గదిలో విద్యను నేర్చుకోవడం ఎంతో అవసరమన్నారు. అలాగే పాఠశాలకు ఏ ఒక్క విద్యార్థిని కూడా గైర్హాజర్ కాకుండా ఉండాలన్నారు. వాసవ్య మహిళా మండలి సిఎస్ఓ,డ్వాక్రా మహిళలతో కలిసి పిల్లల విద్య కొనసాగించేందుకు కృషి చేయాలన్నారు. గురువులు, సమాజం కలిసి పనిచేస్తేనే ప్రతి అమ్మాయి, భవిష్యత్తు వెలుగులతో విరాజిల్లుతుందన్నారు. మం డల విద్యాశాఖ అధికారి బోడం నాయుడు, ఉపాధ్యాయులు, వాసవ్య మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

## ప్రమాదభరితంగా గొయ్యి.. ఆదమరిస్తే అంతే గతి

### చింతపల్లి చౌడుపల్లి మధ్యలో ప్రమాదకరంగా ఏర్పడిన గొయ్యి

చింతపల్లి ఆగస్టు 30 ప్రభాతవార్త



చింతపల్లి నుండి చౌడుపల్లి వెళ్లే మార్గంలో వంతెన వద్ద కోతకు గురై కొయ్యి అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ మార్గం ద్వారా ప్రతిరోజు చౌడుపల్లి, జెరెల తదితర గ్రామాలతో పాటు పాడేరు ప్రాంతాలకు వెళ్లేవారు ప్రయాణారాలు కొనసాగిస్తుంటారు. చింతపల్లి స్మశాన వాటిక వద్ద ఉన్న వంతెన ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. దీంతో ప్రమాదకరంగా పెద్ద గొయ్యి ఏర్ప డింది. ఈ మార్గం ద్వారా ప్రయాణం సాగిస్తున్న వాహన చోదకులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందోనని భయాందోళనలకు గురవుతున్నారు. గొయ్యి ఏర్పడిన ప్రాంతంలో ఎటువంటి హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. ప్రమాదము అని గ్రహించిన కొందరు స్థానికులు కేవలం ఒక ప్లాస్టిక్ కవర్ను గుర్తుగా మాత్రమే ఉంచారు. మండల కేంద్రంలోని ఈ ప్రమాదకర పరిస్థితి ఉన్నప్పటికీ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు గాని, ఇతర అధికారులు గాని ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో వాహన చోదకులు అసహనంతో పాటు ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తున్నారు. రాత్రి సమయాల్లో వాహనదారులు ఈ గొయ్యిని గమనించక పోతే ప్రమాదా నికి గురయ్యే అవకాశం ఉంది. స్థానిక అధికారులు స్పందించి ప్రమాదాలు జరగడానికి ముందే రక్షణ చర్యలు చేపట్టి ప్రమాదాల నివారణకు అడ్డుకట్ట వేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

## పాడేరు కోర్టులో జాతీయ లోక్ అదాలత్



పాడేరు,ఆగస్టు30,ప్రభాతవార్త

జాతీయ లోక్ ఆదాలత్ సెప్టెంబర్ 13న పాడేరు ప్రథమ శ్రేణి జ్యూడిషల్ కోర్ట్ నందు జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా అధిక కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని పాడేరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, ఏ.రాము పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్ట్ ఆవరణంలో పాడేరు, హుకుంపేట,జీ. మాడు గుల, పెద్దబయలు, ముం చంగి పుట్టు మండలాల పోలీసు అధికారులు మరియు న్యాయవాదులుతో సమావేశం అయ్యారు. పాడేరు పోలీస్ స్టేషన్ సిల్ఐ దీనభంధు, పాడేరు ఎస్ఐ జి.ఎల్. సురేష్, జి.మాడుగుల ఎస్ఐ ఎస్.షణ్ముఖ రావు, ముంచింగిపుట్టు ఎస్ఐ జే.రామకృష్ణ, పెదబయలు ఎస్ఐ కెం.రమణ, హుకుంపేట ఎస్ఐ ఎ.సూర్య నారా యణ, పాడేరు పీ.అండ్ ఈ ఎస్ఐ పీ.లక్ష్మి న్యాయవాదులు, కోర్ట్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు మరో మూడు నెలల పొడిగింపు



### జిల్లా కలెక్టర్, అక్రిడేషన్ కమిటీ చైర్మన్ ఏ.ఎస్.దినేష్ కుమార్

పాడేరు,ఆగస్టు30,ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలలు పాటు పొడిగిస్తున్నట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు శ్రీ హిమాన్షు శుక్ల శుక్రవారం ఆదేశాలు జారీ చేశారని, ప్రస్తుతం ఆగస్టు 31 వరకు అక్రిడిటేషన్ కార్డులు కలిగి ఉన్న పాత్రికేయులకు మాత్రమే మరో మూడు నెలలు, 1 సెప్టెంబర్, 2025 నుండి 30 నవంబర్, 2025 వరకు లేదా నూతన అక్రిడేషన్ కార్డులు జారీ చేసే ప్రక్రియ ఏది ముందు జరిగితే అప్పటివరకు పొడిగింపు ఉత్తర్వులు అమలులో ఉంటాయని సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు ఆదేశాలు జారీ చేశారని జిల్లా కలెక్టర్, డి ఎం ఏ సి చైర్మన్ జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ శనివారం తెలిపారు. జిల్లాలో అక్రిడేషన్ సౌకర్యం కలిగి ఉన్న సంబంధిత యాజ మాన్యాలు వారి సంస్థ పని చేస్తూ ప్రస్తుతం కొనసాగుతున్న వారి జాబితాను జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేసి పొడిగింపు స్టిక్కర్లు పొందగలరని అయన కోరారు.

## పోలవరం నిర్వాసితుల సమస్యలు.. వరద పరిస్థితులు.. డిప్యూటీ సీఎం దృష్టికి...!

కూనవరం, ఆగస్టు 30, ప్రభాతవార్త



పోలవరం నిర్వాసితుల సమస్యలను మరియు విలీన మండలాలు వరదలు ఎదుర్కొం టున్న పరిస్థి తులపై రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కం దుల దుర్గేష్‌కు వినతి పత్రాన్ని అందజేయడం జరిగిం దని కూనవరం మండల పరిషత్ ఉపాధ్యక్షులు బం డారు సాంబశివరావు, జనసేన నాయకులు కుంజా అనీల్, చింతూరు మండల జనసేన అధ్యక్షులు మడివి రాజులు తెలిపారు. విశాఖలో మూడు రోజులపాటు జరుగుతున్న జనసేన విస్తృత స్థాయి సమావేశాలకు ప్రతినిధులుగా వెళ్లడం జరిగింది. విలీన మండలాలలో ముఖ్యంగా నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించడం జరిగింది. మంత్రి దుర్గేష్ మాట్లాడారు. నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలు ముఖ్యంగా ఆర్ అండ్ ఆర్, పునరావాస సమస్యలతో పాటు అన్ని సమస్యలను ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి, త్వరలో సమస్యలన్నీ పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని జనసేన నాయకులకు తెలపడం జరిగింది.

## అరకులో స్త్రీ శక్తి' కార్యక్రమానికి పోటెత్తిన మహిళలు

### భారీ సంఖ్యలో హాజరై కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలిపిన నారీమణులు - స్త్రీ శక్తి కార్యక్రమంలో టిడిపి అరకు నియోజకవర్గ ఇన్చార్జి, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర

అరకు రూరల్, ఆగస్టు 30బీ ప్రభాతవార్త




తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గ ఇన్చార్జి, ఏపిఎస్ఆర్టిసి విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర ఆధ్వర్యంలో అరకులో నిర్వహించిన స్త్రీ శక్తి కార్యక్రమానికి మహిళలు పోటెత్తారు. అనుకోని రీతిలో భారీ సంఖ్యలో హాజరై కూటమి ప్రభుత్వ విధానాలకు మద్దతు తెలిపారు. చంద్రబాబు అంటూ జై కొట్టారు. భారీ వర్షాలు ఉన్న వాటిని లెక్కచేయకుండా మరి స్త్రీ శక్తి కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరై వారి మద్దతును తెలపడం విశేషం. అరకు వేలి మండలం పద్మాపురం పంచాయతీ ఓ ప్రైవేటు అతిథి గృహం లో దొన్ను దొర ఆధ్వర్యంలో శనివారం స్త్రీ శక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలో ఉన్న ఆరు మండలాల నుంచి భారీ సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. 6 వేలకు పైబడి మహిళలు ఈ కార్యక్రమానికి హాజరవ్వడం విశేషం. కూటమి ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందుతున్న మహిళలు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా హాజరై చంద్రబాబు ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్, అరకు నియోజకవర్గం ఇంచార్జ్ దొన్ను దొర మాట్లాడుతూ ఆడబిడ్డలను అక్కా చెల్లెమ్మలను సామాజికంగా ఆర్థికంగా పైకి తీసుకొచ్చి వారి కాళ్లపై వాళ్లు సొంతంగా వ్యాపారాలు చేసుకుని ఎదగాలన్నదే తెలుగుదేశం పార్టీ విధానమని తెలిపారు. మహిళల ఆర్థిక పురోభివృద్ధికి కృషి చేసింది చంద్రబాబు మాత్రమేనని తెలిపారు. నాడు డ్వాక్రా సంఘాలను, నేడు సంక్షేమ పథకాలతో వారి ఆర్థిక పరిపుష్టికి కృషి చేస్తున్నది ఆయనేనని మరోసారి ఆయన పేర్కొన్నారు. 6 మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మహిళ కార్యకర్తలు, అత్యధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



## డ్రా ద్వారా బార్లు కేటాయింపు

అనకాపల్లి, ఆగస్ట్ 30, ప్రభాతవార్త

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన నూతన బార్ విధానం 2025-28లో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డ్రా ద్వారా బార్లు కేటాయింపు జరిగింది. నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధిలో 2, ఎలమంచిలి మునిసిపాలిటి పరిధిలో 1 బార్, జనరల్ కేటగిరిలో గీత కులాలుకు ఒక బార్ నోటిఫై చేయడం జరిగింది. దీనికి దరఖాస్తు చేసుకొనే ప్రక్రియ తేది 29న ముగియగా.. నర్సీపట్నం మునిసిపాలిటి పరిధిలో కేటాయించిన రెండు బార్లకు ఒక దరఖాస్తు కూడా నమోదు కాలేదు. ఎలమంచిలి మునిసిపాలిటి పరిధిలో ఒక జనరల్ బార్‌కు గాను 4 దరఖాస్తులు వచ్చాయి. గీత కులాలకు కేటాయించిన బార్‌కు 4 దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. ఎలమంచిలి మునిసిపాలిటి పరిధిలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు డ్రా తీసి ఎన్నికైన వారికి బార్‌లు మంజూరు చేయడం జరిగిందని డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్, ఎక్సైజు ఆఫీసర్ వి.సుధీర్ తెలిపారు. నర్సీపట్నంకు మళ్లీ రీ నోటిఫై చేయడం జరుగుతుందని తెలిపారు.

## వ్యవసాయ రంగంపై విద్యార్థులకు అవగాహన..

### వినూత్న ప్రయోగంలో ఆదర్శ విద్యాసంస్థలు..!

(నక్కపల్లి, ప్రభాతవార్త)



రైతే దేశానికి వెన్ను ముక్క.. ఆ రైతు కష్టించి పండిస్తే కడుపు నిండుతుంది.. అనే మాట ఈనాటికి అందర్నీ జీవితాల్లో వెలుగుగా కనిపిస్తుంది. అటువంటి వ్యవసాయరంగాన్ని ఏ ఒక్కరు నిర్లక్ష్యం చేయకూడదని ఉద్దేశంతో బాల్య దశ నుంచే వ్యవసాయ రంగంపై ఆసక్తి పెంచుకోవాలి అనే నినాదంతో ఎస్.రాయవరం మండలం అడ్డు రోడ్డులో ఉన్న ఆదర్శ విద్యాసంస్థలు ఒక వినూత్న ప్రయోగానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఆ పాఠశాలలో చదువుతున్న అవగాహన కలిగిన విద్యార్థులందరూ పొలంపాటు బాట పట్టారు. సంస్థల అధినేత నల్లపు రాజు సీతా రామరాజు (రామరాజు) ఆధ్వర్యంలో మండలంలోని పెద్ద గుమ్ములూరు- రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న పొలాల్లోకి అడుగుపెట్టారు వరి నాట్లు ఏ విధంగా చేస్తారు.



## ఒడిమెట్ట వినాయకుని దర్శించుకున్న ఎంపీడీవో "దెందుకూరి"

(నక్కపల్లి, ప్రభాతవార్త)

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రసిద్ధి చెందిన మండలంలోని ఒడ్డిమెట్ట వినాయకుని ఆలయంలో ఎంపీడీవో దెందుకూరు సీతారామరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి గోత్రనామాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆశీర్వచనం ఇచ్చారు.

## రైతు నేస్తం నరేంద్ర మోడీ

(నక్కపల్లి ,ప్రభాతవార్త)



ఖరీఫ్లో రైతులకు సకాలంలో ఎరువులను పంపిణీ చేసేటట్లు అన్ని ప్రాంతాల్లో చేసిన ఏర్పాట్లును బట్టి మరోసారి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రైతు నేస్తం అనిపించుకున్నారని కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవిరాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్ అన్నదాతలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు మాధవ్‌ల ఆధ్వర్యంలో సకాలంలో యూరియా అందించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోడీకి రైతన్నల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ నేడు గంగవరం పోర్టుకు 10,350 మెట్రిక్ టన్నులు సెప్టెంబర్ మొదటి వారంలో 30,000 వేల మెట్రిక్ టన్నులు కాకినాడ పోర్టుకు దిగుమతి చేసుకునే అవకాశం కల్పించారని అన్నారు. ఇందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పార్లమెంట్ సభ్యులు సీఎం రమేశ్, బీజేపీ అధ్యక్షుడు పీ వి న్ మాధవ్ లకు ధన్యవాదాలు తెలిపారు. ఒక బస్తా కి సుమారు 1300 వందల రూపాయల సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం భరించి రైతులకు అందించిన యూరియాను వ్యవసాయతర అవసరాల కోసం దారి మళ్లించకుండా కట్టడి చేయాలని అధికారులను విజ్ఞప్తి చేశారు.



## ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

(నక్కపల్లి, ప్రభాతవార్త)

గిడుగు రామ మూర్తి పంతులు జన్మదినం సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్నదొడ్డిగల్లు నందు శుక్రవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత సత్య దేవ శర్మ, పిఎసిఎస్ అధ్యక్షులు వెలగా శ్రీనివాస రావు, పాఠశాల కమిటీ వైస్ చైర్మన్ బాబ్జి, ప్రధానోపాధ్యాయులు బాలాజీ ఆధ్వర్యంలో ముందుగా రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. గామస్తులు సత్యదేవ శర్మ, పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు వేణు గోపాల శర్మ, ప్రసన్నలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏడిద వెంకట రమణ, ప్రసాద్, సాంబ, శ్రీనివాస్, పద్మ, సునీత, జనని పాల్గొన్నారు.

## గణేష్‌ను అభినందించిన హెూం మంత్రి "అనిత"

(నక్కపల్లి, ప్రభాతవార్త)



అమెరికాలో అక్టోబర్ 12 నుంచి జరగనున్న పారా వాలీబాల్ వరల్డ్ కప్‌కి ఎంపికైన క్రీడాకారుడు అన్నం గణేష్‌ను రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత అభినందించారు. ఎస్.రాయవరం మండలంలోని సోముదేవపల్లికి చెందిన గణేష్ నక్కపల్లి మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి అనిత గణేష్‌కు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. చిన్ననాటి నుంచే పారా స్పోర్ట్స్‌పై ఆసక్తితో కృషి చేస్తూ ఉన్న గణేష్ జాతీయజట్టుకు ఎంపిక కావడం గర్వ కారణమని మంత్రి పేర్కొన్నారు. పారా వాలీబాల్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి మంచి పేరు తీసుకురావాలంటూ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ సహాయాన్ని కూడా అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

## అక్రమంగా ఇంటి నిర్మాణం జరగలేదు

అనకాపల్లి, ఆగస్ట్ 30, ప్రభాతవార్త

పిసినికాడ పంచాయతీ సర్వే నెంబర్ 21/2 లో అక్రమంగా ఇంటి నిర్మాణం జరిగిందనే ఆరోపణల్లో నిజం లేదని గ్రామానికి చెందిన డి.లక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన బుద్ధ ప్రవీణ్ చేసిన ఆరోపణలు సరికాదని, సదరు స్థలంలో తాము 30 ఏళ్లుగా ఇంటిని నిర్మించుకుని నివాసం ఉంటున్న విషయం గ్రామస్తులందరికీ తెలిసిందేనని అన్నారు. 30 ఏళ్లుగా ఇంటిపన్ను, విద్యుత్ పన్నులు చెల్లిస్తున్నామని, గతంలో ప్రభు త్వం తమకు కేటాయించిన స్థలం అని అన్నారు. రెవెన్యూ, సర్వే అధికారులు వచ్చి తమ వద్ద ఆధారాలు పరిశీలించి వాస్తవం తెలుసుకున్నారని అన్నారు. తమకు సర్వే నెంబర్ 640/1లో 25 సం.లు నుండి ఉన్న పాత ఇల్లు శిథిలం కావడం వలన పడగొట్టి నిర్మించడం జరిగిందని, ప్రవీణ్ చేస్తున్న ఆరోపణలలో వాస్తవం లేదని వివరణ ఇచ్చారు.

## పాయకరావుపేట వాసి నిహాల్‌కు శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ సీటు

పాయకరావుపేట, అగస్టు 30 ప్రభాతవార్త



పట్టణానికి చెందిన గోడత తబిత నిహాల్ ఈ ఏడాది మే నెలలో జరిగిన నీట్ (మెడిసిన్ జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష) పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించి శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలలోఎంబిబిఎస్ (మెడిసిన్) సీటు సాధించారు. ఈ ఏడాది నీట్ రాసిన విద్యార్థుల్లో పాయకరావుపేట నుంచి తబిత నిహాల్ మాత్రమే అర్హత పొం రిమ్స్ ప్రభుత్వ వైద్య కళాశాలలో మెడిసిన్ సీటు సాధించి సత్తా చాటారు. పట్టణంలోని సాయి నగర్ కు చెందిన గోడత తబిత నిహాల్ పట్టణంలోని కనొస్సా ఇంగ్లీషు మీడియం స్కూల్లో 10వ తరగతి విద్యాభ్యాసం సాగించి 600 మార్కులకు 600 సాధించి రికార్డు సృష్టించారు.తుని పట్టణంలోని శ్రీ చైతన్య జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివిన నహాల్ 1000 మార్కులకు 978 మార్కులు లభించగా ఆ కళాశాల ద్వితీయ ర్యాంక్ సాధించారు. అహర్నిశలు కష్టపడి చదివి శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించిన తబిత నిహాల్ ను ఆమె తల్లిదండ్రులు, మేనమామలు వరిగేటి చంద్రశేఖర్,వరిగేటి శ్రీకాంత్ సురేష్ (హెల్త్ డిపార్ట్ మెంట్), కుటుంబ సభ్యులు సహా సమీప బంధువులు, స్నేహితులు తదితరులు అభినందించారు.

## మండల స్థాయిలోనే భూ సమస్యల పరిష్కారం

గొలుగొండ ఆగస్టు 30, ప్రభాతవార్త



మండలంలో భూ సమస్యల పై అందిన ఫిర్యాదులను ప్రతి శని వారం భూ సమస్యలు పరిష్కార వేదికలో పరిశీలిస్తే తగిన పరిష్కారం చూపుతున్నామని తహశీల్దార్ బి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్‌లో నిర్వహించిన పరిష్కార వేదికలో కొంగ సింగి గ్రామం నుండి భూ సమస్యపై అందిన ఫిర్యాదు పై ఇరువర్గాలను విచారించారు.ఇరు వర్గాలు పరస్పర సహకారం అందిస్తే సమస్యలు పరిష్కారం జరుగుతుందని లేనిపోని అపోహలకు పోయి వివాదాలు పడవద్దు అన్నారు. పోలీస్,రెవెన్యూ, మండల పరిషత్ సంయుక్త కమిటీ ద్వారా ప్రతి శనివారం సమస్యలు పరిష్కార వేదిక నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. కార్యక్రమంలో తాహశీల్దార్ పి శ్రీనివాసరావు,ఇంచార్జ్ ఎంపీడీవో బాబురావు,ఎస్ ఐ రామారావు పాల్గొన్నారు.

## అయ్యన్న చొరవతో కాపీ పొడి తయారీ కేంద్రానికి స్థలం కేటాయింపు

మాకవరపాలెం, ఆగస్టు 30, ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చొరవతో శెట్టిపాలెంలో నిర్మించ తలపెట్టిన కాఫీ పౌడర్ తయారీ కేంద్రానికి రెవెన్యూ అధికారులు భూమి కేటాయించారు. ఈ మేరకు శనివారం అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్( కాఫీ) సిహెచ్ విశ్వనాథం, డి ఈ వంశీ తో కలిసి మాకవరపాలెం తాసిల్దార్ బి.వెంకటరమణ కాఫీ పౌడర్ తయారీ కేంద్రానికి సూచించిన భూమిని పరిశీలించారు. గిరిజన కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టే కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌కు తాసిల్దార్ 12 ఎకరాల భూమిని అధికారులకు అప్పగించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాడేరు పర్యటనలో భాగంగా శెట్టిపాలెంలో కాఫీ పౌడర్ తయారీ కేంద్రం శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే అన్నారు. త్వరలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా శెట్టిపాలెంలో జిసిసి ఆధ్వర్యంలో కాఫీ పౌడర్ తయారీ కేంద్రం భూమి పూజ చేసి పనులు ప్రారంభించనున్నట్లు అల్లు నాయుడు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ తాసిల్దార్ నూకరాజు, సర్వేర్లు శ్రీకాంత్, అనూష తదితరులు పాల్గొన్నారు.

## విద్యా విధానం మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు పనిచేయాలి : జిల్లా విద్యాశాఖ అధికారి గుడ్డి అప్పారావు

అగనంపూడి ప్రభాతవార్త



విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ పనితీరు మార్చుకోవాలని అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావు నాయుడు అన్నారు. లంకెలపాలెం లో నిర్వహించిన ఉపాధ్యాయుల క్లస్టర్ సమావేశం ఆయన మాట్లాడారు. టీచర్ హ్యాండ్ బుక్ తో ఉపాధ్యాయులు పనితీరు తెలుస్తుందని అలాగే అసెస్మెంట్ పుస్తకం ప్రతి విద్యార్థి తరగతి ఆరంభంలో ఏడాది ముగింపులో వచ్చిన మార్పు తెలుస్తుంది అన్నారు. అన్ని పరీక్షలు ఒకే పుస్తకం ఉండడం వల్ల విద్యార్థులు ప్రగతి అర్థం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ ఎస్ సి ఆర్ మూర్తి, హెచ్ఎం రైతు నాగేశ్వరరావు, శ్రీనాథ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## మై హెూమ్ సిమెంట్ ఫ్యాక్టరీలో రక్తదాన శిబిరం....

ఎలమంచిలి ,ఆగస్టు 30, ప్రభాతవార్త



మండలంలోని మూలకలాపల్లి గ్రామంలోగల మై హెూమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (సిమెంట్ ఫ్యాక్టరీ) స్థాపించి నేటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భముగా ఎన్టీఆర్ ట్రస్ట్ విశాఖపట్నం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు ఫ్యాక్టరీ యూనిట్ హెడ్ బి రామస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు కార్మికులు పాల్గొని సుమారు 80 మంది రక్తదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డిజిఎం (పి ఎన్ ఎ) ఎల్ శ్రీనివాసరావు, ఓహెచ్సి ఇంచార్జ్ బి రాజు, ఎన్టీఆర్ ట్రస్ట్ డాక్టర్ సత్యనారాయణ, ఫ్యాక్టరీ ఉద్యోగులు కార్మికులు పాల్గొన్నారు.

## సబ్ జైల్‌ను సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి పి విజయ..

ఎలమంచిలి ,ఆగస్టు 30,ప్రభాతవార్త



పట్టణంలో గల సబ్ జైలును సీనియర్ సివిల్ జడ్జ్ పి విజయ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సబ్ జైల్లో ఉన్న ముద్దాయిలను వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి విజయ మాట్లాడుతూ ముద్దాయిలకు ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యానర్ లాయర్స్ బి హరి శంకర్ రావు, పివి రమణ, కోర్టు సిబ్బంది, జైల్ సూపర్డెంట్ ప్రసాదరావు పాల్గొన్నారు.

## మాల సామాజిక వర్గంపై కత్తిగట్టిన రాజకీయ పార్టీలు

### రాక్స్, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు రత్నాకర్

అనకాపల్లి, ఆగస్ట్ 30, ప్రభాతవార్త



తెలుగు రాష్ట్రాలలో మాల సామాజిక వర్గం పై రాజకీయ పార్టీలు కక్ష కట్టాయని రాక్స్, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు రత్నాకర్ విమర్శించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ, దళితుల ఐక్యతపై దేశ వ్యాప్తంగా మోడీ, బిజెపి కుట్ర చేస్తున్నాయని, ఈ కుట్రలో భాగస్వామి చంద్రబాబు నాయుడు అని అన్నారు. చంద్రబాబు మాల సామాజిక వర్గంపై పగబట్టేసి తొక్కేసే కార్యక్రమాన్ని భుజాన్ని వేసుకుని నడిపిస్తున్నాడని అన్నారు. దళితులను ముఖ్యంగా మాలలను హెూల్ సేల్ గా వాడుకున్నటువంటి హెూల్ సేల్ మేనమామ జగన్మోహన్ రెడ్డి దీనిపై కనీసం నోరు మెదపకపోవడం, ఈనాటికి తన స్టాండ్ ఏంటో చెప్పకపోవడం, అత్యంత బాధాకరమని అన్నారు. కులాన్ని మతాన్ని రెచ్చగొట్టి ఈ దేశాన్ని విభజించి, దేశాన్ని అమ్ముకునే పనిలో మోడీ పడ్డారని, మోడీ అతని గుజరాతి పరివారం మొత్తం, ఎలక్షన్ కమిషన్ పావుగా వాడుకుని దొంగతనంగా గెలిచి, పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. రిజర్వేషన్ పేరుతో ఎంగిలి మెతుకులు పడేసి, అందులో వాటాల కోసం కొట్టుకు చావండి అనే ఉద్దేశంతోనే ఈ ఎస్సీ వర్గీకరణ తెరపైకి తేవడం జరిగిందని అన్నారు. అపూర్వ సహెూదరులు, గురు శిష్యులు అయిన చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి ఇద్దరు కూడా మాల సామాజిక వర్గం పై సాధిస్తున్న కక్ష సాధింపు విషయంలో ఇకనైనా పునర్ ఆలోచన చేసుకోవాలని, ఎస్సీ వర్గీకరణ తప్పును వెనక్కి తీసుకోవాల్సిందేనని, తెలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎస్సీ వర్గీకరణ టెంపరరీ మాత్రమేనని అన్నారు. శాంతియుత నిరంతర పోరాటం, పార్లమెంట్లో అమెండ్మెంట్ చేసేవరకు, ఇప్పుడు ఇచ్చిన ఏడుగురు జడ్జిల తీర్పును 11 జడ్జిలు, అంతకన్నా ఎక్కువ జడ్జిలతో ఈ తీర్పును పునః సమీక్షించేంతవరకు ఈ నిరంతర శాంతియుత పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో కొత్తపల్లి శ్రీనివాస్, అంగుళూరు ఈశ్వర్, రేపాక మధుబాబు, బొలిమి వినోద్ కుమార్, షేక్ జిలాని, టి సుబ్బారావు నెల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు నిత్యావసరాలు అందజేత

విశాఖపట్నం ఆగస్టు 30 ప్రభాతవార్త



అక్కయ్యపాలెం ఎన్‌జి జీవోస్ కాలనీ శబరి కుటీర్ బృందావనంలోగల కోన కుంచయ్య చారిటబుల్ కార్యాలయ ప్రాంగణంలో మేనేజింగ్ ట్రస్టీ కోన జగదీశ్వరరావు సారధ్యంలో వారి తండ్రి కుంచయ్య 15వ వర్థంతి సందర్భంగా కలాసీలకు, వాచ్మెన్లకు, కూలీలకు, నిరుపేదలకు మొత్తం 150 మందికి నిత్యావసరాలను అందజేశారు. వీరు గత 14 సంవత్సరాలుగా కోన కుంచయ్య చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టు తరుపున లోకకళ్యాణార్థం నూతనంగా నిర్మించిన విభిన్న దేవాలయాల ప్రతిష్టలకు విగ్రహాలను కూడా అందజేశారు. అంతేగాక దారిద్యరేఖలో ఉన్న ఎంతోమంది నిరుపేద విద్యార్థులకు "విద్యావికాస్" పేరున స్కూల్ ఫీజులను చెల్లించి వారికి పుస్తకాలను దుస్తులను కూడా అందజేశారు. ట్రస్టు సభ్యులు అప్పలరాజు, మురళీకృష్ణ, కృష్ణ కళ్యాణి, యోజనరాణి, కృష్ణకుమారి, లక్ష్మి సత్యవతి, కుశాల్, కుసుమేష్, పూర్ణ రామేశ్వరి, రోహిత్, చైతన్యకృష్ణ రవికుమార్ పాల్గొన్నారు .

## రెస్క్యూ చేసిన యాచకుల ఆధార్ వివరాలు తెలుసుకునేందుకు ప్రత్యేక కార్యక్రమం

### - పరిశీలించిన నగర సిపి శంఖబ్రత బాగ్చి

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి జ్యోతిర్గమయ కార్యక్రమం ద్వారా, విశాఖ మహానగరంలో భిక్షాటన చేస్తున్న 243 యాచకులను రెస్క్యు చేసి, వారికి నగరంలో పలు ఆశ్రమాలలో ఆశ్రయం కల్పించిన విషయం విధితమే.243 మంది యాచకులలో వారి బంధువులకు, ఆశ్రయాల నిర్వాహకులకు అప్పగించగా మిగిలి ఉన్న 128 మంది యాచకులకు శనివారం నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు నగర పోలీసులు, ఏయుటిడి జీవీఎంసీకు సంబంధించిన డే అండ్ నైట్ హెూం లెస్ షెల్టర్ ఆధ్వర్యంలో, ఆధార్ సేవా కేంద్రం, ద్వారకా నగర్ సహాయంతో యాచుకులకు ఆధార్ ఉన్నదీ, లేనిదీ , వేలి ముద్రల ఆధారంగా, ఆధార్ కార్డు వివరాలు తెలుసుకొని వారిని వారి బంధువులతో రీయూనియన్ చేసే నిమిత్తం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలియజేసిన వివరాల ద్వారా వెరిఫికేషన్ చేశారు. సీపీ సదరు కార్యక్రమానికి విచ్చేసి వెరిఫికేషన్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు.

## పోలీస్ శాఖలో సుదీర్ఘ సర్వీస్ చేయడం ఎంతో గొప్ప విషయం

### విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



పోలీస్ శాఖలో సుదీర్ఘ సర్వీస్ చేయడం ఎంతో గొప్ప విషయమనీ విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. నగర పోలీసు శాఖలో విధులు నిర్వర్తించి, ఉద్యోగ విరమణ చేసిన ఇద్దరు ఎస్.ఐలు ,ముగ్గురు ఏ.ఎస్.ఐలు, ఉమెన్ ఏ.ఎస్.ఐ, ఎ.ఆర్.హెచ్.సి లను నగర ఆయన శనివారం సత్కరించి, పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. పదవీ విరమణ పొంది సత్కరించబడిన వారిలో ఎస్సైలు డి.రాము, ఎమ్. అన్వరాల్ హక్, ఏఎస్సైలు పి.ఆది నారాయణ,జి.అప్పలరాజు, పి.బాబూరావు, డి.అరుణ కుమారి, ఏ ఆర్‌హెచ్‌సి ఏ.లోకేశ్వర రావుల కుటుంబ సభ్యులతో పోలీస్ కమిషనర్ మాట్లాడారు.పోలీస్‌శాఖలో 40 ఏళ్ళ కు పైగా సుదీర్ఘ సర్వీస్ చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు, సిబ్బందికి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలుపుతూ, వారి కుటుంబ సభ్యులు, పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో సత్కరించి వీడ్కోలు తెలిపారు.

## తొలిసారిగా జరిగిన బెంగాల్ వారియర్జ్ బీచ్ కబడ్డీ లీగ్

విశాఖపట్నం, ఆగస్టు 30, ప్రభాతవార్త




వైజాగ్‌లో తొలిసారిగా జరిగిన బెంగాల్ వారియర్జ్ బీచ్ కబడ్డీ లీగ్‌ను చంద్రపాలెంకు చెందిన జిల్లా పరిషత్ హైస్కూల్ గెలుచుకుంది. గోపాలపట్నంకు చెందిన ఎస్.వి.ఎల్.ఎన్.జెడ్.పి హైస్కూల్ (బాలురు మరియు బాలికలు) బెంగాల్ వారియర్జ్ బీచ్ కబడ్డీ లీగ్ బాలుర, బాలికల టోర్నమెంట్‌లో రన్నరప్‌గా నిలిచారు. పికెఎల్ సీజన్ 12లో వారి ప్రారంభ ఆటకు ముందు, వైజాగ్‌లోని పాఠశాలల కోసం బెంగాల్ వారియర్జ్ చాలా ఆలోచనాత్మకమైన ఆనందించే చొరవను రూపొందించింది, ఇది మొట్టమొదటి బెంగాల్ వారియర్జ్ బీచ్ కబడ్డీ లీగ్‌ను నిర్వహించింది. ఈ పోటీ వైజాగ్‌లోని ఐకానిక్ ఆర్‌కె బీచ్‌లో జరిగింది. బీచ్‌లో వరుసగా జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లు ఉత్కంఠభరితమైన పోటీల తర్వాత, చంద్రపాలెం, మధువాడ నుండి వచ్చిన జిల్లా పరిషత్ హైస్కూల్ బాలుర మరియు బాలికల పోటీలలో టైటిల్‌ను గెలుచుకుంది. రెండు ఫైనల్స్‌లోనూ, చంద్రపాలెం, మధువాడలోని జిల్లా పరిషత్ హై స్కూల్ గోపాలపట్నం నుండి ఎస్ వి ఎల్ ఎన్ జెడ్పి హై స్కూల్ (బాలురు మరియు బాలికలు) తో తలపడింది. బాలికల ఫైనల్‌లో చంద్రపాలెం, మధువాడలోని జెడ్.పి.హెచ్ 50-11 తేడాతో గెలిచింది, మరియు బాలుర ఫైనల్‌లో వారు 37-12 తేడాతో గెలిచారు.

## జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)




జాతీయ న్యాయ సేవాధికార సంస్థ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ అమరావతి ఆదేశానుసారంగా శనివారం చైర్మన్-కం-జిల్లా ప్రధాన న్యాయమూర్తి, చాంబర్స్‌లో చిన్నంశెట్టి రాజు, జుడీషియల్ అధికారులతో భౌతికంగా, అన్ని మండలాల జుడీషియల్ అధికారులతో వర్చువల్గా ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ, పెండింగ్ కేసుల పరిష్కారంలో లోక్ అదాలత్ కీలక పాత్ర పోషిస్తాయన్నారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించి, కక్షిదారులకు లోక్ అదాలత్ ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలని ఆయన జుడీషియల్ అధికారులను ఆదేశించారు. అన్ని కోర్టులు జుడీషియల్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు జిల్లాలో 13-09-2025 జరగనున్న జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఎక్కువ కేసులను పరిష్కరించడానికి కృషి చేయాలని జుడీషియల్ అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని న్యాయస్థానాల జుడీషియల్ అధికారులు, న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఆర్. సన్యాసి నాయుడు పాల్గొన్నారు. లోక్ అదాలత్ను విజయవంతం చేసి, ఎక్కువ కేసులను పరిష్కరించాలని జిల్లా జడ్జి ఆకాంక్షించారు.

## చెట్టుకు ఉరివేసుకొని ఐటిబిపి కానిస్టేబుల్ ఆత్మహత్య

( విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



ఉరివేసుకొని ఐటిబిపి కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని 56వ బెటాలియన్ ఐటీబీపీ హెడ్‌క్వార్టర్స్‌లో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు జిల్లా ధోనే మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన జగదల నరేంద్ర నాథ్ (32), 2014లోకానిస్టేబుల్‌గా నియమితులై మండలంలోని పందలపాకలో గల 56వ బెటాలియన్ యూనిట్‌లో కానిస్టేబుల్‌గా( జీడి) విధులు నిర్వహిస్తున్నాడు కాగా. శుక్రవారం సాయంత్రం 6 గంటల నుండి గార్డుగా విధులు నిర్వహిస్తుండగా, సుమారు 7.35 గంటలకు బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్‌లోని మామిడి చెట్టుకు నైలాన్ వైర్‌తో ఉరివేసుకొని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారుబెటాలియన్ అధికారి సంఘటనా స్థలాన్ని పరిశీలించి అక్కడికక్కడే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ విషయంపై బెటాలియన్ ఇన్‌ఛార్జి సూరజ్ ప్రకాష్ జోషి ఆనందపురం పోలీసులకు సమాచారం అందించారని. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు ఈ మేరకు కేసు నమోదు చేసి సిఐ సిహెచ్ వాసనాయుడు ఆధ్వర్యంలో ఎస్సై జిసంతోష్ దర్యాప్తు చేస్తున్నారు.

## మంచినీటి డ్యామ్‌లో వినాయక విగ్రహాల నిమజ్జనం నిషేధం

### మేగాద్రిగెడ్డ డ్యామ్ చుట్టూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన పోలీసులు

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని మేగాద్రిగెడ్డ డ్యామ్ మంచినీటి వనరుగా ఉన్నందున, ఆ డ్యామ్‌లో వినాయక విగ్రహాల నిమజ్జనం చేయరాదనీ పెందుర్తి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె.వి సతీష్ కుమార్ డ్యామ్ చుట్టూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పోలీసుశాఖ నుంచి స్పష్టమైన ఉత్తర్వులు జారీ అవ్వడంతో ఎవరు ఈ నిబంధనను ఉల్లంఘించి డ్యామ్‌లో విగ్రహాలను నిమజ్జనం చేసినా, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయనీ హెచ్చరించారు..అందువల్ల ప్రజలందరూ గమనించి, పోలీసులకు సహకరించవలసిందిగా, అలాగే మంచినీటి డ్యామ్ కలుషితం కాకుండా కాపాడవలసిందిగా కోరారు.

## కేంద్రకారాగారంలో కొనసాగుతున్న విచారణ

ఆరిలోవ, ఆగస్టు 30, ప్రభాతవార్త



గతంలో విధులు నిర్వహించి సస్పెండ్ కు గురైన జైలు పర్యవేక్షణ అధికారి కిషోర్ కుమార్, అదనపు పర్యవేక్షణ అధికారి వెంకటేశ్వరరావు, డీఎస్పీ కమలాకర్, వార్డెర్ వాసుదేవరావుపై విచారణ జరుగుతుంది. విచారణలో భాగంగా శనివారం గుంటూరు డిఐజి వరప్రసాద్, కడప సూపర్డెంట్ రాజేశ్వరరావు ఒక బృందంగా వచ్చి విశాఖ కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక సమావేశంలో విచారణ జరుపుతున్నారు. తదుపరి వచ్చిన నివేదికను జైల్ డీజీపీకి తెలియపరచి నున్నారని, మరో రెండు రోజులపాటు విచారణ జరగనున్నట్లు అదనపు పర్యవేక్షణ అధికారి ప్రవీణ్ తెలిపారు.

## వినాయక చవితి ఉత్సవాల్లో ఘనంగా అన్నసంతర్పరణ

ఆరిలోవ, ఆగస్టు 30, ప్రభాతవార్త



గణపతి ఉత్సవాల్లో భాగంగా జివిఎంసి 13వ వార్డు పాండురంగ పురం, వెర్నిదుర్గ నగర్ స్థానిక సంఘ సభ్యులు ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం కమిటీ సభ్యులు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ పాల్గొని వారి చేతుల మీదుగా ప్రసాదాన్ని అందజేశారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బాలరాజు, వడిసెల శ్రీను, మాధవ్ సాహు తదితరులు పాల్గొన్నారు.

## అధ్వాన్నంగా మారిన గొలగానివారి కళ్లాల రోడ్డు, అవస్థలు పడుతున్న రైతులు

పద్మనాభం, ఆగస్టు 30, ప్రభాతవార్త



మండలంలో పొట్నూరు గ్రామ గొలగాని వారి కళ్లాల రోడ్డు అధ్వాన్నంగా ఉన్న మారడంతో రైతులు, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పొట్నూరు గ్రామం నుండి ఇసుకల పాలెం వరకు ఉన్న సుమారు మూడు కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా అడుగడుగున గోతులు పడింది. దీంతో ఆయా గ్రామాల రైతులు, ప్రజలు రాత్రి, పగలు ఈ గోతుల వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు.వర్షం వచ్చిందంటే పజల గుండెలలో గుబులు రేగుతుంది. ఇలాగున సుమారు పది సంవత్సరాల నుండి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలు ,పాలకులు, అధికారులు ఎందరు మారినా ఈరోడ్డు దుస్థితిని చూడలేదని రైతులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. అప్పటి నుండి నేటి వరకు ఎమ్మెల్యేలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు గోతులకే పరిమితమయ్యాయని ప్రజలు ఆరోపుస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పందించి ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

## మారికవలస జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

### వృద్ధుడి పై నుండి దూసుకెళ్లిన బైకు -అక్కడికక్కడే మృతి

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధి మారికవలస, మెట్రో ఎదురుగా జాతీయ రహదారిని దాటుతున్న వృద్ధుడు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. టిడ్కో హౌసెస్, చాకలిగడ్డ, మధురవాడ ప్రాంతానికి చెందిన పాడి సురేంద్రరావు(74) వాచ్మెన్ గా పనిచేస్తున్నాడు.. ఈ మేరకు శనివారం ఉదయం మారికవలస మెట్రో ఎదురుగా సురేంద్ర రావు జాతీయ రహదారి దాటుతున్నాడు.. ఆ సమయంలో సంతోష్ కుమార్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనం పై అది వేగంగాను, నిర్లక్ష్యంగాను ప్రయాణించి సురేందర్రావు పై దూసుకెళ్లాడు.. దీంతో అతను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు.. ఈ సమాచారాన్ని అశోక్ అనే వ్యక్తి మృతుని కొడుకు పాడి శాంతి రామ్(49) కు తెలియజేశాడు.. వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని చూసేసరికి తన తండ్రి మృతి చెందినట్టు గుర్తించాడు. ఘటనకు గల కారకులపై చర్యలు చేపట్టాలని పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కేజీహెచ్ మార్చురీకి తరలించారు..పీఎం పాలెం సీఐ బాలకృష్ణ నేతృత్వంలోని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తెలుగు టైటాన్స్‌కు రెండో ఓటమి

### 40-35 తేడాతో గెలిచిన యూపీ యోధాస్ -14 పాయింట్లతో యూపీని గెలిపించిన రైడర్ గగన్ గౌడ

విశాఖపట్నం ఆగస్టు 30 ప్రభాతవార్త



ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ ఎడిషన్‌లో ఆతిథ్య తెలుగు టైటాన్స్ వరుసగా రెండో మ్యాచ్‌లో పరాజయం పాలైంది. సీజన్ ఆరంభ మ్యాచ్‌లో కొద్దిలో విజయాన్ని చేజార్చుకున్న టైటాన్స్ వైజాగ్‌లోని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌లో శనివారంక్రవారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో యూపీ యోధాస్ చేతిలో ఓడిపోయింది. రైడర్ గగన్ గౌడ 14 రైడ్ పాయింట్లతో రెచ్చి పోవడంతో యూపీ యోధాస్ 40-35 తేడాతో టైటాన్స్‌ను ఓడించి తొలి మ్యాచ్‌లోనే అద్భుత విజయం అందుకుంది. కెప్టెన్, డిఫెండర్ సుమిత్ (8 పాయింట్లు), మరో రైడర్ గుమన్ సింగ్ (7) కూడా రాణించారు. టైటాన్స్ తరఫున తొలి అర్ధభాగంలో నిరాశ పరిచిన కెప్టెన్ విజయ్ మాలిక్ ద్వితీయార్ధంలో విజృంభించి 14 పాయింట్లతో ఆకట్టుకున్నా జట్టుకు ఓటమి తప్పించలేకపోయాడు. చేతన్ సాహు (4) తప్ప మిగతా ఆటగాళ్లు నిరాశపరిచారు. కాగా, ఆదివారం జరిగే తొలి మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్‌తో యు ముంబా తలపడనుంది. మరో పోరులో బెంగాల్ వారియర్స్-హర్యానా స్టీలర్స్ పోటీ పడతతాయి.

## సెప్టెంబరు 6న అనంతపద్మనాభస్వామి చతుర్దశి

పద్మనాభం, ఆగస్టు 30, ప్రభాతవార్త



పద్మనాభం గ్రామంలో వేంచేసియున్న అనంతపద్మనాభస్వామి చతుర్దశి వేడుకలు సెప్టెంబరు ఆరువ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ ఈ ఒ ఎస్ నానాజీ బాబు అన్నారు.ఎంపీపీ కె.రాంబాబు ఆధ్వర్యంలో కుంతీ మాధవస్వామి ఆలయంలో జరిగిన ఉత్సవ నిర్వాహణ కమిటీ సమావేశం లో ఆయన మాట్లాడారు. ఈ చతుర్దశికి సంబంధించి వ్రతాలను ఎప్పటి లాగే కుంతీమాధవస్వామి ఆలయంలో ఉదయం ఆరు గంటల నుండి నిర్వహిస్తారని చెప్పారు. నాయకులు సన్యాసినాయుడు, పద్దు, ఎర్రినాయుడు, సత్యనారాయణ,పేర్రాజు, సోమేశ్వరరావు,వెంకటరావు, శ్రీనివాసరావు,పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం
వార్త
25 Glorious years

## ఉప ముఖ్యమంత్రి ఓఎస్డి మండలంలో పరిశీలన



బొబ్బిలి ఆగస్టు 30 ప్రభాతవార్త

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కే పవన్ కళ్యాణ్ యొక్క ఆఫీసు ఆన్ స్పెషల్ డ్యూటీ ఎం కృష్ణ తేజ ఐఏఎస్. శనివారం మండలంలో మెట్టవలస పంచాయతీని ముందుగా పరిశీలించి అక్కడ సచివాలయంలో ఉన్న సిబ్బందిని సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అక్కడ మొక్కలు నాటారు. జగన్నాథపురం గ్రామం సచివాలయాన్ని పరిశీలించి సచివాలయం పై కొత్తగా నిర్మించిన డి.ఎల్.డి.ఓ కార్యాలయం పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు ఆయన వెంట బొబ్బిలి శాసనసభ్యులు ఆర్ వి ఎస్ కే రంగారావు ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## యువత గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

### బాడాం పల్లె నిద్ర కార్యక్రమంలో సిఐ శంకర్రావు

మెరకముడిదాం, ఆగస్టు 30 ప్రభాతవార్త



మండలంలో బాడాం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం రాత్రి చీపురుపల్లి సిఐ శంకర్రావు పల్లె నిద్ర చేసి ఈ సందర్భంగా సిఐ శంకర్రావు మాట్లాడుతూ పెద్దలతో యువతతో మమేకమయ్యి యోగక్షేమాలను అడిగి తెలుసుకొన్నారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలను యువతకు వివరించారు. అలాగే సైబర్ నేరాలు వలన నష్టలు వివరించడం జరుగుతుంది. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనాలను డ్రైవింగ్ చేసేవారు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని తెలిపారు. మైనర్ డ్రైవింగ్ లు వలన ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి కాబట్టి పిల్లలకు ద్విచక్ర వాహనాలను నడపడానికి ఇవ్వద్దని తల్లిదండ్రులకు తెలియపరిచారు. వినాయక నవరాత్రులలో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువత తదితరులు పాల్గొన్నారు.

## బెల్టు షాపులే.. సిండికేట్ వ్యాపారానికి వెన్నుముక..

### గ్రామాల వారీగా విచ్చలవిడిగా మద్యం పంపిణీ.. చోద్యం చూస్తున్న అధికారులు..

చీపురుపల్లి ఆగస్టు 30 ప్రభాతవార్త

రైతే దేశానికి వెన్నుముక అనే నినాదం ప్రతి రాజకీయ నాయకుని నోటి వెంట విన్నదే.. అయితే దీనికి భిన్నంగా చీపురుపల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో బెల్ట్ షాపులే గ్రామాలకు సిండికేట్ వ్యాపారులకు వెన్నుముకగా మారిందంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు బెల్ట్ షాపులు పై ఉక్కు పాదం మోపుతాం అంటూ చేసిన ఊకదంపుడు ఉపన్యాసాలు ప్రస్తుతం చీపురుపల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మచ్చుకైనా కానరాకపోవడంతో పలువురు అధికారుల పనితీరును బహిరంగంగా దుయ్యబడుతున్నారు. చీపురుపల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ప్రభుత్వ నిబంధనలతో ఏర్పాటు చేసిన వైన్ షాపుల కంటే గ్రామాల వారీగా విచ్చలవిడిగా పాటలు నిర్వహిస్తూ బెల్ట్ షాపులను ఏర్పాటు చేయడం పట్ల పలువురు పాలకుల పనితీరును కూడా దూయపడుతున్నారు. గ్రామంలో బెల్ట్ షాపు ఏర్పాటు చేయడానికి వేలంపాట నిర్వహించి వేలంపాటలో ఎవరు విజేతగా నిలిస్తే వారు మాత్రమే గ్రామంలో బెల్ట్ షాపును ఏర్పాటు చేసుకోవాలంటూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేస్తున్న పట్ల పలు గ్రామాల ప్రజలు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. బెల్ట్ షాపులు నిర్వహణ కొరకు గ్రామంలో నిర్వహించే వేలం పాటకు వచ్చిన మొత్తాన్ని గ్రామ అభివృద్ధి కొరకు ఖర్చు చేయాలంటూ గ్రామాల వారీగా జరుగుతున్న జెంటిల్మెన్ ఒప్పందాలు కారణంగా పుట్టగొడుగుల బెల్ట్ షాపులు వ్యాపారం కొనసాగుతుందంటూ పలువురు ఆరోపిస్తున్నారు. దీని కారణంగానే ప్రభుత్వ అనుమతులు పొందిన వైన్ షాపులకు చేరుతున్న మద్యం సీసాలను షాపుల దగ్గర అన్లోడింగ్ చేసే ముందే బెల్ట్ షాపులకు అవసరమైన మద్యం సీసాలను ప్రత్యేకంగా వేరుచేసి సిండికేట్ వ్యాపారులు రహస్యంగా వాటిని గ్రామాల వారీగా బెల్టు షాపులకు సరఫరా చేస్తున్నారంటూ పలువురు ఆరోపిస్తున్నారు. పాలకులు కూడా చీపురుపల్లి ప్రధాన కేంద్రంగా జరుగుతున్న అక్రమ సిండికేట్ దందా పైన దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

## మాజీ ఎమ్మెల్యే రోడ్లు పారాధి బ్రిడ్జి దుస్థితికి ప్రధాన కారణం



బొబ్బిలి ఆగస్టు 30 ప్రభాతవార్త

గత వైసిపి ప్రభుత్వంలో అనేక అసమర్థ పాలన చేసి తెలుగు దేశం ప్రభుత్వానికి మాజీ ఎమ్మెల్యే ఎస్ వెంకట చిన్న అప్పల నాయుడు అసమర్థ పాలన ఉండవు ఆయన ఎంతవరకు సమం జసము తెలుసుకోవాలన్నారు. ఐదేళ్ల పాలనలో పారాభివృద్ధి నిర్మించలేక దాని ద్వారా బొబ్బిలి లో ఉన్న రోడ్లన్నీ పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. శనివారం విలేకరు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారాది బ్రిడ్జిలు పక్కన పెడుతూ తాత్కాలిక వంతెన వేసి సొమ్ము చేసుకున్న సంగతి మరిచిపోయారని గుర్తు చేశారు. అల్లాట భాస్కరరావు మున్సిపల్ చైర్మన్ ఆర్ శరత్ బాబుపాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ సూపర్ హిట్ .. స్త్రీ శక్తి విజయోత్సవ సభలో ప్రభుత్వ విప్ జగదేశ్వరి

కురుపాం, ఆగస్ట30 ప్రభాతవార్త



పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం నియోజకవర్గ కేంద్రంలో శనివారం నాడు సూపర్ సిక్స్ సూపర్ హిట్, స్త్రీ శక్తి విజయోత్సవ సభలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శనివారం పాల్గొన్నారు. ముందుగా గుమ్మలక్ష్మీపురం నుండి కురుపాం నియోజకవర్గ కేంద్రం వరకు బస్సులో మహిళలతో కలిసి ప్రయాణం చేశారు. అనంతరం కురుపాం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉన్న స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయం నుండి ధూళికేశ్వర ఆలయం సమీపంలో ఉన్న సభా ప్రాంగణం వరకు మహిళలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. విజయోత్సవ సభలో పాల్గున్నా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్ సిక్స్ లో భాగంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం దశలవారీగా చేసుకుంటూ వస్తుందని అన్నారు. మహిళలందరూ కలిసి ఎమ్మెల్యే జగదేశ్వరి కి ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల కూటమి నాయకులు, నాయకురాలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## గిరిజన మత్స్యకారుల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం విస్మరిస్తోంది : ఎంపీపీ ప్రమీల



పాచిపెంట, ఆగస్ట30 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం వచ్చి సుమారు సంవత్సరం మూడు నెలలు అవుతున్నప్పటికీ, గిరిజన మత్స్యకారులను సబ్సిడీ ద్వారా అందించవలసిన బోట్లు, సేఫ్టీ జాకెట్లు, వలలు అందించే పరిస్థితి లేదనీ ఎంపీపీ బి ప్రమీల ఆవేదన వ్యక్తం చేస్తూ శనివారం ఆమె ఒక ప్రకటనలో తెలియజేశారు. లిపొట్టకూటి కోసం వేటకు వెళ్లిన గిరిజన మత్స్యకారులు ప్రమాదవశాత్తు నాటు పడవలు బోల్తా పడే సమయంలో సేఫ్టీ జాకెట్స్ లేకపోవడంతో జలాశయంలో గల్లంతై మృత్యువాత పడుతున్నారు, ఈ విషయంలో ఒక గిరిజన కులానికి చెందిన మహిళగా ఆవేదన వ్యక్తం చేస్తున్నాను... పెద్ద గడ్డ జలాశయంలో ఇలా వేటకు వెళ్లి ఇప్పటివరకు సుమారు ఆరుగురు వరకు గిరిజన మత్స్యకారులు మృతి చెందారు, గిరిజన మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఇలా గిరిజనులు మృతి చెందడం చాలా బాధాకరం,లిపెద్దగెడ్డ జలాశయానికి సాగునీరు విడుదలకు వచ్చిన మంత్రి సంధ్యారాణి గిరిజన మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉంటానని చెప్పి మాటలు, మూటలుగా మిగిలాయి... ఇప్పటికైనా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పిఓ తక్షణమే స్పందించి గిరిజన మత్స్యకారులకు సబ్సిడీపై బోట్లు, లైఫ్ జాకెట్లు, వలలు అందజేయాలి.

## రక్తదాన శిబిరం విజయవంతం

కురుపాం, ఆగస్ట 30,ప్రభాతవార్త



రక్త దానము చేయుటకు యువత ముందుకు రావాలని కురుపాం తాసిల్దార్ కే జయ అన్నారు. శనివారం కురుపాం మండల కేంద్రంలో రావాడ రోడ్డుజంక్షన్ వద్ద గల ఆర్టీసీ విశ్రాంతి భవనంలో వాయుపుత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమం నకు ముఖ్యఅతిథిగా తశీల్దార్ కె.జయ పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రక్తదానం ఇచ్చేందుకు యువత పెద్ద ఎత్తున ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పార్వతిపురం ఏరియా ఆసుపత్రి డాక్టర్ సుభాష్ రక్తదానం చేయటం వలన ఉపయోగాలు తెలిపారు. రక్తదానంపై అవగాహన ఉండాలని సూచించారు. వాయుపుత్ర సేవా సంఘం నిర్వాహకులు బోటు అనిల్ కుమార్ మాట్లాడుతూ రక్తదాన శిబిరంలో యువకులు రక్తదానం చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కురుపాం సిహెచ్సి ల్యాబ్ టెక్నీషియన్ అనిల్, ప్రముఖ వ్యాపారవేత్త కొత్తకోట రవీంద్ర కుమార్, వాయుపుత్ర సేవా సంఘం సభ్యులు .ప్రదీప్ కుమార్, సుమన్, కిరణ్,స్వాతి, మౌళి, బోటు మణికంఠ పాల్గొన్నారు.

## కుటుంబ అభివృద్ధిలో మహిళలదే కీలక పాత్ర



పాచిపెంట,ఆగస్ట 30,ప్రభాతవార్త

కుటుంబం ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందాలంటే మహిళలదే కీలక పాత్ర అని కృషి విజ్ఞాన కేంద్రం రక్త కుంట భాయ్ గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త శ్రీమతి ఉమా జ్యోతి అన్నారు . మండల కేంద్రమైన పాచిపెంట మండల వ్యవసాయ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూగిరిజన మహిళలు ఆర్థిక అభివృద్ధికి పలు సూచనలు అందించారు. పదిమంది గిరిజన మహిళలు వచ్చినట్లయితే వారికి చిరుధాన్యాలు వాటి ఉత్పత్తులు విలువల పెంపు అలాగే అటవీ ఉత్పత్తులకు విలువల జోడింపు వంటి పలు అంశాలపై ఉచితంగా శిక్షణ ఇస్తామని గ్రామైక్య లేదా మండల సమక్షల ద్వారా కృషి విజ్ఞాన కేంద్రానికి దరఖాస్తులు పెట్టుకోవచ్చని తెలిపారు. చింతపండు బ్లాక్ ల తయారీ తేనెటీగల పెంపకం చిరుధాన్యాలతో కురుకురే బిస్కెట్లు తయారీ వంటి వాటిపై కూడా పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తామని కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి తిరుపతిరావు శతాభి సర్పంచ్ రామయ్య పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలను లోకేష్ దృష్టికి తీసుకెళ్లాను : ఎమ్మెల్యే



శృంగవరపుకోట,ఆగస్టు30,ప్రభాతవార్త.

ఎస్.కోట నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బాబు దృష్టికి తీసుకెళ్లేనని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు.విశాఖలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి లోకేష్ బాబును ఎమ్మెల్యే కోళ్ల శనివారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు.ఈసందర్భంగా నియోజకవర్గ సమస్యలు,జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు లోకేష్ కు వివరించారు.అలాగే ఎస్.కోట నియోజకవర్గంకు చెందిన టీడీపీలో ఒక సామాన్య కార్యకర్త అయిన దాసరి కార్పొరేషన్ చైర్మన్ గా పొట్నూరు వెంకట రత్నాజీకు అవకాశం కల్పించినందుకు మంత్రి లోకేష్కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## అధినేత పవన్ను కలిసిన వబ్బిన..



శృంగవరపుకోట,ఆగస్టు30,ప్రభాతవార్త

విశాఖలో రాష్ట్ర డిప్యూటి సీఎం,జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నేతృత్వంలో మూడు రోజుల పాటు నిర్వహించిన జనసేన పార్టీ విశృత స్థాయి సమావేశ కార్యక్రమంలో భాగంగా అధినేత పవన్ కళ్యాణ్ ను ఎస్.కోట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ వబ్బిన సత్యనారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు.నియోజకవర్గ పార్టీ స్థితి గతులను అలాగే పలు సమస్యలను పవన్ దృష్టికి వబ్బిన తీసుకెళ్లారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని అధినేత పవన్ వబ్బినకు సూచించినట్లు సమాచారం. ఈకార్యక్రమంలో పలువురు నియోజకవర్గ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఫ్రీ బస్సు పథకాల వలన నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



### సాలూరు రూట్ నుండి ఎఆర్వో ఆఫీస్ వరకు ర్యాలీ - ధర్నా

రామభద్రపురం, ఆగస్టు30,ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఫ్రీ బస్సు సౌకర్యం వలన ఆటో డ్రైవర్లకు కిరాయిలు లేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో కార్మికుల సంఘం అధ్యక్షులు బలస శ్రీను, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు లోకేష్ ,రామ కృష్ణ ,వెంకటేష్, సోములు, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆగస్టు 30 శనివారం ఉదయం 9 గంటలక రామభద్ర పురం సాలూరు జంక్షన్ ఎమ్మార్వో ఆఫీస్ వరకు ప్రదర్శన ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. కరోనా వల్ల ఆర్థికంగా దెబ్బతిని దినదిన గండంగా జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లకు ఫ్రీ బస్సు పథకం మరింత నష్టాన్ని తీసుకువచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ లైసెన్స్ కలిగిన ప్రతి ఆటో డ్రైవర్ కు సంవత్సరానికి 25000 ఆర్థిక సాయం అందించాలి, వెల్ఫేర్ బోర్డుని ఏర్పాటు చేయాలి, ఆర్.టి.ఒ. చలానాలు తగ్గించాలి. అని డిమాండ్ చేశారు. రామభద్ర పురం గాంధీ బొమ్మ దగ్గర ప్రదర్శన ధర్నాను ఆటో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నావారు మురళి,రాజు, అప్పారావు, లంక మురళి పాల్గొన్నారు.

## మూల్యాంకన పుస్తకాలలో మూల్యాంకనం అన్ని పాఠశాలలో నిర్వహించాలి

రామభద్రపురం, ఆగస్టు30,ప్రభాతవార్త



రామభద్రపురం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రామభద్రపురం క్లస్టర్ టీచర్స్ సమావేశం క్లస్టర్ ప్రధానోపాధ్యాయులుగా స్థానిక రామభద్రపురం జడ్పీహెచ్ఎస్ స్కూల్ హెచ్ఎం. వి గోపాల్ నాయుడు నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి-1 ఏ తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ"ఒక కొత్త శకానికి ఈ సంవత్సరం విద్యాశాఖ నాంది పలికిందని మూల్యాంకన పుస్తకాలలో విద్యార్థుల ఎఫ్ ఏ వన్-1 మూల్యాంకనం చేసి ఆన్లైన్లో మార్కులను గ్రేడ్లను అప్లోడ్ చేయాలని ఇది ఎంతో చక్కని విధానమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు-ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు ప్రారంభ ఉపన్యాసంతో ప్రారంభమై, విషయాల వారి నమూనా పాఠ్యాంశం, పదవ తరగతి బ్లూ ప్రింట్, మూల్యాంకన పుస్తక నిర్వహణ వంటి అంశాలలో ఎస్ సిఈ ఆర్ టి వారు ఇచ్చిన యూట్యూబ్ సమాచారం ద్వారా ఉపాధ్యాయులు అనేక విషయాలను శిక్షణ రూపంలో తెలుసుకున్నారు. తదుపరి సమావేశపు ప్రణాళికతో ఈ కార్యక్రమం ముగిసింది. దాదాపు అన్ని పాఠశాలలు తమ పరిధిలోని మూల్యాంకదాన్ని ఆన్లైన్ చేశాయని క్లస్టర్ హెచ్ఎం గోపాల్ నాయుడు సభకు తెలిపారు. వారి వెంట సీనియర్ ఉపాధ్యాయులు శర్మ , ఆర్ ప్రభాకర్ రావు, శ్రీమతి దమయంతి, కే దాలినాయుడు మొదలైన వారు ఉన్నారు.

## రాజకీయ ప్రయోజనాల కోసమే రిజర్వేషన్లు పాటించుటలేదు.. జిల్లా సామాజిక న్యాయ ఉద్యమ వేదిక కన్వీనర్ గంటానా..

చీపురుపల్లి ఆగస్టు 30 ప్రభాతవార్త



రాజకీయ ప్రయోజనాల కోసమే దళిత వర్గాలను అనగ దుక్కుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను సైతం ఏ ఒక్కరు పాటించడం లేదని జిల్లా సామాజిక న్యాయ ఉద్యమ వేదిక కన్వీనర్ ఘంటానా అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నాడు ఆయన విలేకరులతో మాట్లాడుతూ చీపురుపల్లి మండలంలో రావివలస గ్రామానికి పంచాయితీగా ఆవిర్భవించి నేటికీ 40 సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ ఇప్పటివరకు ఆ పంచాయతీకి సంబంధించి ఎటువంటి పదవులు ఎస్సీ రిజర్వేషన్ కల్పించలేదని ఆయన అన్నారు. అగ్రకుల రాజకీయ నాయకుల ప్రయోజనం చేకూర్చడం కోసం ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన దళితులకు అన్యాయం చేస్తూ రిజర్వేషన్ ప్రక్రియను కనీసం కొనసాగించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత 50 సంవత్సరాలుగా ఒక వర్గానికి సంబంధించిన కులస్తులే రాయవలస పంచాయతీని పరిపాలిస్తున్నారని ఆయన ఆరోపించారు. చీపురుపల్లి మండలంలో అలజంగి పంచాయతీకి సంబంధించి రెండుసార్లు నిమ్మలవలస పెద్ద నడిపల్లి పంచాయతీలకు కూడా రెండేసి సార్లు రిజర్వేషన్ కల్పించి దళితులకు అవకాశం ఇచ్చారన్నారు. రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా అధికారులు పాలకులు ఇష్టారాజ్యంగా పరిపాలన చేస్తే దళిత సామాజిక వర్గం తరపున న్యాయపోరాటానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆయన హెచ్చరించారు.

## సేనతో సేనాని సభకు విశాఖ తరలి వెళ్లిన పార్టీ శ్రేణులు



నెల్లిమర్ల, ఆగస్టు 30, ప్రభాతవార్త

జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విశాఖపట్నం పర్యటనలో భాగంగా శనివారం నిర్వహించిన 'సేనతో సేనాని' కార్యక్రమానికి నెల్లిమర్ల మండలం తో పాటు నగర పంచాయతీ నుంచి పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. కార్లు, ద్విచక్ర వాహనాలకు జనసేన జెండాలు తగిలించి ర్యాలీగా తరలి వెళ్లారు. పార్టీ నాయకులు చనమల్లు వెంకటరమణ, కరుమజ్జి గోవిందరావు, ఎడ్ల గోవిందరావు, పతివాడ అప్పలనాయుడు, గదల అచ్చం నాయుడు, పతివాడ గోవిందరావు లతోపాటు నగర పంచాయతీ నాయకులు గంట సతీష్, అప్పికొండ రవికుమార్, రవ్వ నాని, ఎం ఎం నాయుడు, జనా ప్రసాద్, మాత మురళీ మోహన్, అవనాపు మురళీకృష్ణ, సుంకర ముత్యాల నాయుడు, డొంక కృష్ణతో పాటు వందలాది మంది కార్యకర్తలు తరలి వెళ్లారు.

## విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించాలి



గరివిడి ఆగస్టు,30 ప్రభాతవార్త

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి పి రామారావు సూచించారు. మండలంలోని గరివిడి, కాపుశ %శీ%భాము,వెదుళ్ళవలస, కోనూరు, తొండ్రంగి స్కూల్ కాంప్లెక్స్ ల క్లస్టర్ సమావేశాలు నిర్వహించారు. సమావేశంలో మండలం లో గల పాఠశాల ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి : జిల్లా ఎస్పీ



బొబ్బిలి, ఆగస్టు 30 ప్రభాతవార్త

బొబ్బిలి పోలీస్ స్టేషన్ను శుక్రవారం జిల్లా ఎస్పీ సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామని, ఐదు కోట్ల వరకు గంజాయి వ్యాపారం చేస్తున్న వారి ఆస్తులను జప్తు చేశామని, ముమ్మందు వీటిపై ప్రత్యేక నిఘా ఎక్కడకక్కడే ఏర్పాటు చేశామని అన్నారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడమే నా యొక్క ధ్యేయమని అన్నారు. నేరాలు సంఖ్య జిల్లాలో చాలావరకు తగ్గుముఖం పట్టిందని అన్నారు. జిల్లాలో క్రైమ్ రేట్ తగ్గించే విషయంలో ప్రతి ఒక్క పోలీస్ స్టేషన్ సిబ్బంది కృషి చేస్తున్నారని అన్నారు. బొబ్బిలి డిఎస్పీ భవ్యశ్రీ, సిఐ కటకం సతీష్ కుమార్ ఆధ్వర్యంలో బొబ్బిలి పోలీస్ స్టేషన్ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టాయని అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటానని అన్నారు. సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. బొబ్బిలి పోలీస్ స్టేషన్లో మెన్ పవర్ తక్కువగా ఉందని దీనిపై విలేకరులు ఆయనను ప్రశ్నించగా కొత్తగా నియామకం చేపట్టి జిల్లాలో ఉన్న ప్రతి స్టేషన్కు మెన్ పవర్ పెంచుతామని అన్నారు.

## రిమాండ్ ఖైదీలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ

బొబ్బిలి, ఆగస్టు 30 ప్రభాతవార్త

ఇక"మీదట రిమాండ్ ఖైదీలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ చేపట్టనున్నట్లు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి అనుగుణంగా ప్రతి సబ్ జైల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా జైలు శాఖ అధికారి జి.మధుసూదన రావు అన్నారు. శుక్రవారం బొబ్బిలి సబ్ జైలును తనిఖీ చేసిన అనంతరం విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా చెప్పారు. జిల్లాలో బొబ్బిలి, చీపురుపల్లి, పార్వతీపురం, ఎస్ కోట. విజయనగరంలో సబ్జైలులో 150 మంది విచారణ ఖైదీలు ఉన్నారని అన్నారు. సారిక గ్రామం వద్ద స్థల పరిశీలన జరిగిందని జిల్లా కలెక్టర్ స్థలాన్ని మాకు అప్పజెప్పితే జైలు శాఖ నుంచి నిధులు మంజూరు చేయించి వాటిని నిర్మిస్తామని అన్నారు. బ్రిటిష్ వాళ్ళ వద్ద నుంచి వస్తున్న ఈ జైలును ఆధుని కరించడం చాలా కష్టతరం అవుతుందని దీనిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఇవ్వాలని, సుప్రీంకోర్టులో న్యాయ వాదులు చేసిన పోరాటమే ఈ జైలు నిర్మాణం ప్రత్యేకత సంతరించుకుందన్నారు. బొబ్బిలిలో 5 ఎకరాలలో సెంటర్ వద్ద సబ్ జైలు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నమని ఆయన తెలియజేశారు. మధుసూదనరావుది స్వస్థలం బొబ్బిలి కావడంతో నేను ఎక్కడ నుంచే జిల్లాస్థాయి అధికారిగా వెళ్లడం నాకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. రిమాండ్ ఖైదీలను వర్చువల్ ద్వారా విచారణ చేయడం వలన తమ శాఖకు పోలీస్ శాఖ ఏ విధమైన రిస్క్ జరగదని ఖైదీని కోర్టుకు తీసుకెళ్లడం రిస్క్తో కూడిన పని అని, ఖర్చు తదితర అంశాలతో ఈ కార్యక్రమం ముడిపడి ఉందని దీనిపై ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుందని అన్నారు.

## ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గిరిజన మహిళకు ప్రసవం

బొబ్బిలి, ఆగస్టు 30 ప్రభాతవార్త:

స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గిరిజన మహిళ ప్రసవానికి ఆమె పెద్ద కూతురే పూర్తి సహకారాలు అందజేసింది. శుక్రవారం మండలంలో రొంపిల్లి పామాయిల్ తోటలో తోటమాలిగా ఉన్న దుబ్బాక పార్వతి ప్రసవ నొప్పులతో బొబ్బిలి ఆటోపై వచ్చి స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు దిగి అనంతరం నొప్పులు అధికమవ్వడంతో ఆమె పెద్ద కుమార్తె తల్లి ప్రసవానికి పరిచర్యలు చేయడం చూపర్లను ఆలోచింపజేసింది. పార్వతికి నలుగురు ఆడపిల్లలు ఒక మగ సంతానం ప్రస్తుతానికి ఆడ సంతాన కలగడంతో ఆ కుటుంబం తబ్బిబ్బైపోతుంది. స్థానిక ఎంపీడీవో కార్యాలయం చెట్లు వద్ద ఈ కార్యక్రమం జరగడంతో విలేకరులు 108 వాహనానికి ఫోన్ చేసి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో జాయిన్ చేశారు. పార్వతికి ఆసపత్రి వైద్యులు జి.శశిభూషణరావు ఆరవ కాన్పుకు సహకారం అందజేసి తల్లి బిడ్డలు క్షేమంగా ఉంచగలిగారు. ఇకముందు కూడా పూర్తి ఆరోగ్యం కలిగేవరకు పౌష్టికాహారం అందజేసి తల్లి బిడ్డలను సురక్షితంగా ఇంటికి పంపిస్తామన్నారు.

## గరమ్ గరమ్గా మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

### సులబ్ కాంప్లెక్స్ లేక మహిళలు ఇబ్బందులు - మంత్రి సంధ్యారాణి ఆదేశాలు బేఖాతరు -పట్టణ అభివృద్ధి పనులపై సమాచారం లేదు

సాలూరు ఆగస్ట 30 ప్రభాతవార్త



సాలూరు పట్టణ మున్సిపల్ కౌన్సిల్ హాల్ లో శనివారం ఉదయం చైర్ పర్సన్ ఈశ్వరమ్మ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు.ముందు గా కౌన్సిలర్లు అజెండా లోని ముఖ్య అంశాలను చర్చించారు. అందులో భాగంగా నియోజవర్గం మహిళ లు పట్టణంలో సులబ్ కాంప్లెక్స్ నాన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పలు వార్డుల్లో అభివృద్ధి పనులు కోసం మంత్రి సంధ్యారాణి అప్పుగా తీసుకువచ్చిన 2 కోట్లు నిధులతో ఏ వార్డులలో అభివృద్ధి పనులు చేపట్టారో నేటి వరకు కౌన్సిలర్లకు ఎందుకు చెప్పలేదో అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా పలు అంశాలపై కౌన్సిల్ సాధారణ సమావేశం వాడివేడిగా జరిగింది. కమీషనర్ రత్నకుమార్,వైస్ చైర్మన్ అప్పలనాయుడు,గిరిరఘు,రాపాక. మాధవరావు,మున్సిపల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి



నెల్లిమర్ల, ఆగస్టు 30, ప్రభాతవార్త

గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని, విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఎంపీడీవో పప్పు సుదర్శనం ఆదేశించారు. ఆయన శనివారం మండలంలోని రామతీర్థం తంగుడుబిల్లి సారిపల్లి గ్రామ వార్డు సచివాలయాలను ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను, ఉద్యోగుల హాజరు పట్టిని పరిశీలించారు. వారితో మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరుకావాలని ఉదయం 10 గంటలకు కార్యాలయం తెరిచి ఉంచాలని సూచించారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank
ప్రాంతీయ కార్యాలయం : విజయనగరం
రికవరీ సెక్షన్, పాత బాలాజీ జంక్షన్, రింగ్ రోడ్డు, విజయనగరం-535002.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
శ్రీ రెడ్డి శివ, తండ్రి : రెడ్డి రమణ, C-46, పెద్ద వీధి, కోరుకొండ గ్రామం, విజయనగరం మండలం, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్-535214.
డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సర్ఫేసి చట్టం, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ 30 రోజుల ప్రకటన.

కెనరా బ్యాంక్, పూల్భాగ్ బ్రాంచ్ తరుపున విజయనగరం ప్రాంతీయ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సదరు సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13 (8) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది.

లోను అకౌంట్ ఋణగ్రహీత/సంస్థ శ్రీ రెడ్డి శివ (ఋణగ్రహీత) ఋణగ్రహీత, తనఖాదారు మరియు హామీదారులు (పైన తెలుపబడిన పేర్లు) వారిని బకాయి రూ. 4,60,774.18 (అక్షరాల నాలుగు లక్షల అరవై వేల ఏడు వందల డెబ్బై నాలుగు రూపాయలు మరియు పద్దెనిమిది పైసలు మాత్రమే) మరియు వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ చట్టం నందలి సెక్షన్ 13(2) క్రింద 16.05.2025 వ తేదిన డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో మీరు విఫలమైనందున కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి తేది.06.08.2025న మీ సెక్యూర్డ్ ఆస్తులను చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక / భౌతిక స్వాధీనం తీసుకున్నారు మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును ఆంధ్రప్రభ (తెలుగు) & ది హిందూ (ఇంగ్లీష్) వార్తాపత్రికలలో తేది.08.08.2025న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది.28.08.2025 నాటికి చెల్లించవలిసిన బకాయి రూ. 4,67,882.17 (అక్షరాల నాలుగు లక్షల అరవై ఏడు వేల ఎనిమిది వందల ఎనభై రెండు రూపాయలు మరియు పదిహేడు పైసలు మాత్రమే) + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు సర్ఫేసీ చట్టం, 2002 నందలి రూల్ 8(6) క్రింద ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది.(ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు వారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటి. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు. చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

స్థిరాస్తి వివరములు:
విజయనగరం జిల్లా, విజయనగరం ఎస్ఆర్ఓ, విజయనగరం మండలం, కోరుకొండ గ్రామం, పెద్ద వీధి వద్ద సర్వే నెం.101 నందు మొత్తం స్థలం విస్తీర్ణం 138.36 చ॥గ॥లు లోని ప్లింత్ ఏరియా 1170 చ॥అ॥లుతో అసెస్మెంట్ నెం.131, డోర్ నెం.1-131 మరియు ఎలక్ట్రిసిటీ బిల్ నెం. 121121R125000431 తో ఉన్న ఆర్సిసి స్లాబ్ భవనం. ప్లాట్ నెం.245 కొలతలు: తూర్పు నుండి పడమర : 17 అ॥లు లేదా 5.18 మీటర్లు, ఉత్తరం నుండి దక్షిణం : 73 ½ అ॥లు లేదా 22.32 మీటర్లు. హద్దులు : తూర్పు : యండుకుర్తి సన్ని బాబు గారి ఆస్తి, దక్షిణం : డ్రైనేజ్, పడమర : బందుర రమా గారి ఆస్తి, ఉత్తరం : సిసి రోడ్డు. టైటిల్ హోల్డర్: శ్రీ రెడ్డి శివ.

తేది: 29.08.2025, ప్రదేశం: విజయనగరం సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank
ప్రాంతీయ కార్యాలయం : విజయనగరం
రికవరీ సెక్షన్, పాత బాలాజీ జంక్షన్, రింగ్ రోడ్డు, విజయనగరం-535002.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1. M/s శ్రీ ఆదిత్య మినరల్ వాటర్ ప్లాంట్, ప్రొప్రయిటర్ : కుసుకు శోభరాణి, భర్త : వెంకటరావు, ఇంటి నెం.1-86, గుంకలం, చీపురుపల్లి, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్-535003.
2. శ్రీమతి కుసుకు శోభ రాణి, భర్త: వెంకటరావు, ఇంటి నెం.1-86, గుంకలం, చీపురుపల్లి, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్-535003.
3. శ్రీ. కుసుకు రాము (హామీదారు కమ్ తనఖాదారు), తండ్రి : లేటు కుసుకు పెంటయ్య, డి నెం. C-108, కుసుకు వీధి, గుంకలం గ్రామం, చీపురుపల్లి, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్-535003.
డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సర్ఫేసి చట్టం, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ 30 రోజుల ప్రకటన.

కెనరా బ్యాంక్, పూల్భాగ్ బ్రాంచ్ తరుపున విజయనగరం ప్రాంతీయ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సదరు సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13 (8) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది.

లోను అకౌంట్ ఋణగ్రహీత/సంస్థ M/s శ్రీ ఆదిత్య మినరల్ వాటర్ ప్లాంట్, ప్రొప్రయిటర్ : కుసుకు శోభరాణి (ఋణగ్రహీత) మరియు శ్రీ కుసుకు రాము (హామీదారు మరియు తనఖాదారు) ఋణగ్రహీత, తనఖాదారు మరియు హామీదారులు (పైన తెలుపబడిన పేర్లు) వారిని బకాయి రూ.6,97,172.15 (అక్షరాల ఆరు లక్షల తొంభై ఏడు వేల నూట డెబ్బై రెండు రూపాయలు మరియు పదిహేను పైసలు మాత్రమే) మరియు వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ చట్టం నందలి సెక్షన్ 13(2) క్రింద 16.05.2025 వ తేదిన డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో మీరు విఫలమైనందున కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి తేది.06.08.2025న మీ సెక్యూర్డ్ ఆస్తులను చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక / భౌతిక స్వాధీనం తీసుకున్నారు మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును ఆంధ్రప్రభ (తెలుగు) & ది హిందూ (ఇంగ్లీష్) వార్తాపత్రికలలో తేది.08.08.2025న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది.28.08.2025 నాటికి చెల్లించవలిసిన బకాయి రూ.7,25,289.84 (అక్షరాల ఏడు లక్షల ఇరవై ఐదు వేల రెండు వందల ఎనభై తొమ్మిది రూపాయలు మరియు ఎనభై నాలుగు పైసలు మాత్రమే) + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు సర్ఫేసీ చట్టం, 2002 నందలి రూల్ 8(6) క్రింద ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది.(ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు వారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటి. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు. చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

స్థిరాస్తి వివరములు:
టైటిల్ హోల్డర్: శ్రీ కుసుకు రాము. విజయనగరం జిల్లా, విజయనగరం వెస్ట్ ఎస్ఆర్ఓ, విజయనగరం మండలం, గుంకలం గ్రామం వద్ద సర్వే నెం.280/2 నందు విస్తీర్ణం ఎకరా 0.46 సెంట్లు లేదా 2226.40 చ॥గ॥లులోని ఖాళీ స్థలం. హద్దులు : తూర్పు : బలగం అప్పల నాయుడు గారి పల్లపు భూమి, దక్షిణం : బలగం రమణ గారి పల్లపు భూమి, పడమర : రాస్తా, ఉత్తరం : లెంక సత్యం గారి పల్లపు భూమి.

తేది: 29.08.2025, ప్రదేశం: విజయనగరం సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
వార్త 26
ఆదివారం 31, ఆగస్టు 2025




# శ్రీ మయూరేశ గణపతిగా సంపత్ వినాయక

విశాఖపట్నం, ఆగస్టు 30 ప్రభాతవార్త

శ్రీ సంపత్ వినాయక శనివారం శ్రీ మయూరేశ గణపతి గా భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జాము నుండి అభిషేకాలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం నారాయణ సేవలో సుమారు 2000 మంది పాల్గొన్నారు. సాయంత్రం సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.

## సగటు మనిషి ఆవేశం నుంచి పుట్టిందే

# జనసేన

**11 ఏళ్ల ప్రయాణంలో కుటుంబం, సినిమాలు కంటే పార్టీ పైన దృష్టి పెట్టా -పూర్తిగా స్ట్రైక్ రేటుతో చరిత్ర సృష్టించాము -ఈ కూటమి అనేక సంవత్సరాలు ఉండాలి -క్రియాశీల కార్యకర్తల రాజకీయ -ఎదుగుదల కోసం కృషి 'త్రిశూల్ ' -క్షేత్రస్థాయిలో ఉండే వీర మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇస్తాం -విశాఖ సభలో పవన్ కళ్యాణ్ వెల్లడి**








12లో

# చరిత్రలో నిలిచిపోయే పార్టీ- తెలుగుదేశం..

**ఎన్టీ రామారావు ఒక వ్యక్తి కాదు- ఒక శక్తి! -బస్సులో ప్రయాణించిన మంత్రి "అనిత".. అడ్డురోడ్డు జంక్షన్ వద్ద టీ తాగుతూ స్థానికులతో ముచ్చటించిన మంత్రి" అనిత"**



నక్కపల్లి, ప్రభాతవార్త

భారతదేశ చరిత్రలో నిలిచిపోయే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని ఆ పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు ఒక వ్యక్తి కాదని శక్తిని రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని వేంపాడు టోల్ ప్లాజా సమీపంలోని భారతీ కన్వెన్షన్‌లో శనివారం ఏర్పాటుచేసిన స్త్రీ శక్తి కార్యక్రమాన్ని రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా ప్రారంభించారు. ముందుగా మంత్రి అనిత వేంపాడు టోల్ ప్లాజా నుండి అడ్డురోడ్డు వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించి, సామాన్య ప్రజలతో కలిసిపోయారు. అనంతరం అడ్డురోడ్డు జంక్షన్ వద్ద టీ తాగుతూ స్థానికులతో ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా ముందుగా జరిగిన కార్యక్రమంలో మంత్రి అనిత మాట్లాడుతూ నేను మహిళా పక్షపాతిని. మహిళలు నా అభిమానులు కాదు - నా అక్కచెల్లెల్లమ్మలు అన్నారు. చాలా పార్టీలు వచ్చాయి, వెళ్లాయి. కానీ చరిత్రలో నిలిచిపోయే పార్టీ తెలుగుదేశం పార్టీ మాత్రమే అని చెప్పారు. ఎన్టీ రామారావు ఒక వ్యక్తి కాదు - ఒక శక్తి అని, ఎందరో జీవితాల్లో వెలుగులు నింపిన మహానుభావుడు అన్నారు. మహిళలు రాజకీయాల్లో రాణించేందుకు ఎన్టీఆర్ స్ఫూర్తి ముఖ్యమైనదన్నారు. మహిళలు సంతోషంగా ఉంటే సమాజ వ్యవస్థ బాగుంటుంది. వారు సంపాదిస్తే కుటుంబ అభివృద్ధి వేగవంతమవుతుందన్నారు. ఉచిత బస్సు పథకం మహిళలకు ఎంతో ఉపయోగపడుతోందని చెప్పారు. అన్నా క్యాంటీన్లు ఐదు రూపాయలకే భోజనం అందించేవి అని, కానీ గత ప్రభుత్వ హయాంలో వాటిని తొలగించడం దురదృష్టకరమన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు వివిధ రంగాల్లో రాణిస్తున్నారని, వారికి సబ్సిడీ రుణాలు అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం ఆస్తులను తాకట్టు పెట్టి ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేసిందని, అయినప్పటికీ ఎన్డీయే ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారిస్తోందని చెప్పారు. ఈగల్ వ్యవస్థ ద్వారా 12వ పేజీలో

# రేపు వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ విశాఖ రాక

విశాఖపట్నం, ఆగస్టు 30, ప్రభాతవార్త

రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ సెప్టెంబర్ 1 ఉదయం నగరానికి చేరుకొంటారు. ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు కె.జి.హెచ్‌లో కాంప్రహెన్సివ్ క్యాన్సర్ సెంటర్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అనకాపల్లి వెళతారు. అనకాపల్లిలో స్థానిక కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు మాడుగుల చేరుకొని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రారంభం కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రికి విశాఖపట్నం చేరుకుని బస చేస్తారు. 2వ తేదీ ఉదయం విజయవాడ బయలుదేరి వెళ్తారు.

# విశాఖపట్నం కస్టమ్స్ బ్రోకర్స్ అసోసియేషన్ నూతన ఆఫీస్ బేరర్ల





12లో

# జనసేన తీర్థం పుచ్చుకున్న మాజీ ఎమ్మెల్యే రెహమాన్

**డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానం**



12లో

# సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



విశాఖపట్నం, ఆగస్టు 30 ప్రభాతవార్త

నియోజకవర్గంలో వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి రూ.4.62 లక్షలు విలువ చేసే చెక్కులను ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే శనివారం అందజేశారు. తాళ్లజ్జుల వెంకట సత్య శ్రీ రామ్మూర్తికి రూ.2 లక్షలు, కర్రి ఎర్రిబాబుకు రూ.90 వేలు, మహ్మద్ గౌస్ షరీఫ్‌కు రూ.51 వేలు, అనారోగ్యంతో మృతి చెందిన కోరాడ అప్పలరాజు కుటుంబానికి రూ.51 వేలు, కడియంశెట్టి అన్నపూర్ణ కుటుంబానికి రూ.40 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా గంటా పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, కూటమి నాయకులు గంటా నూకరాజు, పిల్లా వెంకట్రావు, మొల్లి లక్ష్మణరావు, తాట్రాజు అప్పారావు, బి.ఆర్.బి. నాయుడు, నాగోతి సత్యనారాయణ, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా విభాగం సంస్థగతంగా బలోపేతం కావాలి..

**విశాఖ ఉత్తర నియోజకవర్గ మహిళా విభాగం ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న కె.కె రాజు**



విశాఖపట్నం, ఆగస్టు 30 ప్రభాతవార్త

వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ మెంబర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ మహిళా విభాగం ఆత్మీయ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో విశాఖపట్నం జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షులు, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు విశాఖ పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నాటి ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలలో, నామినేటెడ్ పదవుల్లో ఎక్కువ శాతం మహిళలకే పెద్ద పీట వేసారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఈరాష్ట్రంలో ఉన్న మహిళలకు మోసపూరిత హామీలు ఇచ్చి ముఖ్యంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళలకు ప్రతి నెల 1500 రూపాయలు ఇస్తామని, ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల సంక్షేమము విషయంలో కక్ష పూరితంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. రానున్న రోజుల్లో మహిళా విభాగం సంస్థగతంగా బలోపేతం కావాలని పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈసమావేశంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, 55వార్డు కార్పొరేటర్ కె.వి.యన్ శశికళ,రాష్ట్ర మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి శ్రీదేవి,జిల్లా అధికార ప్రతినిధి మంచ నాగమల్లీశ్వరి,వార్డు మహిళ అధ్యక్షురాల్లు, నియోజకవర్గ మహిళ నాయకురాల్లు తదితరులు పాల్గొన్నారు.

# రుషికొండ భవనాలపై ప్రభుత్వం కసరత్తు

**ముగ్గురు మంత్రులతో కమిటీ ఏర్పాటు**



12లో

# 'సేనాతో సేనాని' అద్భుతమైన కార్యక్రమం

**దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్**

విశాఖపట్నం, ఆగస్టు 30 ప్రభాతవార్త

జనసేన పార్టీ మూడు రోజులు పాటు విశాఖలో సేనాతో సేనాని అద్భుతమైన కార్యక్రమం నిర్వహించిందని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఈ నిర్వహించే అవకాశం ఇప్పించిన పవన్ కళ్యాణ్ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జనసేన పార్టీకి పవన్ కళ్యాణ్ విత్తనము వేస్తే దాన్ని జనసైనికులు మహా వృక్షంగా తీర్చిదిద్దారు అని చెప్పారు. నగరంలో గత 5రోజులుగా వర్షం పడుతున్న మున్సిపల్, పోలీసు అధికారులు సభ విజయవంతానికి సహకరించారు. అందరికి ధన్యవాదాలు తెలియజేశారు.



# వన్డే, టి-20ల్లో.. సిక్సర్ తెలియని స్టార్స్

## ఒక్కటి కూడా కొట్టని ప్లేయర్స్

**న్యూఢిల్లీ:** వన్డే, టీ20 క్రికెట్ అంటేనే సిక్సర్లు, ఫోర్లు కొట్టడం. అటువంటి ఈ ఫార్మాట్లలో ఇప్పటివరకు ఒక్క సిక్స్ కూడా కొట్టని టీమిండియా ప్లేయర్లు కూడా ఉన్నారు. వన్డే, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో ఒక్క సిక్స్ కూడా కొట్టని ముగ్గురు దిగ్గజ భారత క్రికెటర్లు ఉన్నారు. టీమిండియా చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ భారత జట్టు తరపున టెస్ట్, వన్డే, టీ20 అంతర్జాతీయ క్రికెట్ మూడు ఫార్మాట్లలో ఆడుతున్నాడు. టెస్ట్ క్రికెట్‌తో తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌ను ప్రారంభించిన కుల్దీప్ ఇంకా వన్డే, టీ20లలో ఒక్క సిక్స్ కూడా కొట్టలేదు. కుల్దీప్ యాదవ్ వన్డేలలో 113 మ్యాచ్‌లు, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 40 మ్యాచ్‌లు ఆడాడు. అలాగే యుజ్వేంద్ర చాహల్ 2016లో భారత జట్టు తరపున వన్డేల్లో అరంగేట్రం చేశాడు. అప్పటి నుంచి చాహల్ బ్యాటింగ్ కోసం తనకు లభించిన అన్ని బంతుల్లోనూ సిక్స్ కొట్టలేకపోయాడు. అతను ఇప్పటివరకు టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 13 బంతులు ఆడాడు. వన్డేల్లో 141 బంతులు ఎదుర్కొన్నాడు. మరో ప్రత్యేకత ఏమిటంటే చాహల్ లిస్ట్ ఏ, ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మొత్తం 3 సిక్స్‌లు కొట్టాడు. అతను ఒడిఐ, టి20లలో కలిపి మొత్తం 152 మ్యాచ్‌లు ఆడాడు. అతనికి ఇంకా టెస్ట్‌లలో అవకాశం రాలేదు. యుజ్వేంద్ర చాహల్ ఆగస్టు 2023లో భారత జట్టు తరపున తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. ప్రస్తుతం టీమ్ ఇండియాకు దూరంగా ఉన్నాడు. ఇక ఇషాంత్ శర్మ ఇప్పటివరకు భారత జట్టు తరపున టీ20 అంతర్జాతీయ, వన్డే క్రికెట్‌లో ఒక్క సిక్స్ కూడా కొట్టలేదు. ఇషాంత్ ప్రస్తుతం భారత్ తరపున ఏ ఫార్మాట్‌లోనూ క్రికెట్ ఆడటం లేదు. 2007లో భారత జట్టు తరపున టెస్ట్ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన ఇషాంత్, పొడవైన ఫార్మాట్‌లో ఒకసారి కూడా సిక్స్ కొట్టాడు. అతను ఇప్పటివరకు టెస్ట్ క్రికెట్‌లో 2568 బంతులు ఆడాడు. అందులో తన పేరు మీద అర్ధ సెంచరీని కలిగి ఉన్నాడు. మూడు ఫార్మాట్‌లను కలిపి, మొత్తం 199 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. ఇషాంత్ శర్మ నవంబర్ 2021లో భారత జట్టు తరపున తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. ప్రస్తుతం టీమిండియాకు దూరంగా ఉన్నాడు.






ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్:

# భారత్ షూటర్లు అద్భుత ప్రదర్శన

## ఐశ్వరీ, సిఫ్ట్‌కౌర్, ఎలావెనిల్‌లకు స్వర్ణం

**న్యూఢిల్లీ:** భారత షూటర్లు గత కొన్ని సంవత్సరాలుగా అంతర్జాతీయ సర్క్యూట్‌లో అద్భుతమైన విజయాన్ని ప్రదర్శించారు. ఇప్పుడు వారు కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో శనివారం జరిగిన 2025 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, సిఫ్ట్ కౌర్ సమ్రా, ఎలావెనిల్ వలరివన్ స్వర్ణ పతకాలను సాధించారు. దీంతో భారత్ ఖాతాలో 30కి పైగా పతకాలు చేరి షూటర్లు తమ ఆధిపత్యాన్ని పునరుద్ఘాటించారు. 14 స్వర్ణాలు, 8 రజతాలు, 9 కాంస్య పతకాలతో 31 భారీ పతకాల రికార్డుతో భారతదేశం ఈ ఖండాంతర పోటీలలో తమ అత్యుత్తమ పతకాల సంఖ్యను నమోదు చేసింది. పతకాల పట్టికలో చైనా తర్వాత రెండవ స్థానంలో నిలిచింది. భారతదేశం చాలా కాలంగా రైఫిల్ షూటింగ్‌కు గుర్తింపు పొందింది. కానీ ఇటీవలి సంవత్సరాలలో కొంత అసమానత కనిపించింది. అయితే, ఈ ఈవెంట్‌లో రైఫిల్ ఈవెంట్లలో వారు ఆరు బంగారు పతకాలను సాధించడం బలమైన ప్రదర్శనగా నిలిచింది. అదనంగా, ఈ ఆరు బంగారు పతకాలలో నాలుగు ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ (50 మీ 3 పి), సిఫ్ట్ కౌర్ సమ్రా (50 మీ 3 పి), ఎలావెనిల్ వలరివన్ (ఎయిర్ రైఫిల్) మరియు ఎయిర్ రైఫిల్ మిశ్రమ జట్టు గెలుచుకున్న ఒలింపిక్స్ విభాగాలలో ఉన్నాయి. మిగతా రెండు బంగారు పతకాలు ఎయిర్ రైఫిల్ పురుషుల జట్టు మరియు మహిళల 50 మీటర్ల 3 పి జట్టు దక్కించుకున్నాయి.

# ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో రచ్చ రచ్చ

## సౌత్ ఢిల్లీపై 7 వికెట్ల తేడాతో వెస్ట్ ఢిల్లీ విక్టరీ

**న్యూఢిల్లీ:** ఢిల్లీ ప్రీమియర్ లీగ్ 2025 ఎలిమినేటర్ మ్యాచ్‌లో సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్స్, వెస్ట్ ఢిల్లీ లయన్స్ మధ్య తీవ్రమైన గొడవ జరిగింది. క్రిష్ యాదవ్ అవుట్ అయిన తర్వాత ఇరు జట్ల ఆటగాళ్ళు ఒకరిపై ఒకరు దూసుకెళ్లారు. వెస్ట్ ఢిల్లీ లయన్స్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించి క్వాలిఫయర్ 2కు చేరుకుంది. సౌత్ ఢిల్లీ, వెస్ట్ ఢిల్లీ మధ్య మ్యాచ్‌లో పెద్ద గొడవ జరిగి ఇరు జట్లకు చెందిన ఇద్దరు ఆటగాళ్లు ఒకరిపైకి ఒకరు దూసుకెళ్లారు. 11వ ఓవర్‌లో 202 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో వెస్ట్ ఢిల్లీ లయన్స్ ఓపెనర్ క్రిష్ యాదవ్ అమన్ భారతి బౌలింగ్‌లో అవుట్ అయిన తర్వాత ఈ రచ్చ జరిగింది. 11వ ఓవర్ తొలి బంతికి పేసర్ భారతిని లాంగ్‌ఆఫ్ కోసం సిక్స్ కొట్టడానికి క్రిష్ ప్రయత్నించాడు. అయితే సరిగ్గా టైమ్ కాకపోవడంతో బౌండరీ రోప్ దగ్గర అన్మోల్ శర్మ చేతిలో క్యాచ్ అవుట్ అయ్యాడు. ఆ సమయంలోనే రెండు వైపుల ఆటగాళ్లు ఒకరినొకరు తోసుకుంటూ తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. సూపర్‌స్టార్జ్ తరపున కీలకమైన వికెట్ తీసుకున్న ఈ పేసర్, అవుటైన బ్యాటర్ వైపు చూస్తూ ఏదో అన్నాడు. దాంతో క్రిష్ యాదవ్ వికెట్ దగ్గరకు తిరిగి వచ్చి కొన్ని మాటలతో ఎదురుదాడికి దిగాడు. సూపర్ స్టార్స్ కు చెందిన సుమిత్ మాథుర్ క్రిష్ వైపు దూసుకుపోతూ వేలు చూపిస్తూ ఏదో అన్నాడు. పరిస్థితి చాలా తీవ్రంగా మారడంతో వెస్ట్ ఢిల్లీ కెప్టెన్ నితీష్ రాణా ఆన్‌ఫీల్డ్ అంపైర్లతో కలిసి జోక్యం చేసుకుని సుమిత్, క్రిష్ లను విడదీయాల్సి వచ్చింది. లేడీ అంపైర్ క్రిష్‌ను ఫీల్డ్ నుంచి వెళ్లిపోవాలని కోరగా, నితీష్ రాణా సుమిత్ భుజం చుట్టూ చేయి వేసి వెనక్కి తీసుకెళ్లడంతో గొడవ సద్దమణిగింది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే నితీష్ రాణా నేతృత్వంలోని జట్టు 202 పరుగుల లక్ష్యాన్ని ఇంకా 17 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. కెప్టెన్ 55 బంతుల్లో 8 ఫోర్లు, 15 సిక్సర్లతో అజేయంగా 134 పరుగులు చేయడంతో ఈ విజయం సాధ్యమైంది. ఎడమచేతి వాటం రాణా 243.64 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. అంతకుముందు కెప్టెన్, వికెట్ కీపర్‌బ్యాటర్ తేజస్వి దహియా 60 పరుగులతో చెలరేగడంతో సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్జ్ నిర్ణీత ఇరవై ఓవర్లలో 201/5 పరుగులు చేసింది.




## కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో

# మెహాక్, లవ్‌ప్రీత్‌కు రజతం, కాంస్యం

**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ వెయిట్ లిఫ్టర్లు రజతం, కాంస్యంతో ముగించారు. దీంతో ఈ ఛాంపియన్‌షిప్‌లో 13 పతకాలతో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. సీనియర్ కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో చివరి రోజు శనివారం భారత వెయిట్‌లిఫ్టర్లు హెవీవెయిట్ విభాగాలలో రెండు పతకాలు సాధించారు. మెహాక్ శర్మ (86+ కిలోలు) మరియు లవ్‌ప్రీత్ సింగ్ (110+ కిలోలు) వరుసగా రజత మరియు కాంస్య పతకాలను గెలుచుకున్నారు, దీనితో భారత పతకాల సంఖ్య 13కి చేరుకోగా, ఇందులో 4 స్వర్ణాలు, 6 రజతాలు మరియు 3 కాంస్య పతకాలు ఉన్నాయి. ఇక మీరాబాయి చాను (48 కిలోలు), రిషికాంత సింగ్ (60 కిలోలు), అజిత్ నారాయణ (71 కిలోలు), మరియు అజయ బాబు (79 కిలోలు) అనే నలుగురు బంగారు పతక విజేతలు 2026 కామన్వెల్త్ క్రీడలకు తమ స్థానాలను నిర్ధారించుకోవడంతో భారతదేశం నైజీరియాను అధిగమించి అగ్రస్థానంలో నిలిచింది. అలాగే చివరి రోజు పురుషుల 110 కిలోల ఫైనల్‌తో ప్రారంభమైంది. ఇక్కడ హార్చరణ్ సింగ్ కేవలం 1 కిలోల తేడాతో పతకాన్ని కోల్పోయాడు. మొత్తం 355 కిలోలు ఎత్తి ఫిజియన్, సమోవాన్ మరియు న్యూజిలాండ్ వెయిట్‌లిఫ్టర్ల కంటే నాల్గవ స్థానంలో నిలిచాడు. ఆ తర్వాత, భారతదేశపు సూపర్ హెవీవెయిట్ జాతీయ రికార్డు హోల్డర్ మెహాక్ శర్మ మైదానంలోకి ప్రవేశించి, తన జాతీయ రికార్డులను తిరగరాసి, వ్యక్తిగత ఉత్తమ మొత్తం 253 కిలోల ఎత్తి రజత పతకాన్ని సాధించింది.



## హాకీ ఆసియా కప్‌లో..

# బంగ్లాదేశ్‌ను ఓడించిన మలేసియా

## కొరియా చేతిలో చైనీస్ తైపీ చిత్తు

**న్యూఢిల్లీ:** హాకీ ఆసియా కప్-2025, తొలి మ్యాచ్‌ల్లో బంగ్లాదేశ్‌ను మలేషియా ఓడించగా, కొరియా చేతిలో చైనీస్ తైపీ చిత్తయింది. పురుషుల ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో మలేషియా, డిఫెండింగ్ ఛాంపియన్స్ దక్షి ణ కొరియా తమ పూల్ బి ప్రచారాలను విజయాలతో ప్రారంభించాయి. అయితే విభిన్న శైలిలో ప్రపంచ 12వ ర్యాంక్ మలేషియా తొలి దశలో వెనుకబడినా, తదుపరి కోలుకుని 29వ ర్యాంక్ ఉన్న బంగ్లాదేశ్‌ను 4-1 తేడాతో ఓడించింది. అలాగే హోల్డర్ కొరియా ఏకపక్ష పోటీలో చైనీస్ తైపీని 7-0 తేడాతో చిత్తు చేసింది. 16వ నిమిషంలో అష్రఫుల్ ఇస్లాం పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచినప్పుడు బంగ్లాదేశ్ ఆట ప్రారంభంలోనే స్కోరు చేసింది. అయితే, అష్రాన్ హంసాని చక్కటి ఫీల్డ్ గోల్‌తో జట్టు స్కోరును తిరిగి సాధించడంతో బంగ్లాదేశ్ ఆధిక్యం 25వ నిమిషం వరకు మాత్రమే కొనసాగింది. విరామం తర్వాత, మలేషియా గోల్ చేసింది. అఖిముల్లా అనువార్ (36) వారికి ఆధిక్యాన్ని అందించగా, ముహాజిర్ అబ్దుల్ రౌఫ్ (48), సయ్యద్ చోళన్ (54, పెనాల్టీ కార్నర్) ఆధిక్యాన్ని పెంచి 3 పాయింట్లు సాధించారు. మలేషియా వారి 4 పెనాల్టీ కార్నర్లలో ఒకదాన్ని గోల్‌గా మార్చగా, బంగ్లాదేశ్ వారి 2కార్నర్లలో ఒకదాని నుండి గోల్ చేసింది. తరువాత, దక్షి ణ కొరియా డైన్ సన్ హ్యాట్రిక్ (17, 29, 58)తో ఆధిక్యాన్ని ప్రదర్శించగా, జిహున్ యాంగ్ పెనాల్టీ కార్నర్ల ద్వారా (27, 50) రెండుసార్లు గోల్స్ చేశాడు. సెయోంగ్ ఓహ్ (53) మరియు యూన్హో కాంగ్ (54) స్కోరు రేఖకు మరింత మెరుపులు జోడించారు. చివరి నిమిషాల్లో సన్ తన ట్రెబుల్‌ను పూర్తి చేయడంతో కొరియా 7-0 తేడాతో ఓటమి పాలైంది.




# రూ.లక్ష దాటిన తులం బంగారం

**ముంబయి, ఆగస్టు 30:** దేశంలో బంగారం ధరలు మళ్లీ పరుగులు పెడుతున్నాయి. తగ్గినట్లే తగ్గి ఒక్కసారిగా రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. తులం బంగారం ధర ఇప్పుడు లక్షా 5 వేల రూపాయల వరకు ఉంది. స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతుండటంతో బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయి. గత కొన్ని రోజులుగా పసిడి ధరలు ఊగిసలాడుతున్నాయి. శనివారం మధ్యాహ్నం సమయానికి బంగారం ధరల్లో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. తులం బంగారంపై ఏకంగా 1640 రూపాయలు పెరిగింది. దీని బట్టి చూస్తే ఇంకా ఎంత పెరుగుతుందో ఊహించవచ్చు. ప్రస్తుతం 24 క్యారెట్ల బంగారం ధర రూ.1640 పెరిగి 1,04,950కు చేరుకుంది. అంటే దాదాపు రూ.లక్షా 5వేల వద్ద నమోదైనట్లే. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధరపై రూ.1200 పెరిగి 96,200 రూపాయల వద్ద ఉంది. ఇక వెండి విషయానికొస్తే ఇది కూడా నేనెందుకు తగ్గాలి అన్నట్లు 1100 రూపాయలు పెరిగింది. ప్రస్తుతం కిలో వెండి ధర 1,21,000 ఉంది. ఇక హైదరాబాద్, కేరళ, చెన్నై నగరాల్లో అయితే మరింత ఎక్కువగా ఉంది. ఇక్కడ కిలో సిల్వర్ ధర 1,31,000 ఉంది. బంగారం ధరల పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయని బులియన్ నిపుణులు అంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి పెరగడం, డాలర్ విలువలో మార్పులు రావడం, అంతర్జాతీయ మార్కెట్లో బంగారం డిమాండ్ అధికంగా ఉండటం ఇవన్నీ ప్రధాన కారణాలు అని చెబుతున్నారు. అంతేకాదు ద్రవ్యోల్బణం పెరిగిన సందర్భాల్లో చాలా మంది పెట్టుబడిదారులు బంగారం వైపు మళ్లడం వల్ల ధరలు ఇంకా ఎగబాకుతున్నాయి. ఇక రానున్న పండుగ సీజన్‌లో భారత్‌లో బంగారం డిమాండ్ మరింత పెరుగుతుందని అంచనా.





# సెప్టెంబరు నుంచి వెండిపైనా హాల్‌మార్క్!

**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** ఈ ఏడాది సెప్టెంబరుమాసం ప్రారంభంలోనేసామాన్యులకు అనేక కొత్త మార్పులను తీసుకువస్తోంది. ఈ మార్పులు గృహ ఖర్చులు, బ్యాంకింగ్, పెట్టుబడి, రోజువారీ అవసరాలకు సంబంధించినవి. సెప్టెంబర్ 1 నుండి అమలు చేయబోయే 5 ప్రధాన మార్పు ముఖ్యమైనవే ఉన్నాయి. ఇప్పటివరకు బంగారు ఆభరణాలపై మాత్రమే హాల్‌మార్కింగ్ అనే నియమం ఉండేది. కానీ సెప్టెంబర్ 1 నుండి ఈ నియమం వెండిపై కూడా వర్తిస్తుంది. అంటే ఇప్పుడు మీరు ఏ వెండి ఆభరణాలు లేదా పాత్రలను కొనుగోలు చేసినా దానికి ఖచ్చితంగా హాల్‌మార్క్ ముద్ర ఉంటుంది. ఇది వినియోగదారులకు స్వచ్ఛమైన నమ్మకమైన ఉత్పత్తులను అందిస్తుంది. నకిలీ వస్తువుల నుండి వారిని రక్షిస్తుంది. దేశంలోని అతిపెద్ద బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన కార్డుదారులకు ఛార్జీలను పెంచాలని నిర్ణయించింది. కొత్త నిబంధనల ప్రకారం, ఒక కస్టమర్ ఆటోడెబిట్ విఫలమైతే అతనిపై 2శాతం జరిమానా విధించనుంది. దీనితో పాటు పెట్రోల్ పంపులలో అంతర్జాతీయ లావాదేవీలు, కార్డ్ చెల్లింపులకు మరిన్ని ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ఆన్‌లైన్ షాపింగ్‌లో అందుకున్న రివార్డ్ పాయింట్ల విలువ కూడా తగ్గవచ్చు. సిలిండర్ ధరలు ప్రతి నెల ఒకటో తేదీన నిర్ణయిస్తారు. చమురు కంపెనీలు సెప్టెంబర్ 1న కొత్త ధరలను కూడా విడుదల చేస్తాయి. ఈ ధరలు అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర, డాలర్, రూపాయి కదలికలపై ఆధారపడి ఉంటాయి. ధర పెరిగితే వంటగది బడ్జెట్ ఎటిఎం నుండి నగదు తీసుకోవడం ఖరీదైనదే. బ్యాంకింగ్ రంగం క్రమంగా డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో అనేక బ్యాంకులు నుండి నగదు ఉపసంహరణపై కొత్త నియమాలను అమలు చేయనున్నట్లు ప్రకటించాయి. నిర్ణీత పరిమితి కంటే ఎక్కువ నగదు తీసుకుంటే వినియోగదారులు అధిక ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అంటే ఇప్పుడు మీరు ఎటిఎం నుండి ఎప్పుడు ఎన్నిసార్లు డబ్బు తీసుకోవాలో ఆలోచించాల్సి ఉంటుంది. సెప్టెంబర్‌లో చాలా బ్యాంకులు తమ నీదీ పథకాలపై వడ్డీ రేట్లను సమీక్షిస్తాయి. ఇప్పటివరకు చాలా బ్యాంకులు 6.5శాతంనుండి 7.5శాతంవరకు వడ్డీని ఇస్తున్నాయి. ఇండియా పోస్ట్ రిజిస్టర్డ్ పోస్ట్‌ను స్పీడ్ పోస్ట్‌తో విలీనం చేయనున్నట్లు ప్రకటించింది. దీని తర్వాత సెప్టెంబర్ 01 నుండి పంపిన రిజిస్టర్డ్ మెయిల్ ఇప్పుడు నేరుగా స్పీడ్ పోస్ట్ ద్వారా పంపుతారు.




# ఎస్‌బ్యాంకులో ఎస్ఎంబిసి రూ.16వేల కోట్ల పెట్టుబడులు!

**ముంబయి, ఆగస్టు 30:** ప్రైవేటురంగంలోని ఎస్‌బ్యాంకు షేర్లు నాలుగుశాతంపెరిగాయి. సుమిటోమో మిత్సుయి బ్యాంకింగ్ కార్ప్ (ఎస్ఎంబిసి) అదనంగా 16 వేల కోట్లు బ్యాంకులో పెట్టుబడులుపెట్టేందుకు ముందుకువచ్చింది. అంతకుముందు ఇదేనెలలోనే 13,483 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువచ్చింది. బ్యాంకు స్టాక్స్ 4.66శాతంపెరిగి 19.55కు చేరింది. ఇంట్రాడేలో స్టాక్ 3.8శాతంపెరిగింది. బ్యాంకు షేర్లు రెండురోజులు పాటు నష్టాల్లో నడిచిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 3.5రెట్లు సగటున పెరిగాయి. 30 రోజుల రటేడింగ్ వాల్యూమ్‌నపు పరిశీలిస్తేభారీ పెరుగుదల నమోదుచేసింది. ఎస్‌బ్యాంకు మొత్తం మార్కెట్ విలువలు లక్ష కోట్లకు చేరువగా ఉన్నట్లు నిపుణులు అంచనావేస్తున్నారు. అదేవిధంగా జపాన్ ఆర్థికరంగ దిగ్గజం ఎస్ఎంబిసి బ్యాంకులో 16 వేల కోట్లు పెట్టుబడులుపెడుతోంది. యెన్ ఆధారిత బాండ్లరూపంలో 8500 కోట్లు రానున్నాయి. రెండుశాతం వడ్డీకే ఈ నిధులు అందచేసేందుకు నిర్ణయించింది. ఈక్విటీలో 7500 కోట్లు విదేశీ కరెన్సీ బదలీబాండ్ల రూపంలో ఈ పెట్టుబడులు ఉంటాయనితేలింది. ఎస్ఎంబిసి అంతకుముందు ఇచ్చిన13,500 కోట్లహామీతో బ్యాంకులో 20% వాటా సాధించగలుగుతోంది. ఎస్‌బిఐ కూడా బ్యాంకులో బాటాతో ఉంది. ఆర్బీఐ ఎస్ఎంబిసికి బ్యాంకులో 24.99 శాతం వాటా కొనుగోలుకు ఆమోదం తెలిపింది. జపాన్ బ్యాంకు భారత్‌లో తన విస్తరణ ప్రణాళికలను ఈ బ్యాంకులో పెట్టుబడులతో స్పష్టం అవుతోంది.

## మెహుల్‌చోక్సీ బెయిల్ తిరస్కరించిన

# బెల్జియం కోర్టు!

**బ్రస్సెల్స్, ఆగస్టు 30:** పంజాబ్‌నేషనల్ బ్యాంకు ను మోసంచేసిన కేసులో ఉద్దేశ్యపూర్వక ఎగవేత నిందితునిగా ఉన్న ఆభరణాల వ్యాపారి మెహుల్‌చోక్సీ బెయిల్ అభ్యర్థనను బెల్జియంలోని అప్పీల్స్ కోర్టు తిరస్కరించింది. ఇప్పటికే చోక్సీని భారత్‌కు అప్పగించే పిటిషన్ విచారణచేస్తున్న కోర్టుచోక్సీ బెయిల్‌ను తిరస్కరించింది. భారత్‌లోని సిబిఐ ఆయన బెయిల్‌పై అభ్యంతరాలు చెపుతూ పటిష్మైన ఆధారాలు చూపించింది. అంతకుముందే చోక్సీ అనేక దేశాలనుంచి తప్పించుకున్నారని, న్యాయ పరమైన విచారణను తప్పించుకునేందుకు ఇపుడు మళ్లీ ఇంకో దేశం పరారయ్యేందుకు బెయిల్‌కోరుతున్నారని వాదించింది. ఏప్రిల్‌లోనే బెల్జియంలో చోక్సీని సిబిఐ అభ్యర్థన మేరకు అరెస్టుచేసారు. అంతకుముందు బెల్జియంలోని సెస్సేషన్ కోర్టు చోక్సీ బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. ఈనెల 22న మరో బెయిల్‌పిటిషన్ దాఖలుచేసారు. ఆయన్ను హౌస్ అరెస్టుచేయడంపై అభ్యంతరాలు వ్యక్తంచేసారు. గృహనిర్బంధంలో ఉంచి మాపై నిఘా ఉంచారని చేసిన వాదనలను కూడా ఈవారంలోనే కోర్టు తిరస్కరించింది. 66 ఏళ్ల చోక్సీ గీతాంజలి గ్రూప్ అధినేత. ఇపుడు ఆయన్ను భారత్‌కు అప్పగించాలన్న సిబిఐ వాదనలను బెల్జియం కోర్టు విచారణచేస్తోంది. మరోసారి సెప్టెంబరు మధ్యస్తంలో కూడా విచారణకు రావచ్చని అంచనా. పంజాబ్‌నేషనల్ బ్యాంకును రూ.13వేల కోట్లు మోసం చేసిన కేసులో ఆభరణాల వ్యాపారి నీరవ్‌మోడీతోపాటు మెహుల్‌చోక్సీని కూడా సిబిఐ నిందితునిగా చేర్చింది.



# ఐదేళ్లలో రూ.1.66 లక్షలకోట్ల పెట్టుబడులు

## విస్తరణ బాటలో చమురు కంపెనీ ఐఒసి

**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** ప్రభుత్వరంగంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వచ్చే ఐదేళ్లలో 1.66 లక్షలకోట్లను పెట్టుబడులుపెట్టేందుకు నిర్ణఇంచింది. ఈ పెట్టుబడులు చమురుశుద్ధి, ఇంధన మార్కెటింగ్, పెట్రోకెమికల్స్ వెంచర్స్, సహజవాయువు, పునరుత్పత్తి విద్యుత్ విభాగాల్లో ఉంటాయని ఛైర్మన్ అరవిందర్ సింగ్ సాహ్నీ వెల్లడించారు. కంపెనీ వాటాదారుల వార్షిక సదస్సు శనివారం జరిగింది. ప్రస్తుతం ముడి చమురుశుద్ధి సామర్థ్యం 80.75 మిలియన్ టన్నుల నుంచిసాలీనా 98.4 మిలియన్ టన్నులకు పెంచాలని నిర్ణయించింది. 2028నాటికి ఈ సామర్థ్యం పెరుగుతోంది. పానిపట్, గుజరాత్, బరౌని ప్రాంతాల్లోని ప్లాంట్లను ఈ సామర్థ్యం పెంపునకు వినియోగిస్తోంది. మొత్తం 22 వేల కిలోమీటర్ల మేర 21 ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి. కొత్త నిల్వ సౌకర్యం నేపాల్‌లో కూడా ఏర్పాటుచేయాలనినిర్ణయిస్తోంది. పెట్రోకెమికల్స్ సామర్థ్యం 4.3 మిలియన్ టన్నులనుంచి 2030 నాటికి 13 మిలియన్ టన్నులకు పెంచుతోంది. దిగుమతులను తగ్గించుకుని స్వయం సమృద్ధిపైనే ఫోకస్ పెడుతోంది. దేశవ్యాప్తంగా 40 వేలకుపైగా ఇంధన స్టేషన్లు ఉన్నాయి. ఈవీ ఛార్జర్లు, బ్యాటరీ స్వాపింగ్ పాయింట్లు సిఎన్‌జి ఎల్ఎన్‌జి యూనిట్లు అధికంగా ఉన్నాయి. ఐఒసి ఇప్పటికే ఇంధన పరివర్తన ప్రాజెక్టుల్లో 2.5 లక్షలకోట్లు కేటాయించింది. 2046కల్లా కర్బన ఉద్గారాలు లేని వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించింది. గ్రీన్ హైడ్రోజెన్, ఏవియేషన్ ఇంధనం, పునరుత్పత్తి విద్యుత్ కెపాసిటీని ఒక గిగావాట్‌నుంచి 18 గిగావాట్లకు మూడేళ్లలోనే పెంచాలనినిర్ణఇంచింది. ప్రస్తుతం సహజవాయు ఉత్పత్తి సాలీనా 7.9 మిలియన్ టన్నులు ఉంది. 21 రాష్ట్రాల్లో 49 కేంద్రాల్లో అన్వేషణ సాగుతోంది. రష్యా ఉక్రెయిన్ భౌగోళిక వివాదాలతో మధ్యప్రాచ్యంలో అనేక అడ్డంకులు వస్తున్నాయి. దీనికితోడు అమెరికానుంచి వస్తున్న సుంకాల అడ్డంకులు కూడా విస్తరణకు బ్రేకులు వేస్తునానననయని తెలుస్తోంది.




వాణిజ్యం

# 4 స్మాల్‌క్యాప్ స్టాక్స్‌లో భారీ రిటర్నులు!

**ముంబయి, ఆగస్టు 30:** భారత్ స్టాక్ మార్కెట్లలో నాలుగు స్మాల్‌క్యాప్ స్టాక్స్ మంచి రిటర్నులు ఇచ్చాయి. బిఎస్ఇలో వారాంతంలోని ఇంట్రాడే ట్రేడింగ్‌లోనే భారీ మొత్తాలకు కొనుగోళ్లచేసింది. ఈ నాలుగు సంస్థల షేర్లు భారీ స్థాయిలో పెరిగాయి. అపోలో మైక్రోసిస్టమ్స్, హెచ్‌బిఎల్ ఇంజనిరింగ్, షైలీ ఇంజినీరింగ్ ప్లాస్టిక్స్, టైమ్స్‌గ్రూప్ ఇండియా షేర్లు మంచి రాబడులు సృష్టించినట్లు చెపుతున్నారు. 36 నుంచి 56శాతంవరకూ పెరిగినట్లు తేలింది. బిఎస్ఇ సెన్సెక్స్, స్మాల్‌క్యాప్‌సూచీలు వరుసగా ఒకటిశాతం, మూడుశాతం చొప్పున డౌన్ అయిన స్థితిలో ఈస్టాక్స్ భారీ వృద్ధినమోదుచేసాయి. అపోలో మైక్రో 12శాతంపెరిగి 271.60కి చేరింది. 34 మిలియన్ల వాటాలు చేతులుమారాయి. ఆగస్టులోనే 56శాతంపెరిగాయి. డిఆర్‌డిఒనుంచి 25.12 కోట్లమేర ఆర్డరు సాధించడంతో కంపెనీ ఆర్డరుబుక్ ప్రస్తుతం రూ.735 కోట్లుగా ఉంది.అలాగే షైయిలీ ఇంజినీరింగ్ ప్లాస్టిక్స్ ఆరుశాతంపెరిగి 2230.15కు ఇంట్రాడేలో పెరిగాయి. కంపెనీ స్టాక్స్ 41శాతంపెరిగాయి. అలాగే హెచ్‌బిఎల్ ఇంజినీరింగ్ స్టాక్స్ కూడా ఐదుశాతంపెరిగి 819.80కి పెరిగాయి. హెచ్‌బిఎల్‌కంపెనీకి సర్వే, డిజైన్, సరఫరా, వ్యవస్థ ఏర్పాటు, టెస్టింగ్, ట్రాక్‌సైడ్ కవచ్ వ్యవస్థ ఏర్పాటుకు పశ్చిమమధ్యరైల్వే అంగీకార పత్రం ఇవ్వడంతో కంపెనీ షేర్లు జూమ్ అయ్యాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942-271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.